శ్రీమద్రామాయణము

యుద్ధ కాండము

(మొదటి భాగము)

సంస్కృత మూలము

భగవాన్ వాల్మీకి మహర్షి

తేటతెలుగులో

మొదలి వెంకట సుబ్రహ్మణ్యం

2-31, చైతన్యపురి,

హైదరాబాదు 500060

ఫో: 24048104

సెల్: 9391134792

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము.

శ్రీరాముడు హనుమంతుడు చెప్పిన మాటలను శ్రద్ధగా విన్నాడు. చాలా సంతోషించాడు.

“హనుమా! ఇతరులకు దుర్లభమైన కార్యమును నువ్వు నెరవేర్చావు. నాకు చాలా సంతోషంగా ఉంది. నూరు యోజనముల దూరము ఉన్న సముద్రమును వాయు దేవుడు, గరుడుడు, నీవు తప్ప తక్కిన వారు దాటలేరు. అంతే కాదు, దేవతలకు, దానవులకు, గంధర్వులకు, నాగులకు కూడా ప్రవేశించుటకు వీలుకాని లంకానగరములోకి ప్రవేశించి క్షేమంగా తిరిగి వచ్చావు. అది నీకే సాధ్యమయింది.

దీనిని బట్టి చూస్తే లంకా నగరములోకి హనుమంతుడు, అతనికి సమానమైన బలపరాక్రమ ములు కల వాడు తప్ప, ఇతరులు ప్రవేశించలేరు అని తెలింది. కేవలము హనుమంతుడే తన బలమును పరాక్రమమును ఉపయోగించి సుగ్రీవుని ఆజ్ఞను నెరవేర్చాడు. అది ఎంత కష్టమైన కార్యము అయినా, దానిని ఆసక్తితో, చాకచక్యముతో నెరవేర్చినవాడే భృత్యులలో ఉత్తముడు అని చెప్పబడతాడు. బుద్ధిముంతుడు, సమర్థుడు అయి ఉండి కూడా, చెప్పిన పనిని ఎంత వరకు చెప్పాడో అంతవరకే చేసేవాడిని మధ్యముడు అని చెప్పబడతాడు. బుద్ధిమంతుడు, సమర్థుడు అయి ఉండి కూడా, రాజు చెప్పిన కార్యమును శ్రద్ధతో చేయడో, అతడు అధముడుఅని చెప్పబడతాడు. హనుమంతుడు ఉత్తముడైన భృత్యుడు.

సుగ్రీవుడు చెప్పినదాని కంటే ఎక్కువే చేసుకొచ్చాడు

హనుమంతుడు. పైగా అత్యంత చాకచక్యంతో సమర్థతతో చేసుకొచ్చాడు. సుగ్రీవునకూ, నాకూ సంతోషాన్ని కలిగించాడు. ఈ హనుమంతుడు లంకకు పోయి సీతను చూచి వచ్చి నన్ను, లక్ష్మణుని, రఘువంశమును రక్షించాడు. నాకు ఇంతటి ప్రియమును చేకూర్చిన హనుమంతునికి నేను ఏమీ ప్రత్యుపకారము చేయలేకున్నాను. నాకు చాలా బాధగా ఉంది.

హనుమా! ఇటురా. ఈ ఆనంద సమయంలో నేను నీకు నా ఆలింగనము తప్ప వేరే ఏమీ ఇవ్వలేకున్నాను." అని పలికి రాముడు హనుమంతుని తన రెండు చేతులు చాచి గాఢంగా కౌగలించుకున్నాడు.

తరువాత రాముడు సుగ్రీవుని, దక్షిన దిక్కుకు వెళ్లిన వానరములను, వానర సైన్యాధిపతులను చూచి ఇలా అన్నాడు. "మీరందరూ సీతాన్వేషణమును విజయవంతంగా పూర్తిచేసారు. సీతను గురించిన సమాచారమును తీసుకొని వచ్చారు. కాని నూరు యోజనముల పొడవు ఉన్న సముద్రమును తలచుకుంటేనే భయంగా ఉంది. సీతను గురించి తెలిసినది కానీ, మన వానర సైన్యము ఆ సముద్రమును ఎలా దాటగలదో తెలియకుండా ఉంది." అని చింతాక్రాంతు డయ్యాడు రాముడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము మొదటి సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

రెండవ సర్గ.

రాముడు పలికిన పలుకులు విన్న సుగ్రీవుడు రామునితో ఇలా అన్నాడు. "రామా! నీవుమహా వీరుడవు. ఈ చిన్నవిషయానికి సామాన్యుని వలె ఇంతగా చింతించవలెనా! ఓరామా! ఇప్పుడు మనకు సీత ఎక్కడ ఉందో తెలిసింది. ఆమెను ఎవరు అపహరించుకొని వెళ్లారో, శత్రువు ఎక్కడ ఉంటాడో తెలిసింది. ఇంక యుద్ధమే మిగిలింది. దీనికి దు:ఖించడం ఎందుకు?

రామా! నీవు బుద్ధిమంతుడవు. సకల శాస్త్ర పారంగతుడవు. మంచి ఆలోచనా శక్తి కలవాడవు. ఎంతటి క్లిష్ట సమయంలో కూడా సరి అయిన నిర్ణయాలు తీసుకోడంలో సమర్థుడవు. కాబట్టి ఈ చిన్న చిన్న విషయాల గురించి ఆలోచించడం వదిలిపెట్టు. మనం అందరం అపారమైన వానరసేనతో సముద్రమును దాటి లంకకు వెళుతున్నాము. నీ శత్రువును సంహరిస్తున్నాము. సీతను అయోధ్యకు తీసుకొని వస్తున్నాము. ఓరామా! నిరుత్సాహంతో, బుద్ధిమందగించి, చేయబోయే కార్యమును గురించి దిగులు పడే వాడికి అతడు తలపెట్టిన కార్యములు నెరవేరవు. పైగా అన్నీ కష్టాలే కలుగుతాయి.

ఓ రామా! ఒక్కసారి ఈ వానర నాయకులను ఒక్కసారి చూడు. వీరు అత్యంత శూరులు. ఏ పని చెయ్యడానికైనా సమర్థులు. నీవు ఆజ్ఞాపిస్తే అగ్నిలో కూడా దూకడానికి వెనుకాడరు. వారి మొహాలలో తొణికిసలాడుతున్న సంతోషాన్ని గమనించు. కాబట్టి, లంకను ఎలా చేరుకోవాలా అనే సందేహమును వదిలిపెట్టి, రావణుని ఎలా జయించాలో, సీతను

ఎలా తీసుకురావాలో ఆలోచించు. నూరు యోజనములపొడవు ఉన్న సముద్రము మీద సేతువును ఎలా నిర్మించాలో ఆలోచించు. సముద్రము మీద సేతువును నిర్మించకుండా మనము సాగరమును దాటలేము. మనము సేతువును నిర్మించి, సముద్రము దాటి లంకను చేరితో చాలు, మన రాకను విని రావణుడు సగం చస్తాడు.

ఇదంతా జరగాలంటే ముందు నీ మనస్సులో మెదులుతున్న వైక్లబ్యాన్ని విడిచిపెట్టాలి. ధైర్యంగా ఆలోచించాలి. మనస్సు బలహీనమైతే, మనిషిలో ఉన్న శౌర్యము నశించిపోతుంది. నీ సహజ శౌర్యాన్ని, బలాన్ని ప్రదర్శించు. కార్య సాధనకు ఉపక్రమించు. అంతే గాని సముద్రము ఎలా దాటాలా అనే దాని గురించి ఆలోచిస్తూ దిగులుపడవద్దు. శోకము సకల కార్యములను నాశనం చేస్తుంది. నీకుసాయంగా నేను ఉన్నాను. ఈ వానర వీరులు ఉన్నారు. మనమంతా కలిసి శత్రువును జయిస్తాము. సందేహము లేదు.

రామా! నీవు ధనుస్సు చేత ధరించి, రణరంగములో నిలిస్తే, నీకు ఎదురు నిలిచేవాడు ఈ ముల్లోకములలో లేడు. అటువంటప్పుడు నీవు ఇలా శోకించడంలో అర్థం లేదు. నీ శోకాన్ని విడిలి పెట్టు. మనమంద రమూ సముద్రమును దాటి లంకను చేరి, సీతను చూస్తాము. ఇది నిజం. కాబట్టి మనం అందరం ఇప్పుడు సముద్రమును ఎలా దాటాలా అని ఆలోచించాలి. ఒక సారి సముద్రము దాటితే జయం మనదే అవుతుంది అనడంలో సందేహము లేదు. ఎందుకంటే ఈ వానరులు అందరూ పరాక్రమవంతులు. రాక్షసులను నాశనం చేయగల సమర్థులు. మనం అందరం ఏదో విధంగా సముద్రమును దాటగలమని అనుకుం టున్నాను. నాకు మంచి శకునములు కనపడుతున్నాయి. మనకు విజయం

తథ్యం.” అని ధైర్యవచనాలు పలికాడు సుగ్రీవుడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

మూడవ సర్గ.

సుగ్రీవుడు చెప్పిన మాటలను శ్రద్ధగా విన్నాడు రాముడు. సముద్రము మీద వారధి కట్టి సముద్రమును దాటాలి అన్న ఆలోచన రామునికి బాగా నచ్చింది. వెంటనే హనుమంతుని చూచి ఇలా అన్నాడు. “హనుమా! సముద్రమును దాటడానికి మూడు మార్గాలు ఉన్నాయి. ఒకటి తపశ్శక్తి. రెండు. సముద్రమును ఎండించి, అప్పుడు దాటడం. మూడవది సముద్రము మీద వారధి కట్టడం. ఈమూడు చేయడానికి నేను సమర్థుడను. నీవు లంకను బాగా పరిశీలించావు కదా! లంకలో ఎన్ని దుర్గములు ఉన్నాయి? అవి ఎలా నిర్మింపబడ్డాయి. రక్షణ ఏర్పాట్లు ఎలా ఉన్నాయి. లంకలో ఎంత మంది సైనికులు ఉన్నారు. నగరంలో ప్రవేశించడానికి ద్వారములు ఎన్ని ఉన్నాయి. నగరం పరిమాణం ఎంత. నాకు సవిస్తరంగా చెప్పు. ” అని అడిగాడు.

రాముడికి నమస్కరించి హనుమంతుడు ఇలా చెప్పసాగాడు. “ఓ రామా! నాకు తెలిసినంతవరకూ, లంకా నగరము గురించి, దుర్గ నిర్మాణము గురించి చెబుతాను.

లంకలో లెక్కకు మించి ఏనుగులు, రథములు ఉన్నాయి. లంక చాలా విశాలమైన నగరము. అది ఒక పర్వతము మీద నిర్మింపబడి ఉంది. లంకా నగరమునకు నాలుగు పక్కలా నాలుగు ప్రధాన ద్వారములు ఉన్నాయి. ఆ ద్వారములకు ధృడంగా, గట్టిగా నిర్మించ బడ్డ దుర్భేధ్యమైన తలుపులు పెద్ద పెద్ద గడియలతో బంధింపబడి ఉన్నాయి. కోటలో నుండి పెద్ద పెద్ద బండ రాళ్లు, బాణములు శత్రువుల మీద ప్రయోగించడానికి రకరకాలైన యంత్రములు కోట గోడల మీద అమర్చబడి ఉన్నాయి. వాటి సాయంతో బయట నుండి వచ్చే శత్రు సైన్యములను అరికట్టవచ్చును. అవే కాకుండా వందల కొద్దీ శతఘ్నులు ఇనుముతో తయారు చేయబడినవి ద్వారముల వద్ద అమర్చబడి ఉన్నాయి. వాటిని ఏ క్షణంలో అయిన ఉపయోగించడానికి వందలకొద్దీ రాక్షసులు సర్వసన్నద్ధంగా ఉన్నారు.

లంకా నగరమునకు అమర్చబడిన ద్వారములు అన్నీ బంగారుతో చేయబడి ఉన్నాయి. లంకా నగరము చుట్టు ఉన్న పరిఖలలో అంటే కందకములలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. ఆ కందకములలో భయంకరమైన మొసళ్లు ఉన్నాయి. ఆ పరిఖల మీద నాలుగు ద్వారముల వద్ద నాలుగు వంతెనలు అమర్చబడి ఉన్నాయి. ఆ వంతెనల వద్ద కూడా పెద్ద పెద్ద యంత్రములు అమర్చబడి ఉన్నాయి. శత్రు సైన్యములు దాడి చేసినప్పుడు, రాక్షసులు ఆ యంత్రముల ద్వారా బాణములు, బండరాళ్లు విసిరి ఆ వంతెనలను కాపాడుతూ ఉంటారు.

రావణుడు కూడా ఎల్లప్పుడూ యుద్ధమునకు సిద్ధముగా ఉన్నాడు. చాలా అప్రమత్తంగా ఉన్నాడు. రావణుని సైన్యము కూడా ఏ క్షణంలో ఆపద వచ్చినా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉంది. ఆ లంకానగరము

ఎత్తైన పర్వత శిఖరము మీద ఉండటం వలన, చుట్టూ పర్వతములు, దట్టమైన అరణ్యములు ఉండటం వలనా, లంకా నగరము చేరుకోడానికి తగిన ఆధారములు లేవు. మనము లంకకు చేరుకోడానికి నౌకా మార్గము లేదు. లంక నుండి వార్తలు కూడా బయటకు వెళ్లలేవు. ఆ లంకా నగరము చుట్టు ఎత్తైన గోడ, కందకములు, పెద్ద పెద్ద ద్వారములు, వాటిని రక్షించు శతఘ్నులు, యంత్రములు ఉండటం వలన లంకలో వానర సేన ప్రవేశించడం చాలా కష్టం.

లంక తూర్పుద్వారమును పదివేల మంది రాక్షసులు శూలములు, ఖడ్గములు ధరించి రక్షిస్తున్నారు. లంక దక్షిణ ద్వారము వద్ద లక్ష మంది సైనికులు కాపలాగా ఉన్నారు. పశ్చిమ ద్వారము వద్ద పది లక్షల మంది సేనలు ఉన్నాయి. అందరూ కత్తులు, డాలులు ధరించి ఉన్నారు. వారు అస్త్రవిద్యలో కూడా నిపుణులు. ఉత్తర ద్వారము వద్ద కోటి మంది సైనికులు కాపలాగా ఉన్నారు. వారందరూ రథములు, అశ్వములు వాహనములుగా ఉపయోగిస్తున్నారు. లంకా నగరము మధ్యలో ఉన్న సైనిక శిబిరములలో దాదాపు కోటికి మించిన రాక్షస వీరులు ఉన్నారు.

రామా! నేను లంకా దహనము చేసేటప్పుడు నాలుగు పక్కల ఉన్న వంతెనలను కూల్చివేసాను. ప్రాకారములు కూల్చాను. నా మీదికి యుద్ధమునకు వచ్చిన రాక్షస వీరులను చంపాను. రాక్షస సేనలను నాశనం చేసాను. రామా! ఇదీ లంకా నగరస్వరూపము. మనము సముద్రము దాటి లంకా నగరము చేరుకుంటాము. ఇది నిశ్చయము. ఇంక మన సేనల సంగతి. మనవారిలో అంగదుడు, ద్వివిదుడు, మైందుడు, జాంబవంతుడు, పనసుడు, అనలుడు, నీలుడు వీరు చాలు లంకను సర్వనాశనము చేసి, రావణుని చంపి సీతను తీసుకురావడానికి.

కాబట్టి లంక మీద దండయాత్ర చేయడానికి మంచి ముహూర్తము నిశ్చయించండి." అని పలికాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

నాలుగవ సర్గ.

హనుమంతుడు చెప్పిన మాటలను శ్రద్ధగా విన్నాడు రాముడు. రామునిలోని శౌర్యము, ప్రతాపము ఉప్పొంగింది. "మనమందరము లంకకు చేరుకొని దానిని నాశనం చేద్దాము. సుగ్రీవా! వెంటనే ప్రయాణమునకు ముహూర్తము నిశ్చయించు. వానర సేనలను సర్వసన్నద్ధము కావించు. నా సీతను అపహరించిన ఆ రావణుడు నన్ను తప్పించుకొని ఎక్కడకు పోగలడు? సుగ్రీవా! నేడు ఉత్తరఫల్గునీ నక్షత్రము. రేపు చంద్రుడు హస్తా నక్షత్రంలో ప్రవేశిస్తాడు. అంతే కాకుండా శుభశకునములు కనపడు తున్నాయి. కాబట్టి ప్రయాణమునకు ఇదే మంచి ముహూర్తము. మనకు విజయము తథ్యము. సుగ్రీవా! సైన్యములను బయలుదేరమని ఆజ్ఞాపించు." అని అన్నాడు రాముడు.

సుగ్రీవుడు, లక్ష్మణుడు రాముని ఆదేశములను శిరసావహించారు. తరువాత రాముడు వానర సేనాపతులకు ఈ ప్రకారంగా ఆదేశాలు ఇచ్చాడు. "నీలుడు లక్షమంది సైనికులను తీసుకొని మార్గమును సరి చూచుకుంటూ ముందు వెళతాడు. మన సైనికులు వెనక వస్తారు.

నీలుడు మార్గమధ్యంలో ఫలములు, దుంపలు, చల్లని నీడనిచ్చే అడవులు, నీరు, తేనె ఉన్న మార్గములను ఎంచుకొని ఆ దారిలో ప్రయాణిస్తూ మనకు మార్గము చూపుతాడు. ఓ నీలుడా! మనము సైన్యముతో వస్తున్నామని తెలిసి రాక్షసులు దారిలో కాపు కాచి మనకు ఆహారము దొరక కుండా చేసే అవకాశము ఉంది. కాబట్టి జాగ్రత్తగా ఉండు. మన సైనికులకు సమృద్ధిగా ఆహారము సమకూర్చే బాధ్యత నీది. నీ సైనికులు మార్గ మధ్యంలో ఉన్న పల్లపు ప్రాంతములు, కొండలు గుట్టలు అన్నీ గాలిస్తూ, రాక్షసులు ఎక్కడన్నా దాక్కుని ఉంటారేమో అని చూడవలెను.

తరువాత, కిష్కింధా నగర రక్షణ కొరకు కొంత మంది సైన్యమును ఇక్కడే ఉంచండి. మిగిలిన సైన్యము గుంపులు గుంపులుగా ఏర్పడి వారి వారి నాయకుల ఆజ్ఞానుసారము ముందుకు నడవాలి. మహాబలవంతులైన గజుడు, గవయుడు, గవాక్షుడు సైన్యము ముందు నడుస్తారు. ఋషభుడు వానర సైన్యమునకు కుడి పక్కన రక్షణగా నడుస్తాడు. మహావీరుడైన గంధమాధనుడు సైన్యము ఎడమ పక్కన రక్షకుడిగా నడుస్తాడు. నేను హనుమంతుడు మీద ఎక్కి సైన్యము మధ్యలో నడుస్తాను.. లక్ష్మణుడు అంగదునిమీద ఎక్కి నడుస్తాడు. జాంబవంతుడు, సుషేణుడు, వేగవంతుడు సేనలకు మధ్యలో నడుస్తారు." అని సైన్యములకు ఆదేశాలు ఇచ్చాడురాముడు.

వెంటనే సుగ్రీవుడు వానర సేనలకు రాముడు చెప్పినట్టు చేయమని ఆజ్ఞాపించాడు. సుగ్రీవుని ఆజ్ఞవినగానే వానరులంతా ఒక్కుమ్మడిగా పైకి లేచాయి. అంతా దక్షిణదిక్కుగా ప్రయాణమయ్యారు. రాముడు, హనుమంతుడు ముందు నడుస్తుంటే వానర సేనలు వాలిని

అనుసరించి వెళ్లాయి. వానరులంతా గాలిలో ఎగురుతూ వెళుతున్నారు. దారిలో కనపడ్డఫలములను తింటూ తేనెను తాగుతూ ఆకలి తీర్చుకుంటూ ప్రయాణము చేస్తున్నారు. ఆ వానర సేనలు దారిలో ఆడటాడుకుంటూ ఒకరిని ఒకరు తోసుకుంటూ నెట్టుకుంటూ రాక్షసులను ఎలా చంపాలో ముందుగా చూసుకుంటున్నారు.

రాముడి ఆదేశము ప్రకారము నీలుడు, ఋషభుడు, కుముదుడు ముందు నడుస్తూ సైన్యము ప్రయాణించేమార్గమును సరిచూస్తున్నారు. వానర రాజు సుగ్రీవుడు, రామలక్ష్మణులు, సేనలకు మధ్యలో నడుస్తున్నారు. దాదాపు పదికోట్ల మంది వానర సైన్యమునకు శతబలి అనే వానరుడు సైన్యాధ్యక్షుడుగా ఉన్నాడు. నూరు కోట్ల వానరములకు కేసరి, పనసుడు, గజుడు ఆధిపత్యము వహిస్తున్నారు. సుషేణుడు, జాంబవంతుడు, సైన్యమునకు వెనక భాగమును రక్షిస్తున్నారు. వానర వీరుడు నీలుడు సర్వసైన్యాధ్యక్షుడుగా ఉన్నాడు. వలీముఖుడు, ప్రజంఘుడు, జంభుడు, రభసుడు సైన్యము నాలుగుపక్కలా తిరుగుతూ తొందరగా నడవండని ఉత్సాహపరుస్తున్నారు. కోట్ల కొలది వానర సేన పర్వతములు, కొండలు, గుట్టలు అరణ్యములు దాటుకుంటూ ప్రయాణము చేస్తున్నారు.

కొంతమంది వానరులు గాలిలో ఎగురుతుంటే మరి కొంతమంది దుముకుతూ, మరి కొంతమంది నడుస్తూ ప్రయాణిస్తున్నారు. వారి మధ్యలో ఉన్న రాముడు, లక్ష్మణుడు, సూర్యచంద్రుల మాదిరి వెలిగి పోతున్నారు. రాముడు ఎక్కడ శోకసముద్రంలో మునిగిపోతాడో అని లక్ష్మణుడు రాముని చక్కని మాటలతో ఉత్తేజపరుస్తున్నాడు. “రామా! మనమందరము శీఘ్రమే లంకకు చేరి, రావణుని చంపి, సీతను తీసుకొని

వస్తాము. అందరమూ అయోధ్యకు వెళదాము. మనకు అన్నీ శుభ శకునములు కనపడుతున్నాయి. వాయువు మనకు అనుకూలంగా వీస్తున్నాడు. ఈ సమయములో శుక్రుడు నీకు అనుకూలంగా ఉన్నాడు. (శుక్రమహర్దశ) విశాఖ నక్షత్రము వేరే దుష్టగ్రహములతో కలవకుండా నిర్మలంగా ఉంది. విశాఖ నక్షత్రము మన ఇక్ష్వాకు వంశీయుల నక్షత్రము. రాక్షస నక్షత్రమైన మూలా నక్షత్రమునకు అధిదేవత నిర్పతి. ఆ మూలా నక్షత్రమును తోకచుక్క ఆవహించింది. అది రాక్షసులకు అనర్థహేతువు. రాక్షసులకు మృత్యువు ఆసన్నమయింది అనడానికి ఇదే సంకేతము. కాబట్టి రామా! ఈ శుభశకునములను చూచి నీవు సంతోషించాలి." అని పలికాడు లక్ష్మణుడు.

ఆ వానరసేనలు ప్రయాణిస్తుంటే వానరులతో భూమి అంతా కప్పబడి పోయిందా అన్నట్టు కనపడుతూ ఉంది. ఆ వానర సేనలు ఎక్కడా నిలువ కుండా నిరంతరాయంగా ప్రయాణం సాగిస్తున్నాయి. వానర సేనలు సహ్యా, మలయ పర్వతములను అధిగమించి ముందుకు సాగుతున్నారు. ఆ పర్వతముల మీద ఉన్న చెట్ల నుండిఫలములను కోసి తింటూ, తేనెను తాగుతూ, చెట్లను కింద పడవేస్తూ, ఆడుతూ పాడుతూ గెంతుతూ, ప్రయాణిస్తున్నారు. వారందరూ సహ్యపర్వతమును, మలయ పర్వతమును దాటి సముద్ర తీరము చేరుకున్నారు.

రాముడు మహేంద్ర పర్వత శిఖరము మీద నిలబడి సముద్ర మును చూచాడు. ఇలా అన్నాడు. "సుగ్రీవా! మనము మొదట్లో అనుకున్న చింత మరలా మొదలయింది. ఇంత విశాలమైన సముద్రమును, అలలతో భయంకరంగా ఉన్న సముద్రమును ఎలా దాటడమా అని ఆలోచిస్తున్నాను.

ఈ సముద్రమునకు ఆవల గట్టు కనిపించడం లేదు. దీనిని ఏదో ఒక ఉపాయమే చేత దాటాలి కానీ మరొక విధంగా దాటలేము. కాబట్టి సుగ్రీవా! మన సైన్యమును ఇక్కడే ఉండమని చెప్పు. మనము ఈ సముద్రమును ఎలా దాటాలో ఆలోచిద్దాము." అని అన్నాడు రాముడు.

రాముని ఆదేశము మేరకు సుగ్రీవుడు వానర సేనను అక్కడ ఆగమని ఆజ్ఞాపించాడు. అందరూ అక్కడ ఉన్న చెట్ల కింద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎవరి అధీనములో ఉన్న సేనలను వారు ఆజ్ఞాపిస్తున్నారు. వానర సేన అరిచే అరుపులు, పెట్టే కేకలు, చేసే ధ్వనులు సాగర ఘోషను మించిపోయాయి. అప్పటికి సాయంకాలము అయింది. చంద్రుడు ఉదయిస్తున్నాడు. చంద్రోదయ కాలంలో సాగరము ఉధృతంగా ఉప్పొంగుతూ ఉంది. పెద్ద పెద్ద అలలు ఎగిసిపడుతూ తీరాన్ని తాకుతూ ఉన్నాయి. చూచే వారికి ఆకాశము సముద్రము కలిసిపోయాయా అన్నట్టు కనపడుతూ ఉంది. రెండూ నీలి రంగులో ఉండటం వలన ఆకాశానికి సముద్రానికి భేదం తెలియకుండా ఉంది. సముద్రము ఒడ్డున కూర్చుని ఉన్న వానర ప్రముఖులు అనంతమైన ఆ సముద్రాన్ని చూస్తూ ఉన్నారు. ఆమహాసముద్రమును ఎలాదాటాలా అని ఆలోచిస్తున్నారు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము నాల్గవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

యుద్ధకాండము

ఐదవ సర్గ.

నీలుడు తన సేనలను సముద్రము ఉత్తరదిక్కుగా నిలిపాడు. మైందుడు, ద్వివిదుడు వానర సేనలు విడిది చేసిన ప్రాంతం అంతా సంచరిస్తూ, వారి రక్షణ గురించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ సముద్రమును చూస్తున్నరాముడు లక్ష్మణునితో ఇలా అన్నాడు.

"లక్ష్మణా!రోజులు గడిచే కొద్దీ మనిషిలో ఉన్న శోకము తగ్గి పోతుంది అంటారు. కానీ సీత గురించి నేను పడుతున్న శోకము తగ్గకపోగా రోజు రోజుకూ పెరిగిపోతూ ఉంది. లక్ష్మణా! ఈ గాలి ముందు నా సీత మీద ప్రసరించి, తరువాత నా మీద ప్రసరిస్తే నేను నా సీతను స్పృశించిన సుఖమును పొందుతాను. నా సీత ఇప్పుడు చంద్రుడిని చూస్తూ ఉంటుంది. నేను కూడా అదే చంద్రుడిని చూస్తున్నాను. అప్పుడు మా ఇరువుని చూపులు కలిసినట్టే కదా! నేను, సీత ఇదే భూమి మీద ఉన్నాము. అంటే నేను నా సీత దగ్గర దగ్గరగా ఉన్నట్టే కదా! నా సీతను రావణుడు తీసుకొని పోతుంటే నా సీత అరిచిన అరుపులు నాకు హృదయవిదారకంగా వినపడుతున్నాయి. నేను ఏమీ చేయలేని అసమర్ధుడిలా మిగిలిపోయాను.

సీత లేని తాపము నేను భరించలేను. ఈ సముద్రము జలములలో మునిగి నా తాపమును చల్లార్చు కుంటాను. నేను ఎన్నడు ఈ సముద్రమును దాటి, రావణుని చంపి, నా సీతను తిరిగి పొందుతానో కదా! ఆ రాక్షసుల మధ్య అనేక బాధలు పడుతూ ఉన్న నా సీత, నాధుడు కలిగి ఉండి కూడా అనాధగా విలపిస్తూ ఉంది కదా! పుట్టినప్పటి నుండీ

జనక మహారాజు సంరక్షణలో ఎన్నోభోగాలు అనుభవించి, తరువాత దశరథమహారాజు ఇంటికి కోడలిగా వచ్చిన నా సీత ఆ క్రూరులైన రాక్షస స్త్రీల మధ్య ఎలా ఉందో కదా! నా మీద దిగులుతో సరిగా ఆహారం కూడా తీసుకోని సీత, ఎంతగా చిక్కిపోయిందో కదా! నేను ఆ రావణుని ఎప్పుడు చంపి నా సీతను పొందుతానో కదా!" అని తీవ్రంగా రాముడు విలపిస్తున్నాడు.

ఆప్రకారంగా విలపిస్తున్న రాముని లక్ష్మణుడు ఓదార్చాడు. తరువాత వారు సాయంసంధ్యలో చేయవలసిన సంధ్యావందనాది కార్యక్రమములు నిర్వర్తించారు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ఐదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

యుద్ధకాండము
ఆరవ సర్గ.

ఇక్కడ పరిస్థితి ఇలా ఉంటే అక్కడ లంకాపురిలో రావణుడు చింతాక్రాంతుడయి ఉన్నాడు. ఒక కోతి వచ్చి లంకను దహనం చేసింది. తన కుమారుని చంపింది. వేలకొద్దీ రాక్షస వీరులను హతమార్చింది. రావణుని మనసంతా కలత చెందింది. తన మంత్రులతో సమావేశము ఏర్పాటు చేసాడు. "ఒక వానరము శత్రుదుర్భేధ్యమైన లంకా నగరంలో ప్రవేశించి అశోక వనములో ఉన్న సీతను చూడగలిగాడు. అంతే కాకుండా అశోక వనములో ఉన్న చైత్యప్రాసాదమును నాశనం చేసాడు. ఎందరో

రాక్షసులను చంపాడు. లంకను కాల్చాడు. ఇప్పుడు మనం ఏం చేయాలి. ఏం చేస్తే బాగుంటుంది. మీకు తోచిన విధంగా నాకు సలహాలు ఇవ్వండి. ఈ సమయములో నేను ఒక్కడినే నిర్ణయం తీసుకోవడం మంచిది కాదు. ఇదంతా రాముని వలన జరిగింది. రాముని విషయంలో మనం ఏం చెయ్యాలి.

లోకంలో మూడు రకాలైన మనుషులు ఉంటారు. వారు ఉత్తములు, మధ్యములు, అధములు. రాజు హితము కోరేవారు, మంత్రాంగములో సమర్థులు, హితులతోనూ, బంధువులతోనూ బాగా ఆలోచించి నిర్ణయం తీసుకొనే వాళ్లు, దైవానుకూలము కొరకు ప్రయత్నము చేసేవారు ఉత్తములు అని పిలువబడుతారు. ఇతరుల ప్రమేయం లేకుండా, ఇతరులతో ఆలోచించకుండా, సొంత నిర్ణయాలు తీసుకొనే వాడు, ఇతరుల సాయం లేకుండా ఒంటరి గానే పనులు చేసేవాడు, మధ్యముడు అని పిలువబడతాడు. పురుష ప్రయత్నం లేకుండా, కేవలం దైవము మీదనే ఆధారపడేవాడు అధముడు అని పిలువబడతాడు.

అలాగే మంత్రాంగములో కూడా ఉత్తమము, మధ్యమము, అధమము అని ఉన్నాయి. శాస్త్రములలో చెప్పిన మాదిరి, మంత్రులతో కలిసి చేసే ఆలోచన ఉత్తమమైన ఆలోచన. మంత్రులతో చర్చించినపుడు బేధాభిప్రాయాలు వచ్చినా, తుదకు చేసే ఏకాభిప్రాయము, సమిష్టినిర్ణయం మధ్యమము అని చెప్పబడుతుంది. అలా కాకుండా ఎవరికి తోచినట్టు వారు మాట్లాడుతూ, ఒకరితో ఒకరు విభేదిస్తూ, ఎంతకూ ఏకాభిప్రాయానికి రాని మంత్రాంగము అధమము అని చెప్పబడుతుంది. కాబట్టి మీరందరూ ఆలోచించి ఒక అభిప్రాయమునకు రండి. దానిని రాజుగా నేను అమలుపరుస్తాను.

అదీ కాకుండా, నాకు అందిన సమాచారము ప్రకారము రాముడు అసంఖ్యాకమైన వానర సేనలతో లంకా నగరము మీదికి దండెత్తి వస్తున్నాడు అని నాకు తెలిసింది. వారంతా సాగరమును దాటి లంకను చేరుకోగలరు అని నేను అనుకుంటున్నాను. రాముడు తన బలపరాక్రమ ములతో సముద్రమును ఎండింపచేయగలడు. లేక మరే ఉపాయము చేతనైనా సముద్రమును దాటవచ్చును. కాబట్టి ఈ క్లిష్ట సమయములో మీరు బాగా ఆలోచించి నాకు ఉత్తమమైన సలహా ఇవ్వండి." అని ముగించాడు రావణుడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ఆరవర సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ఏడవ సర్గ.

రాక్షస రాజు రావణుని మాటలు శ్రద్ధగా విన్నారు రావణుని మంత్రులు. బాగా ఆలోచించారు. వారికి తోచిన ఉపాయములను ఇలా చెప్పసాగారు. "రాక్షసేంద్రా! మన రాక్షస బలము తక్కువ కాదు. పరిఘలు, కత్తులు, పట్టిశములు మొదలగు మారణాయుధములను ధరించిన రాక్షససేన లెక్కకు మించి ఉంది. నీకు దిగులుపడాల్సిన పనిలేదు. ఇంక నీ బలపరాక్రమములు తక్కువేమీ కాదు. నీవు పాతాళములో ఉన్న భోగవతీ నగరమును జయించిన వీరుడివి. యక్షులను జయించి, యక్షరాజు, నీ సోదరుడు అయిన కుబేరుని ఓడించిన శూరుడవు. మహేశ్వరునకు సఖుడు అని చెప్పుకొనుచున్న కుబేరుని గర్వము అణిచిన మహాబలుడవు.

కుబేరుని వద్దనుండి పుష్పకమును తీసుకొని వచ్చిన ధీరుడవు. దానవ రాజు మయుడు నీ బలపరాక్రమములకు భయపడి తన కుమార్తె మండోదరిని నీకు ఇచ్చి వివాహం చేసాడు. నీతో బంధుత్వము కలుపు కున్నాడు. దానవ వీరుడు, నీ సోదరి కుంభీనసి భర్త అయిన మధువును ఓడించిన పరాక్రమశాలివి. నీవు రసాతలములో ఉన్న వాసుకి, తక్షకుడు, శంఖుడు మొదలగు నాగులను జయించి, నాగజాతిని వశం చేసుకున్నావు. నీవు ఒంటరిగానే కాలకేయులు అనే దానవులను జయించావు. వాళ్ల దగ్గర నుండి అనేక మాయలను గ్రహించావు. చతురంగ బలములు కలిగిన వరుణ పుత్రులను జయించిన మహా వీరుడవు నీవు.

నీవు యమలోకమును జయించి యముని యమలోకము నుండి పారిపోయేట్టు చేసావు. నీవు ఈ భూలోకములో ఉన్న ఎంతో మంది క్షత్రియులను సంహరించావు. వారితో పోలిస్తే ఈ రాముడు ఎంత? మీరు దీని గురించి ఆలోచించడం అనవసరం. తమరి కుమారుడు ఇంద్రజిత్తు చాలు ఆ వానరులను తుదముట్టించడానికి. ఇంద్రజిత్తు సామాన్యుడు కాదు. మహేశ్వరునే మెప్పించి వరములను పొందిన వాడు. దేవతలను ఓడించి దేవేంద్రుని పట్టిబంధించి తెచ్చిన ధీరుడు ఇంద్రజిత్తు. అంతలో బ్రహ్మదేవుడు జోక్యము చేసుకొని దేవేంద్రుని విడువమని ఇంద్రజిత్తును అర్థించాడు. అప్పుడు ఇంద్రజిత్తు దేవేంద్రుని విడిచిపెట్టగా, దేవేంద్రుడు బ్రహ్మలోకానికి వెళ్లాడు. అటువంటి పరాక్రమవంతుడు ఇంద్రజిత్తు. ఆ ఇంద్రజిత్తును పంపితే చాలు, ఆ వానరసైన్యమును రాముని తో సహా సమూలంగా నాశనం చేస్తాడు.

ఓ రాక్షసేంద్రా! ఒక సామాన్యమానవుని వలన వచ్చిన ఈ ఆపదకు చింతించకు. రాముని నీవు వధిస్తావు. విజయము నీకు స్వంతమవుతుంది." అని పలికారు రావణుని మంత్రులు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ఏడవసర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ఎనిమిదవ సర్గ.

తరువాత ప్రహస్తుడు అనే రాక్షస సేనాధిపతి లేచి ఇలా అన్నాడు. "ఓ రాక్షసేంద్రా! నీవు యుద్ధములో దేవతలను, గంధర్వులను, దానవులను, నాగులను జయింప సమర్థుడవు. ఇంక ఈ ఇద్దరు మానవులు నీముందు నిలువగలరా! హనుమంతుడు అనే వానరము వచ్చినప్పుడు మనమందరమూ అప్రత్తంగా, యుద్ధమునకు సిద్దంగా లేము. అందువలన ఆ వానరము అంతటి దురాగతములు చేయగలిగాడు. లేనిఎడల, ఆ తుచ్ఛ వానరము లంకను దాటి పోగలడా! నీవు ఆజ్ఞాపిస్తే చాలు. ముల్లోకములలో వానరము అనే మాట వినపడకుండా చేస్తాము. వానర జాతిని సర్వనాశనము చేస్తాము. ఓ రాక్షసరాజా! మీరు సుగ్రీవుని విషయం నాకు విడిచిపెట్టండి. వాడిని నేను కట్టడి చేస్తాను. సీతను తీసుకు వచ్చినందుకు మీరేమీ చింతించకండి." అని పలికాడు ప్రహస్తుడు.

తరువాత దుర్ముఖుడు అనే రాక్షసుడు లేచి ఇలా పలికాడు. "ఓ రాజా! ఆ వానరుడు మన లంకకు చేసిన అపకారము సహించరానిది.

ఒక వానరుడు లంకాధిపతిని ఎదిరించడమా! అది మేము సహించడమా! నేను ఇప్పుడే పోయి ఆ వానర జాతిని వారు ఎక్కడ దాక్కున్నా వెతికి వెతికి సర్వనాశనము చేస్తాను." అని అన్నాడు.

తరువాత వజ్రదంష్ట్రుడు అనే రాక్షసుడు ఇలా అన్నాడు. "మనము ఆ వానరము హనుమంతుని గురించి ఆలోచించడం తగని పని. మన దృష్టి ఎప్పుడూ సుగ్రీవుడు, రాముని మీద ఉండాలి. వారిని చంపితే ఈ వానరుడు ఎంత! నాకు అనుమతి ఇస్తే వెంటనే పోయి ఆ రామలక్ష్మణులను, సుగ్రీవుని చంపి వస్తాను. ఎవడైతే సోమరి తనమును విడిచిపెట్టి ఉపాయములతో శత్రునాశనము చేస్తాడో, వాడికి విజయం దక్కుతుంది. మన దగ్గర కామరూపులైన రాక్షసులు ఎందరో ఉన్నారు. వారిచేత మానవ రూపములు ధరింపజేసి, రాముని వద్దకు పంపుదాము. వారు రామునితో ఇలా అంటారు. "ఓ రామా! మేము భరతుని వద్దనుండి వస్తున్నాము. మమ్ములను భరతుడు పంపాడు. భరతుడు తన సేనలతో తమరికి సాయంగా వస్తున్నాడు." అని అంటారు. అప్పుడు రామలక్ష్మణులు, వానర సేన, భరతుని సైన్యముల కొరకు ఎదురు చూస్తూ ఉంటారు. అప్పుడు మనము హటాత్తుగా వారి మీద ఆకాశము నుండి దాడి చేద్దాము. వాళ్ల మీద రాళ్లవాన కురిపిద్దాము. వానర సైన్యమును సర్వనాశనము చేద్దాము. ఆవిధంగా మన వలలో చిక్కిన వానరులను రామలక్ష్మణులను చంపుదాము." అని అన్నాడు.

తరువాత కుంభకర్ణుని కుమారుడు నికుంభుడు అనువాడు లేచి ఇలా అన్నాడు. "మహారాజా! దీనికి ఇంత చర్చ అవసరమా! నన్ను పంపండి చాలు. రామలక్ష్మణులను, సుగ్రీవుని, వానరులను త్రుటిలో చంపి వస్తాను." అని అన్నాడు.

తరువాత వజ్రహనువు అనే రాక్షసుడు లేచి “మీరందరూ పోయి మద్యము సేవిస్తూ, మీ మీ ప్రియురాళ్లతో క్రీడించండి. ఆ వానర సైన్యమును నాకు వదిలిపెట్టండి. ఆ వానరులనంతా నేను ఒక్కడినే తినేస్తాను. నరులను వానరులను చంపుతాను.” అని అన్నాడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఎనిమిదవ సర్గ సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

తొమ్మిదవ సర్గ.

తరువాత రాక్షసవీరులైన నికుంభుడు, రభసుడు, సూర్యశత్రువు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపుడు, మహాపార్శ్వుడు, మహోదరుడు, దుర్ధర్షుడు, రశ్మికేతువు, రావణుని కుమారుడు ఇంద్రజిత్తు, ప్రహస్తుడు, విరూపాక్షుడు, వజ్రదంష్ట్రుడు, ధూమ్రాక్షుడు, నికుంభుడు, దుర్ముఖుడు అనే పేరు గల రాక్షస వీరులు రావణునితో తమ తమ శౌర్యప్రతాపాలను ప్రదర్శిస్తూ, వెంటనే హనుమంతుని చంపివేద్దాము అని ప్రతిజ్ఞలు చేసారు. రావణుని మెప్పు సంపాదించడం కోసరం రాక్షస వీరులుచెప్పిన మాటలను రావణుని తమ్ముడు విభీషణుడు శ్రద్ధగా విన్నాడు. వారందరినీ శాంతింపజేసి వారి వారి స్థానములలోకూర్చోపెట్టాడు.

తరువాత విభీషణుడు లేచి సభను ఉద్దేశించి ఇలా అన్నాడు. “ఏదైనా ఒక కార్యమును సాధించాలంటే సామ, దాన, భేదో పాయములను ముందు ప్రయోగించాలి. అవి సఫలము కానప్పుడు దండోపాయమును

ప్రయోగించాలి అని తెలివికలవాళ్లు చెబుతారు. శత్రువు ఏమరిపాటుగా ఉన్నప్పుడు, ఇతర రాజులచేత ఓడింపబడినప్పుడు, వారికి దైవము అనుకూలంగా లేనప్పుడూ, శత్రువును మన పరాక్రమము ఉపయోగించి లొంగదీసుకోవచ్చును.

ప్రస్తుతము మన శత్రువు రాముడు, మహా పరాక్రమవంతుడు. ఏ మాత్రం ఏమరిపాటు లేని వాడు. కోపమును జయించిన వాడు. ఎటువంటి క్లిష్టసమయములోనైనా సరైన నిర్ణయములు తీసుకోగల సమర్థుడు. అటువంటి మహా వీరుడిని మీరంతా ఎలా ఎదుర్కోగలము అని అనుకుంటున్నారు. ఒక వానరము హనుమంతుడు అనే పేరుకలవాడు, సముద్రమము దాటివచ్చి, సీతను చూచి, లంకను దహించి వెళ్లాడు అంటే నమ్మగలరా! కనీసం ఊహించగలరా! మీరంతా ఇప్పటిదాకా మీ మీ పరాక్రమములు గురించి చెప్పకొన్నారు. మరి శత్రువుల బల పరాక్రమముల గురించి ఆలోచించారా!

ఇంక అసలు విషయానికి వద్దాము. ఈ రాక్షస రాజు రావణుడు, జనస్థానములో ఉన్న రాముని భార్య సీతను, రాముడు ఇంటలేని సమయమున అపహరించి తెచ్చాడు. ఎందుకు? రాముడు రావణునికి ఏమైనా అపకారముచేసాడా! జనస్తానములో ఉన్న ఖరుడు ఏమి చేసాడో విచారించారా! ఖరుడు తన పరిధిని దాటి, మితిమీరి ప్రవర్తించబట్టే రాముడు ఖరుని దండించాడు. రాముడు తన ప్రాణములను, తనవారి ప్రాణములను రక్షించుకోడానికి ఖరుని చంపాడు. తప్పు మన దగ్గర పెట్టుకొని రాముని అనడంలో ఏమి ప్రయోజనము.

అపహరించి తెచ్చిన సీతను తిరిగి రామునికి అప్పగించి యుద్ధమును నివారించడమే ఉత్తమము. మనము యుద్ధమును కొని తెచ్చుకున్నాము. దానికి నివారణ చేయడం మంచిది. మనము రామునితో అకారణంగా వైరము పెట్టుకున్నాము. రాముడు సముద్రమును దాటి లంకకు వచ్చి, రాక్షసులను చించి చెండాడక ముందే సీతను రామునికి అర్పించి ఆ వైరమును మాన్పుకుందాము. అపారమైన వానర సేన సముద్రమును దాటి లంకను ముట్టడించకముందే సీతను రాముని వద్దకు పంపుదాము. అలా జరగని ఎడల, లంక సర్వనాశనం అవుతుంది. ఇప్పటికే హనుమంతుడు లంకను దహించి అపార నష్టం కలుగచేసాడు.

ఓ రావణా! నేను నీకు మంత్రినే కాదు. తమ్ముడను. బంధువును. అందుచేత ఇంతదాకా చెబుతున్నాను. నీ మెప్పు కోసం మాటలాడటం నాకు చేత కాదు. నీకు మంచి జరిగే మాటలు చెబుతున్నాను. నా మాట విను. సీతను రాముని వద్దకు పంపు. రాముడు తన వాడి అయిన బాణములను లంక మీదికి సంధించకముందే, సీతను రామునికి ఇచ్చివేయి. రాముని మీద నీకు ఉన్న కోపాన్ని విడిచిపెట్టు. లంక సుఖము కోరి యుద్ధము నివారించు. రాముని వద్దకు సీతను పంపితే మనమందరమూ భార్యాబిడ్డలతో సుఖంగా జీవించగలము.” అని పలికి విభీషణుడు మౌనంగా ఉన్నాడు. అప్పటిదాకా రాక్షసవీరులు పలికిన వీరోచిత ప్రగల్భాలూ, వాటికి విభిన్నంగా ఉన్న విభీషణుని మాటలు విన్న రావణుడు అందరినీ పంపివేసి మౌనంగా తన అంత:పురమునకు వెళ్లిపోయాడు..

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము తొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

పదవ సర్గ.

తాను ఎన్ని హితమైన వాక్యములు చెప్పినా ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయిన రావణుని ప్రవర్తన చూచి కూడా తన పట్టు వీడలేదు విభీషణుడు. వ్యక్తిగత శ్రేయస్సుకన్నా సమాజ శ్రేయస్సు ముఖ్యమని నమ్మిన విభీషణుడు మరలా తన ప్రయత్నాలను కొనసాగించాడు. మరునాడు ప్రాతఃకాలమునందే లేచి రావణుని గృహమునకు వెళ్లాడు.

రావణుని గృహములో వేదఘోషలు మిన్నుముడుతున్నాయి. రావణుని విజయాన్ని ఆకాంక్షిస్తూ పండితులు వేదములు పఠిస్తున్నారు. మరి కొందరు పుణ్యాహవచనములు చదువుతున్నారు. రాక్షసులతో పూజింపబడుతున్న రావణుని చూచి విభీషణుడు భక్తితో నమస్కరించాడు. రావణుడు విభీషణుని పక్కనే ఉన్న ఆసనము మీద కూర్చోమని సంజ్ఞచేసాడు. విభీషణుడు రావణుడు చూపిన ఆసనము మీద కూర్చున్నాడు. రావణుడు విభీషణుని చూచి ఎందుకు వచ్చావు అన్నట్టు చూచాడు. అప్పుడు విభీషణుడు రావణునితో ఇలా అన్నాడు.

"ఓ రాక్షసరాజా! నీకు జయము కలుగుగాక! సీత లంకలో అడుగు పెట్టినది మొదలు అశుభశకునములు కనపడుతున్నాయి. తరచుగా పాలు విరిగిపోతున్నాయి. హోమాగ్ని ప్రకాశవంతంగా వెలగడం లేదు. గుర్రములు గాడిదలు ఏదో తెలియని రోగాలతో బాధపడుతున్నాయి. కాకులు గుంపులు గుంపులుగా ఇండ్ల మీద కూర్చుని దీనంగా అరుస్తున్నాయి. అకారణంగా గద్దలు జనావాసాల మీద తిరుగుతున్నాయి. సాయంత్రము వేళలో నక్కలు కూస్తున్నాయి. ఇవన్నీ చూస్తుంటే లంకకు

ఏదో చేటు కలుగుతుందని అనిపిస్తూ ఉంది. దీనికి ఒకటే పరిష్కారము. సీతను తిరిగి రాముని వద్దకు పంపివేయడమే.

ఓ రాజా! నేను ఈ మాటలు నా స్వార్థము కొద్దీ అజ్ఞానంతో పలుకుతున్నాను అని అనుకొన్నాబాధలేదు. లంక క్షేమము నాకు ముఖ్యము. నేను చెప్పిన దుశ్శకునములు నా కు ఒక్కడికే కాదు. ఇక్కడ అందరికీ కనపడు తున్నాయి. కాని వారంతా నీ మీద భయంతో చెప్పడం లేదు. మంత్రులు నీతో ఈ విషయాలు చెప్పడానికి సందేహిస్తున్నారు. కాబట్టి నేను చెప్పవలసి వచ్చింది. తరువాత నీకు ఏది న్యాయము, ధర్మము అని తోస్తే అది చెయ్యి." అని పలికి ఊరుకున్నాడు విభీషణుడు.

రావణునికి విభీషణుడు చెప్పిన మాటలు రుచించలేదు. పైగా కోపం వచ్చింది. విభీషణుని చూచి ఇలా అన్నాడు. "ఓ విభీషణా! ఈ దుశ్శకునములు చూచి భయపడవలసిన కారణము ఏదీ నాకు కనిపించడం లేదు. రాముడు లంకకు రాలేడు. సీతను చూడలేడు. రాముడు ఒక్కడే కాదు. ఇంద్రుడు మొదలగు దేవతలందరూ కలిసి వచ్చినా నన్ను యుద్ధములో గెలువలేరు. ఇది నిశ్చయము. ఇంక నీవు వెళ్లవచ్చు." అని అన్నాడు రావణుడు.

శ్రీమద్రామాయణము.

యుద్ధకాండము పదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

యుద్ధకాండము

పదకొండవ సర్గ.

సీత మీద రావణుడు పెంచుకున్న వల్లమాలిన కామము విభీషణుడు చెప్పిన మంచి మాటలను తలకు ఎక్కనీయలేదు. రాముడితో యుద్ధము సంభవిస్తే ఎలాంటి వ్యూహములు పన్నాలి అని మంత్రులతోనూ, మిత్రులతోనూ ఆలోచిస్తున్నాడు. ఉదయము ఆచరించవలసిన విధులు నిర్వర్తించి రావణుడు సభకు వెళ్లాడు. రావణుడు రాజమార్గములో వందిమాగధులు వెంటరాగా వెళుతుంటే మార్గమునకు ఇరుపక్కలా జనం నిలబడి జయజయధ్వానాలు చేస్తున్నారు. రావణుడు సభాస్థలిని ప్రవేశించాడు. జయజయధ్వానముల మధ్య సింహాసనము మీద ఆశీనుడయ్యాడు.

యుద్ధము నిశ్చయము అయినది. రాక్షసవీరులను అందరినీ సమావేశపరచమని ఆదేశాలు ఇచ్చాడు. రాక్షస వీరులందరూ రావణుని సభాభవనమునకు వచ్చి రావణునికి పాదాభివందనము చేసి తమకు కేటాయించిన ఆసనముల మీద తివాచీల మీద కూర్చున్నారు. రావణుని మంత్రులందరూ వారి వారి ఆసనముల మీద కూర్చున్నారు.

రావణుని తమ్ముడు విభీషణుడు, మంత్రి ప్రహస్తుడు, శుకుడు రావణుని సభకు వెళ్లారు. రావణునికి నమస్కరించి ఉచితాసనము మీద కూర్చున్నారు అందరూ రావణుని వంక చూస్తూ రావణుడు ఏమి చెబుతాడా అని ఎదురుచూస్తున్నారు.

రాక్షస సభలో ఉన్న రావణుడు ఇంద్రసభలో ఉన్న దేవేంద్రుని మాదిరి ప్రకాశించాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము పదకొండవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
పన్నెండవ సర్గ.

రాబోవు యుద్ధములో సదా విజయమును కాంక్షించు రావణుడు ప్రహస్తుని చూచి ఇలా అన్నాడు. "ప్రహస్తా! ప్రస్తుతము మనం యుద్ధవాతావరణంలో ఉన్నాము. నగరంలో కాపలా కట్టుదిట్టం చేయండి. సైనికులను సర్వసన్నద్ధంచేయండి." అని ఆదేశించాడు. ప్రహస్తుడు రావణుని ఆజ్ఞను అమలుపరిచాడు. తరువాత రావణుడు మంత్రులను సేనాపతులను చూచి ఇలా అన్నాడు.

"ధర్మము, అర్థము, కామము వీటి గురించి సంఘర్షణ తలెత్తినపుడు, మనకు ఏది మంచిదో, ఏది చెడో, ఏది ప్రియమో, ఏది అప్రియమో, ఏది లాభమో, ఏది నష్టమో, నిర్ణయించడంలో మీరందరూ సమర్థులు. మీరు మంత్రాంగము చేసి చెప్పిన ఆలోచనలు ఏనాడూ వృధాకాలేదు. నాకు విజయాన్ని సంపాదించి పెట్టాయి. రాముడు లంకను ముట్టడించడానికి వస్తున్న విషయము కుంభకర్ణునికి ఇంతవరకూ తెలియపరచలేదు. కుంభకర్ణుడు నిద్రలో ఉండటం వలన ఈ విషయాలు ఏమీఅతనికి తెలియవు. ఆరుమాసముల నిద్ర తరువాత కుంభకర్ణుడు

నిద్రలేచే సమయము ఆసన్నమయింది.

నేను, రాముని భార్య సీతను మన రాక్షసుల స్థావరమైన దండకారణ్యములోని జనస్థానము నుండి తీసుకొని వచ్చాను. సీత వంటి సౌందర్యవతి మూడులోకములలోనూ లేదు అన్నది నిర్వివాదాంశము. కాని సీత నాకు లొంగలేదు. నాతో పక్కను పంచుకొనడానికి అంగీకరించడం లేదు. సీత ప్రతి అంగమూ అందంగా, శోభాయమానంగా ఉంటుంది. అందుకే ఆమె అంటే నాకు మక్కువ. నాకు ఆమె మృదువైన పాదాలు చూచినా కామం చెలరేగుతుంది. ఇంక సీత ముఖారవిందము చూస్తే చెప్పేదేముంది. నాలో కామం అగ్ని వలె ప్రజ్వరిల్లుతుంది. నాకు కోపం వచ్చినా, శాంతంగా ఉన్నా, సర్వకాలసర్వావస్థలయందూ సీత మీద మోహము నన్ను నిలువనీయడం లేదు. దాదాపు సంవత్సరకాలము నుండి సీత నన్ను వరిస్తుందేమో అని ఎదురుచూచాను. రాముడు యుద్ధానికి వచ్చాడు కానీ సీతలో మార్పురాలేదు.

రాముడు సముద్రము ఆవల ఉన్నాడు. భయంకరమైన సముద్రమును దాటడం రామునికి సాధ్యం కాదు. కాకపోతే ఒక వానరుని వలన లంక చాలా నష్టపోయింది. ఆ వానరుని రాక గురించి మనకు ముందుగా తెలియక పోవడం వలన ఇంత నష్టం జరిగింది. ఇంకనైనా జాగ్రత్తగా ఉండండి. మీ మీ బుద్ధికి తోచిన సలహాలు ఇవ్వండి. నాకు నరుల వలన వానరుల వలనా ఎలాంటి భయం లేదు. కానీ వారి గురించి కూడా ఆలోచించవలసిన సమయం వచ్చింది. సుగ్రీవుడు రాముని కొరకు తన సేనలతో సముద్రము ఆవలకు వచ్చి ఉన్నాడు. సీతను రామునికి అప్పగించకుండా, రాముని చంపే ఉపాయము గురించి ఆలోచించండి.

ఈ మహాసముద్రమును దాటడానికి కేవలం రాక్షసులకే సాధ్యం అవుతుంది కానీ వానరులకు సాధ్యం కాదు. కాబట్టి జయం మనదే!" అని అన్నాడు రావణుడు.

అప్పుడు ఆ సభలో కూర్చుని ఉన్న కుంభకర్ణుడులేచి రావణునితో ఇలా అన్నాడు. " ఓ రాక్షసరాజా! నీవు ఇప్పుడు చేస్తున్న మంత్రాంగము, ఆలోచన సీతను అపహరించక ముందు చేసి ఉండవలసినది. అప్పుడు ముందూ వెనుకా ఆలోచించకుండా, నిప్పును తెచ్చి మూటగట్టుకున్నట్టు, సీతను తెచ్చి లంకలో పెట్టి ఇప్పుడు విచారించి ప్రయోజనము ఏమి? నీవు సీతను రాముని వద్దనుండి అపపహరించక ముందు ఈ ఆలోచన చేసి ఉండిన బాగుండేది. ఏ రాజు అయిన న్యాయబద్ధంగా ప్రవర్తిస్తే, తరువాత చింతించవలసిన పని ఉండదు. అనాలోచితంగా చేసిన పనులు విపరీత ఫలితాలను ఇస్తాయి. నీతికి అవినీతికి తారతమ్యము తెలియని వాడే ముందు చేయాల్సిన పని వెనుకా, వెనుక చేయాల్సిన పని ముందూ చేసి కష్టాలపాలవుతాడు. మనకే కదా బలం, పరాక్రమము ఉంది కదా అని కాని పనులు చేస్తే సర్వనాశనం తప్పదు.

ప్రస్తుతము నీవు చేయకూడని కార్యము చేసావు. నీ అదృష్టం కొద్దీ నిన్ను రాముడు ఇంకా చంపలేదు. సరే అయినది ఏదో అయింది. మంచో చెడో చేసావు. దానిని గురించి విచారించి ప్రయోజనములేదు. నేను నీ శత్రువులను చంపి నీకు వచ్చిన ఆపదను పోగొడతాను. నిశ్చింతగా ఉండు. మన శత్రువు రాముడే కాదు, ఇంద్రుడు, వరుణుడు, సూర్యుడు, అగ్ని, కుబేరుడు, వాయువు అయినా సరే నేను వారిని జయిస్తాను. రాముడు ఒక బాణం వేసి రెండో బాణము తీసేలోపల నేను రాముడి రక్తం తాగుతాను. ముందు రామలక్ష్మణులను చంపుతాను. తరువాత

వానరసేనను భక్షిస్తాను. రాముని వలన భయం విడిచిపెట్టు. హాయిగా తిని, తాగి, మదనసుఖములు అనుభవించు. రాముడి చావు వార్త వినగానే సీత నీకు వశమవుతుంది.” అని పలికాడు కుంభకర్ణుడు.

(పాఠకులకు ఒక్క మనవి. ఇంతకు ముందే రావణుడు “కుంభకర్ణుని ఆరునెలల నిద్ర అయిపోయినది. అతనిని నిద్రలేపండి.” అని ఆదేశించాడు. 60వ సర్గలో రాక్షసులు నానాపాట్లు పడి కుంభకర్ణుని నిద్రలేపినట్టు ఉంది. మరి ఈ కుంభకర్ణుడు ఎవరు? రావణుని తమ్ముడు కుంభకర్ణుడు కాడా! కాకపోతే మరెవరు? మరొకడైతే రావణుని ముందు అంత ధైర్యంగా మాట్లాడగలడా! కుంభకర్ణుని మాటలు విని రావణుడు ఊరుకుంటాడా! ఇవన్నీ జవాబు లేని ప్రశ్నలు. కాబట్టి కుంభకర్ణుని గురించిన ఈ సర్గ తరువాత చేర్చబడినది అని పెద్దల అభిప్రాయము.)

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము పన్నెండవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
పదమూడవ సర్గ.

కుంభకర్ణుడు మాట్లాడిన తరువాత మహా పార్శ్వుడు లేచాడు. కుంభకర్ణుని మాటలతో రావణునికి కోపంవచ్చినట్టు గ్రహించాడు. రావణునికి ప్రీతి కలిగించేవిధంగా ఇలా అన్నాడు. “ఓ రాక్షసరాజా! ఎంతో కష్టపడి మధువును సేకరించి దానిని త్రాగకుండా ఎదురుగా పెట్టుకొని చూస్తూ ఉండటం అవివేకము. నీవు అందరికీ ప్రభువు. ఇంక నీకు ప్రభువు

ఎవరున్నారు? నిన్ను శాసించే వాళ్లు ఎవరున్నారు? నువ్వు ఎవరికి భయపడాలి? కష్టపడి తెచ్చిన సీతను బలవంతంగానైనా తృప్తిగా అనుభవించు. ఆనందించు. తరువాత వచ్చేపరిణామాలను మేము చూసుకుంటాము. సీత నీకు వంటింటి కుందేలు. నీ చెప్పుచేతలలో ఉంది. నీ కోరిక తీర్చుకో. ఆలస్యం చేయకు. నేను, ఇంద్రజిత్తు, కుంభకర్ణుడు యుద్ధరంగంలో నిలబడితే మాకు ఎదురు నిలిచి పోరాడగల యోధుడు ముల్లోకములలో ఎవరున్నారు. కార్యసాధనకు కొంతమంది సామ, దాన, భేదోపాయములను ఉపయోగిస్తారు. కాని వీరులు దండోపాయమునే ఉపయోగిస్తారు. మనము వీరులము. మనకు దండోపాయమే తరుణోపాయము. నీ శత్రువులను అందరినీ మేము యుద్ధములో అంతమొందిస్తాము. నీవు నిశ్చింతగా ఉండు. ” అని వీరోచితంగా పలికాడు మహాపార్శ్వుడు.

మహాపార్శ్వుని మాటలకు రావణుడు ఎంతగానో సంతోషించాడు. అతనితో రావణుడు ఇలా అన్నాడు. “ఓ మహాపార్శ్వా! నీవు చెప్పినది మిగుల యుక్తియుక్తముగా ఉంది. కానీ ఇక్కడ ఒక చిక్కువచ్చిపడింది. అది ఒక రహస్యము. చాలా కాలం కిందట నేను పుంజికస్థల అనే అందమైన అప్సరసను చూచాను. ఆ సమయంలో ఆమె బ్రహ్మలోకానికి వెళుతూ ఉంది. ఆమెను వెంబడించాను. ఆమెను పట్టుకున్నాను. బలవంతంగా అనుభవించాను. ఆమె ఏడుస్తూ బ్రహ్మదేవుని వద్దకు వెళ్లింది. బ్రహ్మదేవునికి జరిగిందంతా చెప్పినట్టుంది. బ్రహ్మదేవుడు నన్ను పిలిపించాడు. “ఇంకమీదట నీవు ఏ స్త్రీనైనా ఆమె అనుమతి లేకుండా, బలవంతంగా అనుభవిస్తే. నీ తల వేయి ముక్కలైపోతుంది. ఇదే నా శాపము.” అని దారుణంగా శపించాడు. ఆ కారణంచేత నేను సీతను బలవంతంగా అనుభవించడానికి భయపడుతున్నాను. లేకపోతే నేను సీతను లంకకు తీసుకొని వచ్చినరోజే

అనుభవించి ఉండేవాడిని. అందుకే సీత నన్ను వరించే వరకూ ఎదురు చూడక తప్పదు.

రాముడికి నా గురించి, నా వేగము గురించి బాగా తెలియదు. అందుకని, పర్వతగుహలో నిద్రపోవుచున్న సింహము జూలుపట్టుకొని లాగినట్టు నాతో యుద్ధమునకు కాలుదువ్వుతున్నాడు. రాముని నా బాణములకు బలి చేయడం సీతను నేను అనుభవించడం నిజం. రాముడు దేవేంద్రుని గానీ, వరుణుని గానీ సాయం తెచ్చుకున్నా నేను రాముని జయించి తీరుతాను. నేను కుబేరుని యుద్ధములో ఓడించి లంకానగర మును ఆక్రమించుకున్నానన్న సంగతి రామునికి తెలియదు." అని గర్వంతో పలికాడు రావణుడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము పదమూడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
పదునాలుగవ సర్గ.

వీళ్ల మాటలన్నీ ఓపిగ్గా వింటున్నాడు విభీషణుడు. తరువాత విభీషణుడు లేచి ఇలా అన్నాడు. "రాక్షసరాజా! వీళ్లంతా కలిసి సీత అనే మహాసర్పమును నీ మెడకు చుడుతున్నారు. వానరులు సముద్రమును దాటి లంకను ముట్టడించక ముందే సీతను రాముని వద్దకు పంపించు. రాముడి వింటి నుండి వెలువడ్డ బాణములు రాక్షసుల కంఠములు

ఉత్తరించకముందే సీతను రాముని వద్దకు పంపించు. నీవు ఎవరి అండచూచుకొని ఈ యుద్ధానికి దిగుతున్నావో ఆ కుంభకర్ణుడు, మహాపార్శ్వుడు, ఇంద్రజిత్తు, మహోదరుడు, నికుంభుడు, కుంభుడు, అతికాయుడు వీరెవ్వరూ యుద్ధములో రాముని ముందు నిలువలేరు. నిన్ను రాముని బాణము తరుముతుంటే అప్పుడు ఇంద్రుడు, సూర్యుడు, మరుత్తులు, యముడు వీరెవ్వరూ నీ మొర ఆలకింపరు. కాబట్టి సీతను రాముని వద్దకు పంపు. రామునితో యుద్ధము నివారించు." అని పలికాడు విభీషణుడు.

వెంటనే ప్రహస్తుడు లేచాడు. "రాక్షసరాజా! మాకు ఇప్పటి వరకూ భయము అనే మాటకు అర్ధము తెలియదు. దేవ, దానవ, గంధర్వులు, నాగులు ఎవరి వల్లకానీ మాకు ఎలాంటి భయమూ లేదు. అటువంటిది ఒక నరుని వలన, వానరుల వలన మాకు భయం ఎందుకుంటుంది."అని అన్నాడు.

ఆ మాటలకు విభీషణుడు దీటుగా జవాబు ఇచ్చాడు. "ఓ ప్రహస్తా! నీవు చెప్పినట్టు చేస్తే, మనకు యమలోక ప్రయాణము తప్పదు. రాముడు ధర్మము తప్పని వాడు. మీరు ధర్మము తెలియని వారు. ధర్మము తప్పని రాముని ముందు దేవతలు కూడా తలెత్తి నిలబడలేరు. దేవతలు మనకు భయపడతారు. రాముని గౌరవిస్తారు. ఓ ప్రహస్తా! నీకు రామ బాణముల రుచి తెలియదు. అందుకని ఇటువంటి ప్రగల్భములు పలుకుతున్నావు. రాముడు రణరంగములో నిలిస్తే నీవూ, ఇంద్రజిత్తూ, నికుంభుడు, త్రిశీర్షుడు, దేవాంతకుడు, నరాంతకుడు, అతికాయుడు, అకంపనుడు ఎవరూ ఎదిరించి నిలువలేరు. ఇంక ఈ వ్యసనపరుడైన రావణుడు ఎంత?

వ్యసనలోలుడు, ఆలోచనా రహితంగా పనులు చేసేవాడు అయిన ఈ రావణుడు చేసే ప్రతిపనీ మీరు పొగుడుతూ తలలు ఊపుతున్నారు. రావణుని వినాశనానికి పునాది వేస్తున్నారు. మీకు రాజుకు హితము చెప్పడం, మంచి చేయడం చేతకాదు. ఇప్పటికైనా మించి పోలేదు. మీ రాజును మంచి దారిలో, సరి అయిన దారిలో నడిపించండి. లంకను రక్షించండి. ఇప్పటి దాకా మీరందరూ రావణుడు చేసే అకృత్యములను పొగిడి లబ్ధిపొందారు. ఇప్పటికైనా రావణునికి హితబోధచేయండి. యుద్ధము నివారించండి. మరి కొంతకాలము రావణుని వలన లబ్ధిపొందండి. సుఖాలు, భోగాలు అనుభవించండి.

నేను నా స్వార్థము కొరకు ఇలా చెప్పడం లేదు. లంక క్షేమము కోరి, రావణుని క్షేమం కోరి, లంకలోని రాక్షసుల క్షేమంకోరి, మీ అందరి సుఖసంతోషాలు కాపాడటానికి ఈ హితబోధ చేస్తున్నాను. సీతను రాముని వద్దకు పంపండి, యుద్ధము నివారించండి. లంకను కాపాడండి. మరొక్క మాట. తన బలమును ఎదిరి బలమును ఎరింగి, మనకు ఉన్న కష్ట నష్టములను పరిశీలించి, రాజుకు తగిన హితమును చెప్పువాడే ఉత్తముడు అయిన మంత్రి. మీరు ఉత్తములైన మంత్రులో కాదో మీరే తెల్చుకోండి. ” అని చెప్పి కూర్చున్నాడు విభీషణుడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము పదునాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
పదునైదవ సర్గ.

విభీషణుడు పలికిన పలుకులకు ఇంద్రజిత్తు కోపంతో ఊగిపోయాడు. "చిన్నాన్నా! ఏమిటి మీరు మాట్లాడేది? తెలివి ఉండే మాట్లాడుతున్నారా! రాక్షసకులములో పుట్టినవాడు మాట్లాడవలసిన మాటలేనా ఇవి! ఒక సామాన్య కులంలో పుట్టిన వాడు కూడా ఇంత పిరికి మాటలు మాట్లాడడు. మీకు ఈ పిరికి తనం ఎలా వచ్చింది? ఉన్నతమైన మన రాక్షస కులంలో ఇంత పిరికివాడు, బలహీనుడు, వీరత్వము లేనివాడు, పరాక్రమము, ధైర్యము, శౌర్యము లేని వాడు మీరొక్కరే కనపడుతున్నారు. లేకపోతే మానవాధములకు భయపడతారా!

ఈ రాముడు, లక్ష్మణుడు రాజకుమారులు, మనుష్యులు. లంకలో పుట్టిన ఒక సామాన్య రాక్షసుడు కూడా వారిని చంపగలడు. ఆ సంగతి తెలిసి కూడా మమ్ములను ఎందుకు ఇంతగా భయపెడుతున్నారు? నా సంగతి మీకు తెలియదా! నేను దేవేంద్రుని జయించిన వీరుడను. నా పరాక్రమానికి జడిసి దేవతలందరూ తలొకదిక్కుకు పారిపోయారు. నేను ఐరావతమును కింద పడదోసి, దాని దంతములు పీకిన వీరుడను. దైత్యులు కూడా నాకు భయపడతారు. అంతటి పరాక్రమవంతుడనైన నేను సామాన్య మానవులను, వారి వెంట వచ్చిన వానరులను ఓడించలేనా! ఇద్దరు రాజ కుమారులకు నేను భయపడాలా! సిగ్గుచేటు." అని కూర్చున్నాడు.

ఇంద్రజిత్తు మాటలు విన్న విభీషణుడు మరలా ఇలా అన్నాడు. "రాకుమారా! నీవు వయసులో చిన్నవాడవు. ఉడుకు రక్తంలో ఉప్పొంగిపోతున్నావు. నీ బుద్ధి ఇంకా వికసించలేదు. నీకు పూర్వాపరాలు

తెలియవు. నీకు మంత్రాంగము గురించి తెలియదు. అందుకే ఆవేశంతో వినాశనానికి దారి వెతుకుతున్నావు. అర్థం లేకుండా మాట్లాడుతున్నావు. నీవు నీ తండ్రి క్షేమం కోరిమాట్లాడటం లేదు. ఆయనకు ఒక శత్రువుగా యుద్ధానికి పురికొల్పుతున్నావు. నీకు ఆవేశము, సాహసము ఎక్కువ. అటువంటివాడిని మంత్రాంగము చేయునపుడు అనుమతించడం తప్పు. నీకు మౌఢ్యము ఎక్కువ. తెలివితో ఆలోచించడం తెలియదు. నీకు ఆవేశం తప్ప ఆలోచన తెలియదు. నీకు రామ బాణముల గురించి తెలియక అలా మాట్లాడుతున్నావు. అవి యమదండములతో సమానమైనవి. ఓ రాక్షసేంద్రా! ఈ బాలుని మాటలు పట్టించుకోకు. నా హితము విను. సీతను రాముని వద్దకు పంపు. భార్యాబిడ్డలతో సుఖంగా జీవించు. " అని అన్నాడు విభీషణుడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము పదునైదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

పదునారవ సర్గ.

విభీషణుడు చెప్పిన హితకరమైన మాటలు రావణునికి రుచించలేదు. పైగా కోపం కూడా వచ్చింది. "విభీషణా! నీవు నాకు బంధువు కావు. మిత్రుడు అంతకన్నా కావు. నీవు నాకు శత్రువు. బద్ధశత్రువును అయినా ఇంట్లో పెట్టుకోవచ్చుకానీ, బంధువు, మిత్రుడు అని చెప్పుకుంటూ నా నాశనము కోరేవాడిని ఇంట్లో ఉంచుకొనకూడదు. నీవు నాకు జ్ఞాతివి.

జ్ఞాతులు ఎప్పుడూ సాటి జ్ఞాతుల మేలు కోరరు. అది లోకధర్మము. అదీ కాకుండా తన కన్నా ఉన్నతుడు, ఐశ్వర్యవంతుడు అయిన జ్ఞాతిని చూస్తే ఇతర జ్ఞాతులకు అసూయ, ద్వేషము, పగ. అలాగే నువ్వు కూడా నా ఉన్నతిని నా సుఖమును చూచి ఓర్వలేకున్నావు. పైగా నాకు ఆపద వచ్చినప్పుడు సానుభూతి చూపకపోగా, ఆపదలలో ఉన్న నన్ను చూచి సంతోషిస్తున్నావు.

ఎవరికైనా గానీ అగ్నివలన, అస్త్ర,శస్త్రముల వలన పాశముల వలన కలుగు భయం కంటే క్రూరులైన జ్ఞాతుల వలన కలిగే ఆపదలు, భయాలు ఎక్కువ. కాబట్టి అన్ని భయముల కన్నా జ్ఞాతుల వలన భయం గొప్పది. ఆవులలో సంపద ఉంటుంది. స్త్రీలలో చంచలత్వవు ఉంటుంది. బ్రాహ్మణులలో తపస్సు ఉంటుంది. కానీ జ్ఞాతులలో సాటి జ్ఞాతుల ఎడల శత్రుత్వము ఉంటుంది. నీవు నాకు జ్ఞాతివి. నా గౌరవమును, పేరు ప్రతిష్టలను, నాకు ఉన్న ఐశ్వర్యమును, నా శత్రువులలో నన్ను గురించి ఉన్న భయమును చూచి నీవు ఓర్వలేకున్నావు. నీవు చెడ్డవాడివి. నీతో నాకు స్నేహము తగదు. చెడ్డవారితో స్నేహము అవశ్యము విడువతగినది.

ఓ విభిషణా! నీవు నా శత్రువును పొగుడుతూ ఎప్పుడెప్పుడు నా శత్రువుల వద్దకు పోవలెనా అని ఎదురుచూస్తున్నావు. కాబట్టి నీతో బంధుత్వము, స్నేహము ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకపోగా నాకు చేటు తెస్తుంది. ఎంత చెడ్డా నువ్వు నా సోదరుడవు, బంధువు. అందుకని నీవు ఎన్ని మాటలు మాట్లాడినా క్షమించాను. అదే ఇంకొకరయితే ఈ పాటికి వాడి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయి ఉండేవి. నీవు రాక్షస కులములో చెడబుట్టావు.” అని అత్యతంత పరుషమైనమాటలతో విభీషణుని దూషించాడు రావణుడు.

రావణుని నోటినుండి అటువంటి మాటలు విన్న విభీషణుడు ఇంక అక్కడ ఒక్కక్షణం కూడా నిలువలేకపోయాడు. వెంటనే తన గదాయుధమును తీసుకొని ఆకాశంలోకి ఎగిరాడు. విభీషణుని తోపాటు అతని మిత్రులు నలుగురు ఆకాశంలోకి ఎగిరారు. ఆకాశంలో నిలిచి విభీషణుడు రావణునితో ఇలా అన్నాడు.

"ఓ రాక్షసరాజా! నీవు నాకు సోదరుడవు. నాకన్నా పెద్దవాడవు. నీవు ఎన్ని అన్నా తప్పులేదు. నీవు నాకు తండ్రిస్థానములో ఉన్నావు. నీ మీద నాకు అపారమైన గౌరవము భక్తి ఉన్నాయి. ఎందుకంటే, తండ్రి, అన్న అధర్మపరులైనా వారు గౌరవనీయులు. కానీ నువ్వు నేను చెప్పిన హితములను పట్టించుకోకపోగా, నన్ను అత్యంత పరుషమైన పదజాలంతో దూషించావు. వాటిని నేను సహించలేను. నీ వద్ద ఉండలేను.

ఓ రావణా! ప్రస్తుతము నీ మనసు నీ అధీనములో లేదు. కామముతో నిండి పోయింది. కాలానికి లొంగిపోయింది. కాబట్టి నేను చెప్పిన మంచి మాటలు నీ చెవికి ఎక్కలేదు. ఓ రాజా! నిన్ను పొగిడేవారు, నీకు ఇష్టమైన మాటలు మాట్లాడేవారు, నీ ప్రాపకము కోసం పాకులాడేవారు ఎంతో మంది ఉన్నారు. కాని, నీకు ఇష్టం లేకపోయినా, నీ మనసుకు కష్టమైనా, నీకు మంచి మాటలు చెప్పేవాళ్లు దొరకడం కష్టం. ఒకవేళ దొరికినా, వాళ్ల మాటలు నీవు వినవు. సర్వనాశనమునకు మూలమైన దారిలో నీవు నడుస్తున్నావు. అది చూచి నేను ఊరుకోలేకపోతున్నాను.

ఓ రావణా! నిన్ను రాముడు తన బాణములతో చంపుతూ ఉంటే నేను చూడలేను. ఎంత శూరుడైనా, పరాక్రమవంతుడైనా, అజేయుడైనా, కాలాను గుణంగా నశించక తప్పదు. నీకు ఆ గతి

పట్టకూడదని, నీకు అకాల మరణం రాకూడదనీ నా సంకల్పము. అందుకే ఇన్ని మాటలు చెప్పాను. కాని నా మాటలు నీకు నచ్చవని నాకు తెలుసు. నా మాటలతో నీ మనసుకు కష్టం కలిగించి ఉంటే నన్ను క్షమించు. నిన్ను నీవు రక్షించుకో. ఈ లంకను, లంకలో ఉన్న రాక్షసులను రక్షించు. నేను వెళ్లిపోతున్నాను. నీవు శుభం కలుగు గాక!" అని పలికి విభీషణుడు ఆకాశమార్గాన తన అనుచరులతో వెళ్లిపోయాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము పదునారవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
పదునేడవ సర్గ.

విభీషణుని అన్న రావణుడు విభీషణునికి శత్రువు అయ్యాడు. రావణుని శత్రువు రాముడు విభీషణునికి మిత్రుడు అయ్యాడు. తన శత్రువుకు శత్రువు తనకు మిత్రుడు అవుతాడు కదా! ఆ రాజనీతి ప్రకారము విభీషణుడు రావణుని శత్రువు రాముడి వద్దకు వెళ్లాడు. సముద్రము దాటి వానర సేన ఉన్న చోటికి వెళ్లాడు.

ఆకాశంలో నిలిచి ఉన్న విభీషణుని నేల మీద ఉన్న వానర నాయకులు చూచారు. విభీషణుని పక్కన ఉన్న నలుగురు రాక్షసులను కూడా వారు చూచారు. వెంటనే ఈ విషయము సుగ్రీవునికి చెప్పారు. సుగ్రీవుడు కూడా ఆకాశంలో వెలిగిపోతున్న ఐదుగురురాక్షస వీరులను చూచాడు. తన వానరనాయకులతో ఇలా ఆలోచించాడు.

"ఆకాశంలో ఉన్న వారు రాక్షసులు. సందేహము లేదు. వారి చేతులలో ఆయుధములు కూడా ఉన్నాయి. వారు కవచములు ధరించి ఉన్నారు. వారు లంక నుండి మనలను చంపడానికి వచ్చిఉంటారు. కాబట్టి మీరు సర్వసన్నద్ధంగా ఉండండి." అని పలికాడు సుగ్రీవుడు.

వెంటనే వానరులు చేతికి అందిన రాళ్లు, వృక్షములు, కొమ్మలు తీసుకొని వారిని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నారు. "రాజా! మాకు అనుమతి ఇవ్వండి. మేము వెంటనే ఎగిరి పోయి ఆ నలుగురిని హతమారుస్తాము" అని పలికారు వానరులు.

వానరులు వెళ్లి తమ నాయకుడికి చెప్పడం, ఆ నాయకుడు తన వంక చూడ్డం, తన వారితో మాట్లాడటం, వానరులు తలా ఒక ఆయుధము చేత ధరించడం చూస్తూనే ఉన్నాడు విభీషణుడు. అతనికి విషయం అర్థం అయింది. వెంటనే విభీషణుడు, పెద్ద కంఠంతో, సుగ్రీవునికి వానరులకు వినబడేటట్టు ఇలా అరిచాడు.

"ఓ వానర వీరులారా! రావణుడు లంకకు రాజు. రాక్షసుడు. నేను అతని తమ్ముడను. నా పేరు విభీషణుడు. నా అన్న రావణుడు రాముని భార్య సీతను జనస్థానము నుండి అపహరించి తెచ్చాడు. దారిలో అడ్డుకున్న జటాయువును చంపాడు. సీతను అశోక వనములో ఉంచాడు. ఆమెకు రాక్షస స్త్రీలను కాపలా పెట్టాడు. నా అన్న రావణుడు చేసిన పని నాకు నచ్చలేదు. అది తప్పు అని చెప్పాను. సీతను రామునికి ఇచ్చివేయమన్నాను. కాని రావణుడు నా మాట వినలేదు. నన్ను అవమానించాడు. నన్ను రాజ్యములో నుండి వెళ్లగొట్టాడు. అందుకని నేను భార్యాబిడ్డలను వదిలి

రాముని శరణుకోరి వచ్చాను. నా రాక గురించి రామునికి తెలుపండి. ” అని గట్టిగా అరిచి చెప్పాడు విభీషణుడు.

ఈ మాటలు విన్న సుగ్రీవుడు కంగారుగా రామలక్ష్మణుల వద్దకు వెళ్లాడు. రామునికి ఈ విషయం చెప్పి, విభీషణుని రాక తెలియజేసాడు. ఇంకా ఇలా అన్నాడు. “ఓ రామా! వీడు మనకు శత్రువు. వీడిని మనము మనలో చేర్చుకుంటే గుడ్లగూబ కాకి పిల్లలను తిన్నట్టు వాడు మనలను తినేస్తాడు. కాబట్టి ఓ రామా! బాగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకో. నీ నిర్ణయం మీద ఈ వానరవీరుల జీవితాలు ఆధారపడి ఉన్నాయి. శత్రువులు ప్రయోగించు మంత్రాంగములు, వ్యూహములు, గూఢచర్యము, వీటిని గుర్తించి నిర్ణయం తీసుకో.

వీరు రాక్షసులు. కామరూపులు. కపటోపాయములు తెలిసిన వారు. అక్కడ మాయం అయి ఇక్కడ ప్రత్యక్షం అవుతుంటారు. వారి మాయలు మంత్రాలు తెలిసి ప్రవర్తించాలి మనం. వారిని ఎన్నటికీ నమ్మకూడదు. ఈ వచ్చిన వాడు రావణుని గూఢచారి అయి ఉంటాడు. వీడు మనలో చేరి, మనలో మనకు విభేదాలు కల్పించి మనలను నిర్వీర్యులుగా చెయ్యడానికే వచ్చాడు అని అనుకుంటున్నాను. లేకపోతే వీడు మనలో ఒకడుగా చేరి. మన విశ్వాసమును పొంది, మన ఆనుపానులు,మన సైనిక రహస్యములు తెలుసుకొని, రావణునికి చేరవేయగలడు.

ఓ రామా! ప్రస్తుతము విభీషణుడు అనబడే రావణుని సోదరుడు, తన నలుగురు అనుచరులతో కలిసి నీ శరణుగోరి వచ్చాడు. ఇతడు రాక్షసుడు. రావణునికి సోదరుడు. రావణుని దగ్గర నుండి

వస్తున్నాడు. ఇతనిని ఎలా నమ్మడం? కాబట్టి వీరిని పట్టి బంధించి చంపివేయడమే ఉత్తమమైన మార్గము. తరువాత మీ ఇష్టము.”అని పలికి ఊరుకున్నాడు సుగ్రీవుడు.

రాముడు సుగ్రీవుడు చెప్పిన పలుకులు సావధానంగా విన్నాడు. సుగ్రీవుని పక్కనే హనుమంతుడు, మిగిలిన వానర వీరులు నిలబడి ఉ న్నారు. వారందరినీ చూచి రాముడు ఇలా అన్నాడు. “మన శరణు కోరి వచ్చిన విభీషణుని గురించి సుగ్రీవుడు చెప్పిన మాటలను మీరంతా విన్నారు కదా! మీరంతా నాకు మిత్రులు, శ్రేయోభిలాషులు. మీ మాటలు నాకు ఎంతో విలువైనవి. కాబట్టి ఈ విషయంలో మీ మీ అభిప్రాయాలు తెలియజెయ్యండి.” అని అడిగాడు రాముడు.

అప్పుడు హనుమంతుడు రాముని చూచి ఇలా అన్నాడు. “రామా! నీకు తెలియని విషయములు లేవు. మేమంతా నీ శ్రేయోభి లాషులము కాబట్టి మా అభిప్రాయాలు అడుగుతున్నావు. అది నీ మంచి తనము. మాకు నీవు ఇస్తున్న మర్యాద. వానర నాయకులు ఒక్కరొక్కరుగా తమ తమ అభిప్రాయాలు నీకు వినిపిస్తారు. ముందుగా యువరాజు అంగదుడు తన అభిప్రాయాన్ని వినిపిస్తాడు.” అని అన్నాడు.

అప్పుడు అంగదుడు లేచి ఇలా అన్నాడు. “రామా! ఇతడు రాక్షసుడు. రాక్షసరాజు రావణుని వద్దనుండి వచ్చాడు. ఇతని రాక సందేహాస్పదంగా ఉంది. ఇతనిని నమ్మడానికి వీలు లేదు. కాబట్టి ఇతనిని తొందర పడి మనలో చేర్చుకొన కూడదు. ఇతనిని అన్నివిధాలా పరీక్షించాలి. ఎందుకంటే మనసులో కుటిలము పెట్టుకొన్న వారు పైకి చాలా సౌమ్యంగా నమ్రతగా కనిపిస్తారు. సమయం వచ్చినప్పుడు దారుణంగా కోలుకోలేని

దెబ్బ తీస్తారు. కాబట్టి మనము ఇతని పట్ల చాలా అప్రత్తంగా ఉండాలి. ఈ విభీషణుడు మంచి వాడైతే స్వీకరించవచ్చును. ఏమాత్రం సందేహము కలిగినా ఇతనిని చంపడమే యుక్తము." అని పలికాడు అంగదుడు.

శరభుడు అనే వానరుడు ఇలా అన్నాడు. "రామా! ఇతనిని పరీక్షించడానికి ఒక సూక్ష్మ బుద్ధిగల గూఢచారిని పంపడం ఉత్తమమైన మార్గము. ఆ గూఢచారి అతనిని అన్ని విధములా పరీక్షించిన తరువాత, అతడు ఉత్తముడు అని తేలితే అతనికి శరణాగతి ఇవ్వవచ్చును. అతని ప్రవర్తన సందేహాస్పదంగా ఉంటే అతనిని విడిచిపెట్టడమే మంచిది." అని పలికాడు శరభుడు.

తరువాత జాంబవంతుడు లేచి ఇలా అన్నాడు. "ఈ వచ్చినవాడు నీ శత్రుడు రావణుని తమ్ముడు. ఇతడు శాంతి కాలంలో రాలేదు. మనము రావణునితో యుద్ధము చేయు సమయములో వచ్చాడు. కాబట్టి ఇతనిని నమ్మడానికి వీలు లేదు." అని అన్నాడు.

తరువాత మైందుడు లేచి ఇలా అన్నాడు. "ఓ రామా! ఇతడు రాక్షస రాజు అయిన రావణుని తమ్ముడు. అందుకని ఇతనిని పరుషంగా కాకుండా సరళంగా ప్రశ్నించడంమంచిది. అప్పుడు అతడు మంచివాడో చెడ్డవాడో తెలుసు కొనవచ్చును. తరువాత ఏది యుక్తమో అది చేయ వచ్చును." అని అన్నాడు.

తరువాత హనుమంతుడు లేచి ఇలా అన్నాడు. "ఓ రామా! నీవు బుద్ధిలో బృహస్పతితో సమానుడవు. నీకు చెప్పదగిన వాడిని కాను. కానీ నీవు నా అభిప్రాయమును చెప్పమన్నావు కాబట్టి చెబుతున్నాను. నాకు

ఉచితము యదార్ధము అని తోచిన విషయాలుచెబుతాను. ఇప్పుడు చెప్పిన వారిలో కొంత మంది మంత్రులు విభీషణుని రాక వలన మనకు కలుగు లాభనష్టములను గురించి మాట్లాడారు. కాని అందులో నాకు దోషము కనపడుతూ ఉంది. ఒక మనిషిలోని సామర్ధ్యము తెలుసుకోవాలంటే అతనిని మనము ఏదైనా పనిలో నియోగించాలి. అతడు ఆ పనిని ఎంత చాకచక్యంతో చేస్తాడో చూడాలి. అప్పుడు అతని సమర్ధత నిర్ణయించాలి. కేవలం అతనితో మాట్లాడినంత మాత్రాన అతని సామర్ధ్యము మనకు తెలియదు కదా!

కొంత మంది విభీషణుని వద్దకు గూఢచారులను పంపవలెనని చెప్పారు. అది కూడా సరికాదు. గూఢచర్యము ఎదుటి మనిషికి తెలియకుండా చెయ్యాలి. మన ఎదురుగా ఉన్న వారి మీద గూఢచర్యము ఎలా చెయ్యగలము. మరి కొందరు ఏమన్నారంటే, విభీషణునికి మనం శత్రువులం. పైగా ఇది యుద్ధసమయం. కాబట్టి దేశంకాని దేశానికి, కాలం కాని కాలంలో వచ్చాడు కాబట్టి విభీషణుని తిరస్కరించాలి అని అన్నారు. అది కూడా సరి కాదు. ఎందుకంటే మనిషిని బట్టి అవసరాన్ని బట్టి దేశ,కాలములు మారుతుంటాయి. ఇతడు రావణుని దుర్మార్గమును, నీతి బాహ్యమైన చర్యలను చూచి విసిగిపోయి మనదగ్గరకు వచ్చాడేమో! అటువంటప్పుడు ఏసమయంలో వచ్చాడు మనము ఎక్కడ ఉండగా వచ్చాడు అన్న ప్రశ్న తలెత్తదు కదా!

మరి కొంత మంది ఇలా అన్నారు. విభీషణునికి తెలియని కొంత మందిని పంపి అతనిని ప్రశ్నించి నేర్పుగా అతని రహస్యములను రాబట్టాలి అని అన్నారు. అది కూడా సరి కాదు. విభీషణుని వద్దకు పోయి అతని గురించి అడిగితే, విభీషణుడు ఆ ప్రశ్నలు అడిగిన వాడి గురించి అనుమాన

పడవచ్చు కదా! విభీషణుడు విముఖుడై వెళ్లిపోతే, మనము ఒక మంచి మిత్రుడిని పోగొట్టుకున్నవాళ్లము అవుతాము కదా!

ఓ రామా! ఎదుటి వాళ్లు ఎలా మాట్లాడుతున్నారో, ఏ కంఠస్వరంతో మాట్లాడుతున్నారో, మాట్లాడేటప్పుడు ఎటువంటి హావభావాలు ప్రదర్శిస్తున్నారో సునిశితంగా పరిశీలిస్తే తప్ప, ఎదుటి వాళ్ల మనసులోని భావాలను కనిపెట్టలేము. విభీషణుడు తన గురించి చెప్పినప్పుడు నేను అతనిని నిశితంగా పరిశీలించాను. అతని మాటల్లో ఎలాంటి దుష్టభావన నాకు కనపడలేదు. అతనిలో నాకు ఎలాంటి కపటము కనపడలేదు. పైగా మనసులో కపటబుద్ధికలవాడు, అంత ధైర్యంగా మనదగ్గరకు రాడు. కాబట్టి అతనిని గురించి అనుమాన పడవలసిన అవసరము లేదు.

అదీకాకుండా, ఓ రామా! మనసులో భావాలను బయట పడకుండా దాచడం అంత సులభంకాదు. ఎందుకంటే, మనసులో మెదులుతున్న భావనలను శరీరం బలవంతంగానైనా బయటకు ప్రకటిస్తుంది. (ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ ది మైండ్ అన్న విషయాన్ని వాల్మీకి మహర్షి మనకు త్రేతాయుగంలోనే రామాయణ కావ్యంలో చెప్పాడు.) విభీషణుడు సరి అయిన కాలములోనే మన వద్దకు వచ్చాడు. తన అన్న రావణునితో విభేదించి వచ్చాడు. తన అన్న రావణునికి శత్రువైన నీ వద్దకు వచ్చాడు. నీ గురించి బాగా తెలుసుకొని నీ వల్ల ప్రయోజనం పొందడానికి వచ్చాడు.

నీవు వాలిని చంపి సుగ్రీవుని కిష్కింధకు పట్టాభిషిక్తుడిని చేసావు. వాలిని చంపిన నీవు, రావణుని కూడా చంపి తనను లంకకు పట్టాభిషిక్తుని చేస్తావనే ఆలోచనతో, ఆశతో, విభీషణుడు నీ వద్దకు

వచ్చాడు. లంకకు రాజు కావాలనే కాంక్షతోనే విభీషణుడు నీ వద్దకు వచ్చాడు. అతనిని మనం సక్రమంగా ఉపయోగించుకుంటే, మనకు విజయం చేకూరుతుంది. కాబట్టి ఈ రాక్షసుడు, విభీషణుడు, నమ్మదగినవాడు. ఇతనిలో ఏ దుర్బుద్ధీ లేదు. అని నా భావన. తరువాత మీ ఇష్టము."అని యుక్తియుక్తముగా పలికి కూర్చున్నాడు హనుమంతుడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము పదిహేడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము.
పదునెనిమిదవ సర్గ.

అందరూ మాట్లాడడం అయిన తరువాత రాముడు తన అభిప్రాయాన్ని ఈ విధంగా వెల్లడించాడు.

"వానరవీరులారా! విభీషణుని గురించి మీరంతా చెప్పినది విన్న తరువాత నా అభిప్రాయం కూడా చెబుతున్నాను. ఎవరైనా నా దగ్గరకు వచ్చి "నేను నీకు మిత్రుడను, శరణాగతుడను" అని చెబితే వారిలో ఎన్ని దోషాలు ఉన్నాకూడా, నేను వారిని విడిచిపెట్టను. అది నా వ్రతము. అన్నీ సుగుణములు ఉన్న వాడిని రక్షించే దానికంటే, దోషములు ఉన్న వాడిని రక్షించడంలోనే మన మంచితనం బయటపడుతుంది." అని ఒక్కవాక్యంలో తన నిర్ణయం తెలిపాడు రాముడు.

ఆ మాట విన్న తరువాత కూడా సుగ్రీవుడు తన పట్టుదల విడువ లేదు. "రామా! వచ్చిన వాడు రాక్షసుడు. వాడు దుష్టుడో కాదో మనకు అనవసరము. ఈ విభీషణుడు తనకు బాగా జరిగినంత కాలము తన అన్న రావణుని వద్ద ఉన్నాడు. ఇప్పుడు రావణునితో విభేదము కలిగేటప్పటికి రావణుని విడిచిపెట్టి నీ దగ్గరకు చేరాడు. స్వంత అన్ననే వదిలిన వాడు, రేపు నిన్ను నన్ను కూడా విడిచిపెట్టకుండా ఉంటాడా! అటువంటి వాడు తన స్వార్థం కోసం ఎవరినైనా విడిచిపెడతాడు. ఎంతటి ఘాతుకానికైనా ఒడిగడతాడు. ఇటువంటి స్వార్థపరుడికి, అవకాశవాదికి, ఆశ్రయం ఇవ్వడం శ్రేయస్కరము కాదు." అని పలికాడు సుగ్రీవుడు.

(ఒక పార్టీలో ఉండి ఎన్నికలలో నెగ్గి, ఏపదవీ లేకపోతే, ఏ ప్రాధాన్యము లేకపోతే, నాయకుడితో విభేదించి, అలా సంవత్సరంలో నాలుగు పార్టీలు మార్చి, ఎక్కడా లాభసాటిగా కనపడకపోయే సరికి, మరలా "అబ్బే అదేం లేదు. మనం మనం ఒకటీ" అని సన్నాయి నొక్కులు నొక్కుతూ, సిగ్గూ ఎగ్గూ లేకుండా అసలు పార్టీలో చేరిన వాళ్లను మనం రోజూ చూస్తున్నాము. అదే విషయాన్ని సుగ్రీవుడు విపులంగా చెప్పాడు. అవకాశ వాదం నాడూ నేడూ ఒకేవిధంగా ఉంది.).

సుగ్రీవుని మాటలు విన్న రాముడు అతనితో ఏమీ మాట్లాడలేదు. లక్ష్మణుని వంక చూచి ఇలా అన్నాడు. "లక్షణా! సుగ్రీవుడు లౌక్యంగా మాట్లాడుతున్నాడు కానీ, శాస్త్ర పరంగా మాట్లాడటం లేదు. ఇటువంటి మాటలు సామాన్యులు కూడా మాట్లాడరు. ఇక్కడ ఒక ధర్మసూక్ష్మము ఉంది. రావణుడు, విభీషణుడు అన్నదమ్ములు. ఇద్దరూ రాక్షస కులమునకు చెందినవారు. కానీ ఒకరికి ఒకరు శత్రువులు అయ్యారు. రావణుడు లంకకు రాజు. రాజైన వాడు ఒక్కోసారి సాటివారు ధర్మపరులు

అయినా వాళ్లను నమ్మరు. పైగాశంకిస్తారు. ఈ విభీషణుడు ధర్మపరుడు కావచ్చును. కానీ రాజధర్మము ప్రకారము రావణుడు అతనిని శంకించి ఉండవచ్చు అంతమాత్రాన మనము ఇతనిని అనుమానించరాదు. మన శత్రువుల వద్దనుండి వచ్చినంత మాత్రాన అతడు కూడా మనకు శత్రువు కానవసరం లేదుకదా! మనశత్రువుకు శత్రువైన విభీషణుడు మనకు మిత్రుడు కావచ్చు కదా!

పైగా మనము విభీషణుని కులమునకు చెందిన వారము కాము. వారు రాక్షసులు. మనము క్షత్రియులము. విభీషణునికి మనకూ సహజమైన శత్రుత్వము లేదు. ఈ విభీషణునికి లంకను పాలించవలెనని కోరికగా ఉన్నటు తెలుస్తూ ఉంది. బుద్ధిహీనత వలన అలా కోరుకుంటున్నాడా అని అనుకున్నాకూడా, రాక్షసులు అందరూ బుద్ధిహీనులు కారు కదా! రాక్షసులలో కూడా విద్వాంసులు, పండితులు, శాస్త్రవేత్తలు, వేద వేదాంగ పారంగతులు ఉన్నారు. కాబట్టి విభీషణుని మనము మిత్రునిగా స్వీకరించడంలో తప్పులేదు. లోకంలో దాయాదులు ఎవరూ మిత్రుల మాదిరి కలిసి మెలిసి ఉండరు. వారిలో వారికి మనస్పర్ధలు ఉంటుంటాయి. అందుకే జ్ఞాతులు సాధారణంగా విడిపోతుంటారు. విభీషణుడు కూడా రావణుడికి తమ్ముడు. సీత కారణంగా అన్నదమ్ములకు భేదాభిప్రాయాలు వచ్చి ఉంటాయి. అందుకే అన్న తమ్ముడిని తరిమేసాడు.

లక్ష్మణా! సోదరులు అందరూ భరతుని మాదిరి ఉంటారా చెప్పు. అలాగే కుమారులందరూ నా మాదిరి తండ్రి మాటను పాటించేవారు ఉంటారా! సుగ్రీవా! స్నేహితులందరూ నీ వంటి వాళ్లు ఉంటారా!" అని నర్మగర్భంగా అన్నాడు రాముడు.

రాముడి మాటలలో ఉన్న అంతరార్థము అర్థం చేసుకున్నాడు లక్ష్మణుడు. కాని సుగ్రీవుడు మాత్రము తన పాత మాటకే కట్టుబడి ఉన్నాడు. విభీషణుని మిత్రుడిగా అంగీకరించుటకు అతని మనసు ఒప్పుకోడం లేదు. అందుకని రామునితో ఇలా అన్నాడు.

"ఓ రామా! నామాట విను. ఈ రాక్షసుడు రావణుని గూఢచారి. అతనిని నమ్మకు. అతనిని చంపడమే యుక్తము. అతనికి శరణాగతి ఇవ్వడం అనర్థదాయకము. ఈ విభీషణుడు రావణుని ఆదేశము మేరకు నిన్ను, లక్ష్మణుని, నన్ను చంపడానికే ఇక్కడకు వచ్చాడు. ఇందులో సందేహము లేదు. ఇతడు ఆ క్రూరుడైన రావణుని సోదరుడు అని మరిచిపోకూడదు. కాబట్టి ఇతనిని ఇతని మంత్రులతో సహా బంధించి శిక్షించాలి." అని చెప్పి ఊరుకున్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుని మాటలు విన్న రాముడు తన మనోనిశ్చయాన్ని ఇలా ప్రకటించాడు. "వానరవీరులారా! మన వద్దకు వచ్చిన రాక్షసుడు దుష్టుడు అయినా, కాకపోయినా మనకు వచ్చిన భయం ఏమీ లేదు. ఇతడు నాకు గానీ మీలో ఎవరికైనా గానీ ఎటువంటి అపకారమూ చేయలేడు. సుగ్రీవా! నేను తలచుకుంటే ఈ భూమి మీద ఉన్న రాక్షసులను, దానవులను, యక్షులను ఒంటి చేత్తో చంపగలను. ఈ ఐదుగురు రాక్షసులు ఏ పాటి!

ఇంక శరణాగతి గురించి చెబుతాను. ఇది వరకు ఒక పావురము తన శరణు జొచ్చిన శత్రువునకు తన మాంసమునే ఆహారముగా పెట్టినది అని విన్నాము కదా! తన భార్యను చంపిన శత్రువు తన ఇంటికి వస్తే, అతనికి ఆతిథ్యము ఇచ్చినపావురము సంగతి మనకందరికీ తెలుసు కదా! ఒక పక్షి అలా చేసినపుడు మన మానవులము దానికి భిన్నంగా

ఎలా నడుచుకుంటాము? కణ్వమహర్షి కుమారుడు కండుడు అను వాడు ధర్మము తెలిపే కధలను కొన్ని చెప్పాడు. వాటిని ఒకసారి గుర్తుకు తెచ్చుకో!

రెండు చేతులూ జోడించి, దీనంగా తనను శరణు కోరిన శత్రువును క్షత్రియులు చంపకూడదు. అలాగే ఇతరుల చేత చిక్కిన తన శత్రువును, క్షత్రియుడు తన ప్రాణములనైనా పణంగా పెట్టి రక్షించాలి. తన శరణుజొచ్చిన శత్రువును కూడా కాపాడలేక పోయిన క్షత్రియుడు మహాపాపము చేసిన వాడితో సమానమవుతాడు. అలాగే, తన శరణుజొచ్చిన వాడిని తాను కాపాడ లేకపోగా, పైగా, అతడు తన కళ్లముందే మరణిస్తే, ఆ మరణించిన వాడు, తాను శరణుజొచ్చిన వాడి పుణ్యమును అంతా తన వెంట తీసుకొనిపోతాడు.

ఇప్పుడు విభీషణుడు మన శరణు కోరి వచ్చాడు. ఇప్పుడు మనము అతనిని నిరాకరిస్తే, పైన చెప్పిన పాపములు అన్నీ మనకు చుట్టుకుంటాయి. పైగా మనకు అపకీర్తి వస్తుంది. కాబట్టి నేను కండు మహర్షి చెప్పిన ధర్మములను పాటిస్తాను. నా శరణు కోరి వచ్చిన విభీషణునికి అభయం ఇస్తాను. ఈ విభీషణుడే కాదు, ఎవడైనా సరేనా ముందుకు వచ్చి, నన్ను శరణు కోరితే, నేను వాడికి అభయం ఇస్తాను. ఇదే నేను అవలంబించుచున్న వ్రతనియమము. దీనికి తిరుగు లేదు.

ఓ సుగ్రీవా! ఆ వచ్చినవాడు, రావణుని తమ్ముడు విభీషణుడైనా, లేక సాక్షాత్తు రావణుడు అయినా సరే. అతనిని నా వద్దకు తీసుకొని రమ్ము. నేను అతనికి అభయము ఇచ్చాను అని చెప్పు." అని పలికాడు రాముడు. ఆ మాటలు విన్న సుగ్రీవుడు రాముడి ధర్మపాలనకు ఆశ్చర్యపోయాడు. సామాన్యుడైన తనకు రాముని ధర్మాచరణ సాధ్యం కాదనుకున్నాడు.

రామునికి నమస్కరించి ఇలా అన్నాడు.

" ఓ రామా! నీకు తెలియని ధర్మము లేదు. నీవు మూర్తీభవించిన ధర్మస్వరూపుడవు. మహా బలశాలివి. పరాక్రమవంతుడివి. నీవు ఈ విధంగా మాట్లాడటంలో ఆశ్చర్యం ఏముంది. నీమాటలు వింటుంటే నాకు కూడా విభీషణుడు మంచి వాడు, అభయము ఇవ్వతగ్గవాడు అనిపిస్తూ ఉంది. అందుకని ఈ విభీషణుని కూడా మన మిత్రునిగా అంగీకరిద్దాము. ఇప్పటినుండి విభీషణుడు కూడా మనకు అందరికీ మిత్రుడు. నేను ఇప్పుడే వెళ్లి విభీషణుని సగౌరవంగా తీసుకొని వస్తాను." అని అన్నాడు సుగ్రీవుడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము పదునెనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
పంతొమ్మిదవ సర్గ.

ఆకాశంలో నిలబడి ఉన్న విభీషణుడు, రాముడి ముందు వానర నాయకులు నిలబడి మాట్లాడటం వారిలో వారు వాదించుకోవడం అంతా చూస్తున్నాడు. చివరకు పర్యవసానము ఎలా ఉంటుందో అని భయపడుతున్నాడు. ఎందుకంటే రాముడి వద్దకు వెళదామని రావణునితో విభేదించి వచ్చాడు. రాముడూ కాదంటే ఎక్కడకు వెళ్లాలి అని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో సుగ్రీవుడు విభీషణుని కిందికి రమ్మని చెయ్యి ఊపాడు. పట్టరాని సంతోషంతో విభీషణుడు తన అనుచరులతో కిందికి దిగాడు. పరుగు పరుగున రాముని వద్దకు వెళ్లాడు. రాముని ముందు సాగిల పడ్డాడు. రాముని పాదములను స్పృశించాడు. రామునితో ఇలా అన్నాడు.

“రామా! నా పేరు విభీషణుడు. రావణుని సోదరుడను. నా అన్న రావణుడు నన్ను అవమానించి రాజ్యమునుండి వెళ్లగొట్టాడు. నీవు శరణాగతరక్షకుడవు అని విని నీ శరణుకోరి వచ్చాను. నేను లంకను, లంకలో ఉన్న నా భార్యాబిడ్డలను, నా బంధుమిత్రులను అందరినీ వదిలి వచ్చాను. నా రాజ్యము, నా జీవితము నీ మీదనే ఆధారపడి ఉన్నాయి.” అని అన్నాడు.

రాముడు విభీషణుని పట్టుకొని లేవనెత్తాడు. విభీషణుని ప్రేమతో చూస్తూ ఇలా అన్నాడు. “నీవు రాక్షసుల బలాబలముల గురించి నాకు వివరంగా చెప్పు” అని అడిగాడు. విభీషణుడు విషయం అర్థం చేసుకున్నాడు. రావణుని బలము, బలహీనతల గురించి చెప్పనారంభించాడు.

“ ఓ రామా! రావణుడు బ్రహ్మ గురించి తపస్సు చేసి వరములు పొందాడు. ఆ వర ప్రభావంతో రావణుని దేవ,దానవ,గంధర్వ,నాగజాతులు చంపజాలవు. రావణునికి నాకూ మధ్యలో కుంభకర్ణుడు అనే సోదరుడు ఉన్నాడు. వాడు మహాబలవంతుడు. దేవేంద్రుడు కూడా యుద్ధములో అతని ముందు నిలువలేడు. రావణునికి ప్రహస్తుడు అనే సేనాపతి ఉన్నాడు. అతడు మణిభద్రుడు అనే యక్షుడిని కైలాస పర్వతము మీద

ఓడించాడు. రావణుని కుమారుడు ఇంద్రజిత్తు. యుద్ధవిద్యలలో ఆరితేరినవాడు. అతడు అదృశ్యరూపంలో యుద్ధంచేయగల నేర్పరి. వారు కాకుండా మహోదరుడు, మహాపార్శ్వుడు, అకంపనుడు అని రావణునికి సేనాధిపతులు ఉన్నారు. లంకలో ఉన్న రాక్షసులు అందరూ కామరూపులు. తమ ఇష్టం వచ్చిన రూపములు ధరించడంలో సమర్థులు. వారందరూ మాంసాహారులు. రావణుడు లోకపాలకులను, దేవతలను యుద్ధములో ఓడించాడు. వారిని తన వశంలో ఉంచుకున్నాడు." అని విభీషణుడు లంక రహస్యములను అన్నీ చెబుతూ ఉంటే రాముడు కళ్లు మూసుకొని వింటున్నాడు. అన్నీ మనసుకు పట్టించుకుంటున్నాడు. కళ్ళుతెరిచి విభీషణునితో ఇలా అన్నాడు.

"విభీషణా! నీవు నీ అన్న రావణుని గురించి అతని బలమును, పరాక్రమమును గురించి అతని సేనల గురించి చెప్పావు. నేను వాటిని చక్కగా ఆకళింపుచేసుకున్నాను. ఇప్పుడు నీకు నేను మాట ఇస్తున్నాను. నేను రావణుని, ఇంద్రజిత్తును, ప్రహస్తుని చంపి, నిన్ను లంకకు రాజును చేస్తాను. రావణుడు ముల్లోకములలో ఎక్కడ దాక్కున్నా వెదికి వెదికి చంపుతాను. నేను నా ముగ్గురు సోదరుల మీద ఒట్టుపెట్టుకుంటున్నాను. నేను రావణుని, అతని కొడుకులను, బంధు మిత్రులను చంపకుండా అయోధ్యలో ప్రవేశించను. ఇదే నా ప్రతిజ్ఞ." అని పలికాడు.

ఆ మాటలకు విభీషణుడు ఉబ్బితబ్బిబ్బయ్యాడు. రామునితో ఇలా అన్నాడు. "ఓ రామా! మీరు లంకను ముట్టడించడంలోనూ, లంకను జయించడంలోనూ, రావణుని చంపడంలోనూ నేను సాయం చేస్తాను. నా శక్త్యానుసారము నేను రాక్షసులతో యుద్ధము చేస్తాను."అని అన్నాడు విభీషణుడు.

రాముడు వెంటనే సముద్రము నుండి జలమును తెప్పించాడు. లక్ష్మణుని చూచి ఇలా అన్నాడు. "లక్ష్మణా! ఈ సముద్ర జలముతో నీవు విభీషణుని లంకా రాజ్యమునకు పట్టాభిషిక్తుడిని చెయ్యి. అది చూచి నేను సంతోషిస్తాను." అనిపలికాడు. రాముని ఆదేశానుసారము లక్ష్మణుడు సమస్తవానరుల సమక్షంలో విభీషణుని లంకా సామ్రాజ్యానికి పట్టాభిషిక్తుని చేసాడు. అది చూచి వానరులంతా సంతోషంతో కేరింతలుకొట్టారు. ఆడారు పాడారు. ఇప్పుడు హనుమంతుడు, సుగ్రీవుడు కలిసి విభీషణుని సూటిగా ఒక మాట అడిగారు.

"అంతా బాగానే ఉంది. ఇప్పుడు మనమందరము ఈ సముద్రాన్ని దాటి లంకను చేరుకొనేది ఎటుల సాధ్యమో మీరు చెప్పండి."అని అన్నాడు. దానికి విభీషణుడు ఇలా అన్నాడు. "రాముడు సముద్రమును దారి ఇమ్మని అర్థించడం మంచిది. ఎందుకంటే సముద్రమును త్రవ్వించిన సగరుడు ఇక్ష్వాకు వంశమునకు చెందిన వాడు. రామునికి పూర్వీకుడు. రాముడు అర్థిస్తే సాగరము తప్పక సాయం చేస్తుంది. దారి ఇస్తుంది." అని అన్నాడు విభీషణుడు. అవేమాటలు సుగ్రీవుడు, హనుమంంతుడు రామలక్ష్మణులకు చెప్పారు. ఈ ఆలోచన రామునికి కూడా నచ్చింది.

రాముడు లక్ష్మణుని, సుగ్రీవుని చూచి ఇలా అన్నాడు. "సుగ్రీవా! విభీషణుని ఆలోచన నాకు బాగా నచ్చింది. మీరు ఇరువురూ కలిసి సుముహూర్తమును నిర్ణయించి నాకు తెలియజేయండి." అని అన్నాడు. అప్పుడు లక్ష్మణుడు రాముని చూచి ఇలా అన్నాడు. "రామా! విభీషణుని ఆలోచన నాకూ నచ్చింది. కానీ, ఇంత విశాలమైన సాగరము మీద సేతువు కట్టకుండా దాటడం సాధ్యమా! సేతువు కట్టకుండా దేవతలు, దానవులు కూడా ఈ సముద్రమును దాటలేరు కదా! కాబట్టి సేతువు నిర్మాణమునకు

సముద్రుని సాయం అడగండి.” అని అన్నాడు లక్ష్మణుడు.

వెంటనే రాముడు సముద్ర తీరంలో దర్భలతో ఒక శయ్య ఏర్పాటుచేసుకున్నాడు. దాని మీద పడుకున్నాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము పంతొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ఇరువదవ సర్గ.

విభీషణుడు తన వద్దనుండి వెళ్లగానే రావణుడికి అనుమానం కలిగింది. శార్దూలుడు అనే రాక్షసుని పంపించాడు. శార్దూలుడు మారువేషంలో వానర సైన్యం వద్దకు వచ్చాడు. వానర సైన్యము పన్నిన వ్యూహములు అన్నీ గమనించాడు. వెంటనే లంకకు చేరుకున్నాడు. రావణునికి వానర సైన్యము గురించి వివరంగా చెప్పాడు.

“మహారాజా! వానర సైన్యము అపారంగా ఉంది. ఇంత అని చెప్పవీలు లేదు. వారందరూ సముద్రము ఆవల ఒడ్డున నిలిచి ఉన్నారు. వారికి రామలక్ష్మణులు నాయకత్వము వహిస్తున్నారు. వానర సైన్యము సముద్రము ఒడ్డున పదియోజనముల దూరము విస్తరించి ఉంది. నేను పైపైన చూచి వచ్చాను. తమరు మరి కొంత మంది గూఢచారులను పంపిన వారు సమగ్రమైన సమాచారమును సేకరించగలరు. ప్రస్తుతము ఆ వానర సేనతో యుద్ధము కన్నా సామో పాయము, దానో పాయము,

భేదోపాయము ప్రయోగించడం ఉచితము.” అని అన్నాడు శార్దూలుడు.

శార్దూలుని మాటలు విన్న రావణుడు కొంచెం కంగారు పడ్డాడు. ఏదో వానరులు కదా, రామలక్ష్మణులు నరులు కదా అని ఉపేక్ష చేసాడు. కానీ ప్రస్తుత పరిస్తితి చూస్తుంటే వానరులతో యుద్ధము అంత సులభం కాదనిపించింది. వెంటనే రావణుడు శుకుడు అనే రాక్షసుని పిలిపించాడు. “నీవు నా పంపున సుగ్రీవుని వద్దకు దూతగా వెళ్లు. నేను చెప్పు మాటలను సౌమ్యంగా ఉన్నది ఉన్నట్టు చెప్పు.

“సుగ్రీవా! నీవు ఉత్తమ కుల సంజాతుడవు. ఋక్షస్సు కుమారు డవు. నీకూ నాకు ఎలాంటి వైరము లేదు. నీవు నాకు సోదరుని వంటి వాడవు. ఈ యుద్ధమువలన నీకు ఎలాంటి ప్రయోజనము లేదు. నేను రాముని భార్యను తీసుకొని వచ్చాను. అది నాకూ రామునికి సంబంధించిన విషయము. ఇందులో నీకు ఎలాంటి సంబంధము లేదు. కాబట్టి నీవు నీ సేనలతో కిష్కింధకు తిరిగి పొమ్ము. పైగా నీ వానర సైన్యము సాగరమును దాటి లంకలో ప్రవేశించడం కష్టం. అందరూ సముద్రములలో మునిగి పోతారు. ఎందుకంటే ఈ సాగరమును దాటడం దేవతలకు, దానవులకు, గంధర్వులకు కూడా వశం కాదు. ఇంక ఈ నరులు, వానరులు ఎలా దాటుతారు? కాబట్టి ఈ యుద్ధమును విరమించి కిష్కింధకు తిరిగి వెళ్లు.” అని నామాటలుగా సుగ్రీవునికి చెప్పు.” అని పలికాడు రావణుడు.

రావణుని సందేశమును తీసుకొని శుకుడు రివ్వున ఆకాశం లోకి ఎగిరాడు. సముద్రమునకు ఆవల నిలిచి ఉన్న వానర సేన వద్దకు చేరుకున్నాడు. ఆకాశంలోనే నిలబడి సుగ్రీవునితో ఇలా అన్నాడు.

"సుగ్రీవా! నేను లంకేశ్వరుడు రావణుని వద్దనుండి వచ్చాను. రావణుడు నీకు చెప్పమన్న మాటలను యధాతథంగా చెబుతున్నాను. సావధానంగా విను" అంటూ రావణుడు చెప్పిన మాటలను ఉన్నది ఉన్నట్టు చెప్పాడు. శుకుడు రావణుడు చెప్పమన్న మాటలు చెబుతూ ఉండగానే కొంత మంది వానరులు ఆకాశంలోకి ఎగిరారు. శుకుడిని పట్టుకున్నారు. వాడిని కొట్టుకుంటూ తన్నుకుంటూ కిందికి తీసుకొని వచ్చారు. అప్పుడు శుకుడు పెద్దగా అరుస్తున్నాడు.

"ఓ రామా! నేను రావణుని దూతను. దూతను చంపకూడదని నియమం ఉంది కదా! నన్ను రక్షించు. ఈ వానరులను వెనక్కురమ్మని చెప్పు. నన్ను కొట్టవద్దని చెప్పు నేను రావణుని చెప్పని మాటను ఒక్కటి కూడా అధికంగా చెప్పలేదు. రావణుడు చెప్పమన్న మాటలనే చెప్పాను. రావణుడు చెప్పమన్న దానికన్నా నేను అధికప్రసంగం చేసి ఉంటే నన్ను దండించడం, చంపడం యుక్తము. కాని నేను అలా చేయలేదు. నేను దూత నియమములను తప్పలేదు. నన్ను రక్షించు." అని పెద్దగా అరిచాడు.

శుకుని మాటలను ఆలకించిన రాముడు "అతనిని విడిచి పెట్టండి. చంపకండి" అని ఆదేశించాడు. తనకు ప్రాణభయం లేదని తెలుసుకున్న శుకుడు మరలా ఆకాశంలోకి ఎగిరాడు. ఆకాశంలో నిలిచి ఇలా అన్నాడు. "ఓ సుగ్రీవా! రావణుని సందేశమును విన్నావు కదా! నీవు రావణునికి ఏమి సందేశము ఇస్తావు. రావణునికి నన్ను ఏమని చెప్పమంటావు?" అని అడిగాడు. అప్పుడు సుగ్రీవుడు శుకునితో ఇలా అన్నాడు.

"ఓ రావణా! నీవు నాకు మిత్రుడవు కావు. బంధువు కావు. నీకూ నాకూ మిత్రత్వము కానీ సంబంధము కానీ లేదు. ఇదివరలో నీవు నాకు ఎలాంటి ఉపకారము చేసి ఉండలేదు. కాబట్టి నీ మాటలు పాటించవలసిన అవసరము నాకు లేదు. నీవు అకారణంగా రాముని భార్య సీతను అపహరించావు. రామునితో విరోధము కొనితెచ్చుకున్నావు. పరుల భార్యలను అపహరించిన వాడు దండనార్హుడు. అతనికి మరణదండన విధించవలెను. కాబట్టి నీకు రాముని చేతిలో మరణము తప్పదు. నేను నా వానర సైన్యముతో సముద్రమును దాటి లంకకు వచ్చి, నిన్ను, నీ పుత్రులను, బంధువులను అందరినీ సమూలంగా నాశనం చేస్తాను.

ఓ రావణా! నీవు మూర్ఖుడవు. రామునితో విరోధము పెట్టుకున్నావు. నీవు సూర్యలోకములో గానీ, పాతాళములో కానీ, కడకు ఈశ్వరుని పాదముల వద్ద ఉన్నా గానీ, రాముడు నిన్ను విడిచి పెట్టడు. నిన్ను చంపి తీరుతాడు. నిన్ను రక్షించగల వీరుడు ముల్లోకములలో నాకు కనిపించడం లేదు. నీవు అక్రమంగా సీతను అపహరిస్తున్నావు అని మంచి మాటలు చెప్పిన పక్షిరాజు జటాయువును నిర్దాక్షిణ్యంగా చంపావు.

నీవు నిజంగా వీరుడివి, పరాక్రమవంతుడివి అయితే, నీవు రాముడు ఇంట ఉండగా రాముడికి లక్ష్మణునికి తెలిసేటట్టు సీతను ఎందుకు అపహరించలేదు! రాముడంటే భయమా! రామ బాణము అంటే భయమా! రాముడి గురించి నీకు సరిగా తెలియదు. రాముడు తలుచుకుంటే ఈ భూమి మీద రాక్షసజాతి అనేది లేకుండా చేయగలడు. జాగ్రత్త!" అని అన్నాడు సుగ్రీవుడు.

వానర రాజు సుగ్రీవుడు చెప్పిన తరువాత యువరాజు అంగదుడు కూడా ఇలా అన్నాడు. "ఓ సుగ్రీవా! ఇతడు దూత కాడు. రాక్షసుల గూఢచారి. పైన నిలబడి మన సేనలను తేరిపార చూస్తున్నాడు. మన సేనల వివరాలు తెలుసుకుంటున్నాడు. ఇతడు తిరిగి లంకకు వెళ్లకూడదు. ఇదీ నా అభిప్రాయము." అని పలికాడు.

ఎప్పుడెప్పుడా అని ఉన్న సుగ్రీవునికి అంగదుని మాటలు ఊతాన్ని ఇచ్చాయి. వెంటనే శుకుని బంధించమన్నాడు. వానరులు వెంటనే ఆకాశం లోకి ఎగిరి శుకుని బంధించారు. శుకుడు పెద్దగా ఏడుస్తున్నాడు. మరలా "రామా రామా రక్షించు" అని అరుస్తున్నాడు. "ఓ రామా! ఈ వానరులు నన్ను బంధించారు. నన్ను కొడుతున్నారు. నా కళ్లు పీకుతున్నారు. ఇప్పుడు నేను వీళ్లచేతిలో చస్తే నా పాపాలన్నీ నీకు చుట్టుకుంటాయి." అని అరుస్తున్నాడు. మరలా రాముడు జోక్యం చేసుకొని శుకుని వానరుల బారి నుండి రక్షించాడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఇరువదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఇరువది ఒకటవ సర్గ.

పంతొమ్మిదవ సర్గలో ముగించినట్టు రాముడు సముద్ర తీరంలో, సముద్రునికి నమస్కారము చేసి, "నేను ఈ సముద్రమును దాటనైనా దాటవలె. లేకపోతే ప్రాయోపవేశము చేసి మరణించవలె. మరొక

మార్గము లేదు." అని సంకల్పించి, దర్భలమీద పడుకొని ఉన్నాడు. ఆ ప్రకారంగా మూడు రాత్రులు గడిచాయి. మూడు రోజులూ రాముడు సముద్రుని ఉపాసిస్తున్నాడు. కాని, సముద్రుడు రాముని వద్దకు రాలేదు. రాముడికి కోపం వచ్చింది. కళ్లు ఎర్రబడ్డాయి. పక్కనే ఉన్న లక్ష్మణుని చూచి ఇలా అన్నాడు.

"లక్ష్మణా! ఈ సముద్రునికి ఎంత గర్వము. నేను ఎంత వేడుకున్నను నా వద్దకు రాలేదు. నాలో ఉన్న శాంతి కాముకత, ఓర్పు, మంచి తనము నా చేతగాని తనంగా పరిగణిస్తున్నాడు సముద్రుడు. సాధారణంగా ఈ లోకంలో తనను తాను పొగుడుకొనే వాడికి, దుర్మార్గుడికి, అందరిమీద అధికారము చూపేవాడికి, అకారణంగా అటు ఇటు హడావిడిగా పరుగెత్తేవాడికి, అందరి మీదా బలప్రయోగము చేసేవాడికి ప్రజలు భయపడతారు. భక్తితో కొలుస్తారు. (ఈ సూక్తి ఈనాటి అధికార జులుంకు, గూండాయిజానికి సరిగ్గా సరిపోతుంది.) ఈ లోకంలో మంచి తనంతో, సౌమ్యతతో పనులు సాధించలేము. యుద్ధములో విజయము దక్కించుకోలేము. నేను నా బాణములచేత ఈ సముద్రమును ఎండింపజేస్తాను. సముద్రజలాలు ఇంకిపోయి సముద్రములో ఉన్న జలచరములు అన్నీ బయటపడేట్టు చేస్తాను. నేను ఓర్పుగా ఉన్నానని, నా ఓర్పును నా అసమర్థతగా, చేతగాని తనంగా పరిగణిస్తున్నాడు సముద్రుడు. ఇటువంటి వాని విషయంలో ఓర్పుగా ఉండటం మహా తప్పు.

లక్ష్మణా! నా ధనుర్బాణములు తీసుకొని రా! నా బాణముల శక్తి ఏమిటో ఈ సముద్రునికి తెలియజేస్తాను. ఈ సముద్రమును ఎండింపజేస్తాను. అప్పుడు వానరసేనలు హాయిగా సముద్రములో నడిచి

లంకకు చేరుకుంటాయి.” అని పలికి రాముడు తన ధనుస్సును సంధించాడు.

రాముడు కోపం తెచ్చుకున్నాడు. రాముని కళ్లు ఎర్రబడ్డాయి. ప్రజ్వరిల్లుతున్న ప్రళయాగ్నిలాగా ప్రకాశిస్తున్నాడు. సముద్రుని మీద శరవర్షము కురిపిస్తున్నాడు. రామ బాణములు సముద్రములోకి ప్రవేశించాయి. సముద్రములోని నీవు ఆవిరి కాసాగింది. సముద్రములోని జలచరములు ఈ ఉత్పాతానికి తల్లడిల్లిపోతున్నాయి. సముద్రములోనుండి పొగలు చెలరేగుతున్నాయి. సముద్రము అలలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆ అలలతోపాటు మొసళ్లు పాములు జలచరములు పైకి ఎగిసి పడుతున్నాయి. రాముని పక్కన ఉన్న లక్ష్మణుడు కూడా రాముని ఉగ్రస్వరూపమును చూచి భయపడ్డాడు. బాణములు సంధిస్తున్న రాముని చేయి గట్టిగా పట్టుకొని “రామా! వద్దు ఇంక చాలు. ఇంక ఆపు” అని వేడుకున్నాడు.

“రామా! మన కార్యము కొరకు కోట్లకొలదీ జలచరములకు ఆలవాలంగా ఉన్న సముద్రమును ఇంకింపజేస్తావా! మనము, మన వానరసేన సముద్రము దాటడానికి, సముద్రాన్ని ఇంతగా క్షోభింపచెయ్యాలా! మన కార్యము వేరేవిధంగా పూర్తిచేసుకోవచ్చు కదా! కోపము అన్ని అనర్థములకు మూలము. నీ వంటి ఉత్తములు కోపానికి వశులవడం మంచిది కాదు కదా! నీ పూర్వీకుల ఉత్తమ గుణములను గుర్తుతెచ్చుకో! నీ స్వార్థము కోసరం సముద్రమును క్షోభింపచేసి అపకీర్తిపాలుగాకు!” అని పలికాడు లక్ష్మణుడు.

శ్రీమద్రామాయణము యుద్ధకాండము

ఇరవైఒకటవ సర్గ సంపూర్ణము ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఇరవై రెండవ సర్గ.

రాముడు తన మాట మీదనే ఉన్నాడు. సముద్రుని చూచి ఇలా అన్నాడు. “ఓ సముద్రమా! నిన్ను ఇప్పుడే ఎండింపచేస్తాను. నేను నా బాణములతో నీ లోని నీటిని ఆవిరిగా మారుస్తాను. జలచరములను అన్నిటినీ చంపుతాను. అప్పుడు వానరులు నీ మీదుగా హాయిగా నడుచుకుంటూ లంకకు చేరుతారు. ఓ సముద్రుడా! నేను ఎన్ని విధముల బతిమాలిననూ, ప్రార్థించిననూ కనీసము నా ముందుకు వచ్చి నాతో మాట్లాడలేదు. నా పౌరుషాన్ని, నా పరాక్రమాన్ని నువ్వు గుర్తించలేదు. కాబట్టి ఇప్పుడు నీకు ఈ గతి పట్టింది.” అంటూ రాముడు బ్రహ్మాస్త్రమును సంధించాడు.

అప్పుడు భూమి ఆకాశము బద్దలు అయినట్టు శబ్దము వచ్చింది. పర్వతములు కంపించాయి. లోకమంతా చీకట్లు కమ్మాయి. సరస్సులు, నదులు గతులు తప్పాయి. చంద్రుడు సూర్యుడు తమ తమ గమనమును మార్చుకున్నాయి. ఆకాశం నుండి ఉల్కాపాతము మొదలయింది. మహావేగంతో విపరీతంగా గాలి వీచింది. వృక్షములు కూలిపోతున్నాయి. మేఘాలు చెదిరిపోతున్నాయి. ఆకాశంలో ఉరుములు మెరుపులు ఉధృతిగా ఉన్నాయి. పిడుగులు పడుతూ విద్యుత్ సంబంధమైన మంటలు మండు తున్నాయి. ఆ పిడుగుపాటుకు సమస్తజీవజాతులు అల్లల్లాడి పోతున్నాయి. సముద్రము అల్లకల్లోలము అయింది. ఆకాశం ఎత్తు అలలు తీరం మీద విరుచుకుపడుతున్నాయి. తీర ప్రాంతాలు మునిగిపోతున్నాయి. రాముడు, వానర సేన ఉన్న ప్రాంతము నుండి సముద్రము ఒక యోజనము వెనక్కు వెళ్లింది.

ఆ సమయంలో సముద్రగర్భము నుండి సముద్రుడు బయటకు వచ్చాడు. సముద్రుడు రత్నహారములు ధరించి ఉన్నాడు. సువర్ణ ఆభరణములు ధరించి ఉన్నాడు. సముద్రునిలో కలిసిన నదులన్నీ సముద్రుని వెనుక నిలబడి ఉన్నాయి. సముద్రుడు రాముని ముందు చేతులు జోడించి నిలబడ్డాడు. రామునితో ఇలా అన్నాడు. “ఓ రామా! ఈ సృష్టిలో పంచభూతములైన భూమి, వాయువు, ఆకాశము, జలము, అగ్ని ఇవి అన్నీ తమ తమ స్వభావమును బట్టి ప్రవర్తిస్తుంటాయి. నేను సముద్రుడను. లోతుగా ఉండటం, నీటితో నిండి ఉండటం నా స్వభావము. సముద్రము లోతుగా లేకపోతే అది నా స్వభావమునకే విరుద్ధము. సముద్రంలో జలచరములు, మొసళ్లు విరివిగా ఉంటాయి. వాటికి నేను భయపడి గానీ, నా స్వప్రయోజనమునకు కానీ, లోభము వలన కానీ, నా కోరికలు తీర్చుకోడానికి కానీ, ఆ జలచరములను నేను చంపను. అవి నాతోపాటే ఉంటుంటాయి.

నీవు నీ వానర సేన క్షేమముగా సముద్రమును దాటుటకు తగిన ఏర్పాట్లు నేను చేస్తాను. నాలో ఉన్న జలచరములు మీకు ఏ అపకారమూచెయ్యకుండా నేను చూస్తాను. దయచేసి బ్రహ్మాస్త్రమును ఉపసంహరించు.” అని వేడుకున్నాడు సముద్రుడు.

అప్పుడు రాముడు సముద్రునితో ఇలా అన్నాడు. “ఓ సముద్రమా! నీవు ఎంతకూ రాక పోతే నేను బ్రహ్మాస్త్రమును సంధించాను. దానిని నేను వెనుకకు మరల్చలేను. కాబట్టి ఈ బ్రహ్మాస్త్రమును ఎక్కడ ప్రయోగించాలో చెప్పు.” అని అడిగాడు రాముడు.

“ఓ రామా! ఇక్కడకు ఉత్తరముగా ద్రుమకుల్యము అనే

పవిత్రమైన స్థలము ఒకటి ఉంది. ఆ స్థలమును కొంత మంది దుర్మార్గులు ఆక్రమించుకొని అన్నిరకాల అక్రమాలు చేస్తున్నారు. వాళ్లు దస్యులు. వాళ్లు నా జలములో స్నానం చేస్తున్నారు. వాళ్ల పాపాలన్నీ నాకు అంటుకుంటున్నాయి. నేను ఆ పాపములను సహించలేక పోతున్నాను. కాబట్టి నీవు ఈ బ్రహ్మాస్త్రమును వారి మీద ప్రయోగించు." అని అన్నాడు.

సముద్రుని కోరిక ప్రకారము రాముడు తాను సంధించిన బ్రహ్మాస్త్రమును ద్రుమకుల్యములో ఉన్న దస్యులమీద విడిచిపెట్టాడు. రాముడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రము భూమిని చీల్చుకుంటూ పాతాళములోనికి ప్రవేశించింది. పాతాళ గంగ భూమిని చీల్చుకుంటూ ఆకాశంలోకి ఎగిసింది. బ్రహ్మాస్త్రము పడ్డచోట పెద్ద గొయ్యి ఏర్పడింది. దానికి వ్రణము అనే పేరు వచ్చింది. ఆ వ్రణము నుండి నిరంతరము స్వచ్ఛమైన జలము పైకి ఉబుకుతూ ఉంటుంది. ఆ ప్రదేశమునకు మరుకాంతారము అనే పేరు వచ్చింది. ఆ మరుకాంతారము పెద్ద పెద్ద పచ్చికబయళ్లతో, పశుసంపద, పాడి పంటలు వృద్ధిచెందుటకు అనువుగా ఉండింది. అక్కడ ఫలవృక్షములు, చల్లని నీడ నిచ్చే చెట్లు సమృద్ధిగా పెరిగాయి. అనేక రకములయిన ఓషధులు అక్కడ పెరుగుతున్నాయి. ఆ ప్రకారంగా మరుకాంతారము మంగళకరంగా శోభిల్లింది.

తరువాత సముద్రుడు రామునితో ఇలా అన్నాడు. "ఓ రామా! మీదగ్గర ఉన్న వానరులలో నీలుడు అనేవాడు ఉన్నాడు. అతడు విశ్వకర్మ కుమారుడు. తండ్రి వలన వరములను పొంది ఉన్నాడు. ఆ నీలుడు తన తండ్రి విశ్వకర్మతో సాటిగా నిర్మాణపనులు చేయగలడు. ఆ నీలుడు నా మీద సేతువును నిర్మిస్తాడు. ఆ సేతువును నేను భరిస్తాను."అని పలికి సముద్రుడు వెళ్లిపోయాడు.

అప్పుడు నీలుడు రాముని చూచి ఇలా అన్నాడు. " ఓ రామా! సముద్రుడు చెప్పిన మాట నిజమే. నేను విశ్వకర్మకుమారుడను. నేను ఈ సముద్రము మీద సేతువును నిర్మించెదను. సముద్రుడు తనలో లోతు లేని ప్రాంతమును మనకు చూపించాడు. అక్కడ నుండి సేతువును నిర్మిస్తాను. ఇంక నా గురించి చెబుతాను. నేను విశ్వకర్మకు ఔరస పుత్రుడను. నా తండ్రితో సమానంగా నిర్మాణ కౌశలము కలవాడిని. మీరు అడగకుండా నా గుణగణముల గురించి నాకుగా నేను చెబితే బాగా ఉండదని నా సంగతి మీకు చెప్పలేదు. ఇప్పుడు సముద్రుడు చెప్పాడు కాబట్టి నా గురించి నేను చెప్పుకున్నాను.ఈ సముద్రము మీద నూరు యోజనముల దూరము సేతువు కట్టే సామర్థ్యము నాకు ఉంది. కాబట్టి వానర వీరులందరూ సేతువును కట్టుటకు తగిన ప్రయత్నములను చేయండి." అని పలికాడు.

రాముడు సేతువు నిర్మాణానికి అనుమతి ఇచ్చాడు. వెంటనే కోట్లకొద్ది వానరులు అరణ్యములలోకి పరుగులు తీసారు. వారంతా ఆ అరణ్యములో ఉన్న మహా వృక్షములను, బండరాళ్లను, పర్వతశిఖరములను మోసుకొచ్చి సముద్రంలో పడవేసారు. నీలుడు వాటిని ఒక క్రమపద్ధతిలో అమరుస్తున్నాడు. వానరులు సాలవృక్షములు, అశ్వకర్ణ, ధన, వెదురు, కుటజ, అర్జున, తాళ, తిలక, తినిశ, మారేడు, కర్ణికార, చూత, అశోక వృక్షములను మోసుకొని వచ్చి సముద్రం ఒడ్డున పడవేసారు. (పైనచెప్పిన చెట్లలో చాలా వరకు నేడు కూడా భవన నిర్మాణపనులలో వాడుతున్నారు కదా!టేకు అనే పదము అప్పుడు వేరే పేరుతో ఉండేదేమో!)

వానరులు ఎక్కువగా తాటి చెట్లను, మామిడి చెట్లను, దానిమ్మ చెట్లను, కొబ్బరి చెట్లను, విభీతక వృక్షములను, వేప చెట్లను పెకలించి

తీసుకొని వచ్చి సముద్రము ఒడ్డున పడవేసారు. చెట్లు తెచ్చే వాళ్లు చెట్లను తెస్తుంటే, మరి కొందరు వానరులు పెద్దపెద్ద బండరాళ్లను మోసుకొని వచ్చి సముద్రము ఒడ్డున పడవేస్తున్నారు.

ఇక్కడ వాల్మీకి ఒక శ్లోకంలో యంత్రములు వాడారు అని రాసారు.
హస్తిమాత్రాన్ మహాకాయా: పాషాణాంశ్చ మహాబలా:
పర్వతాంశ్చ సముత్పాట్య యన్త్రై: పరివహన్తి చ.

పెద్ద పెద్ద శరీరము కల వానరులు, మహాబలవంతులు అయిన వానరులు, ఏనుగుప్రమాణములో ఉన్న బండ రాళ్లను పర్వత ప్రాంతముల నుండి పెకలించి, యంత్రముల ద్వారా మోసుకుంటూ సముద్రతీరమునకు తీసుకువచ్చారు. అంటే ఈ నాటి క్రేన్ల మాదిరి యంత్రములు, ఈ నాటి క్రేన్ల రూపంలో కాకపోయినా మరోరూపంలో ఉండి ఉండవచ్చు. ఈ యంత్రములు అనే మాట లంకా నగర వర్ణనలోకూడా వాడారు. పెద్ద పెద్ద బండరాళ్లను కోట బురుజుల మీద నుండి బయట ముట్టడించి ఉన్న శత్రువుల మీదికి విసరడానికి యంత్రములు అమర్చబడి ఉన్నాయి అని రాసారు కదా!)

వానరములు తెచ్చిన పెద్ద పెద్ద బండ రాళ్లను సముద్రంలో పడవేస్తుంటే, సముద్రము నీరు ఆకాశం అంత ఎత్తుకు ఎగిరిపడుతున్నాయి. ఆ ప్రకారంగా నీలుడు వానరులు తెచ్చిన రాళ్లను చెట్లను పెద్ద పెద్ద వృక్షములను నీటిలో పడవేస్తుంటే కొంత మంది వానరులు దారములు పట్టుకుంటూ ఆ రాళ్లను, వృక్షములను క్రమ పద్ధతిలో పేరుస్తున్నారు. ఆ ప్రకారంగా నూరు యోజనముల దూరం వరకూ కొలతదారములను

పట్టుకొని రాళ్లతోనూ వృక్షములతోనూ సేతువును నిర్మిస్తున్నారు. కొందరు వానరులు రాళ్లను తీసుకొని వస్తున్నారు. మరి కొందరు గడ్డి, కర్రలతో సేతువులోని కొన్ని భాగములను నిర్మిస్తున్నారు. మరి కొందరు వానరులు పెద్ద పెద్ద బండరాళ్లను పట్టుకొని అటు ఇటు పరుగెడుతున్నారు. కొంత మంది వాళ్లు తెచ్చిన బండ రాళ్లను ఒక క్రమంలో అమరుస్తున్నారు.

కోట్ల కొద్దీ వానరుల సాయంతో నీలుడు మొదటి రోజున పదునాలుగు యోజనముల దూరము గల సేతువును నిర్మించాడు. రెండవ రోజున ఇరువది యోజనముల దూరము గల సేతువును నిర్మించాడు. మూడవ రోజున ఇరువది యోజనముల దూరము గల సేతువును నిర్మించాడు. నాలుగవ రోజున ఇంకొక ఇరువది యోజనముల దూరము గల సేతువును నిర్మించాడు. ఐదవ రోజున మరొక ఇరువది మూడు యోజనముల సేతువును నిర్మించి సముద్రము ఆవల ఒడ్డుకు చేరుకున్నారు..విశ్వకర్మ కుమారుడైన నీలుడు వానరుల సాయంతో అత్యంతం నైపుణ్యంతోసముద్రమునకు అడ్డంగా నూరుయోజనముల దూరం గల సేతువును నిర్మించాడు. వానరులు సౌకర్యంగా నడవడానికి ఆ సేతువు మీద చక్కని నున్నటి దారిని ఏర్పరిచారు. ఆ సేతువు ఆకాశంలో కనపడే నక్షత్ర మార్గంలాగా ప్రకాశిస్తూ ఉంది. సముద్రానికి తీసిన పాపిడి లాగా ఉంది. దేవతలు, దానవులు, గంధర్వులు ఆకాశంలో నిలబడి ఈ వింతను తిలకిస్తున్నారు. ఆ సేతువు పది యోజనముల వెడల్పు నూరుయోజనముల పొడవుతో ఉంది.

ఆ సేతువును చూచిన వానరముల సంతోషానికి అంతు లేదు. కొంత మంది వానరులు ఆ సేతువు మీద ఎక్కి దుముకుతున్నారు. ఆడుతున్నారు గెంతుతున్నారు. కొంతమంది వానరులు అప్పుడే ఆవల ఒడ్డుకు

చేరుకున్నారు. సుగ్రీవుడు రాముని హనుమంతుని బుజం మీద, లక్ష్మణుని అంగదుని బుజం మీద ఎక్కమన్నాడు. వారు రామలక్ష్మణులను ఆకాశమార్గంలో ఆవల ఒడ్డుకు తీసుకొని వెళ్లారు. వానరులు కొంత మంది సేతువు మధ్యలో నడిచివెళుతున్నారు. మరి కొంత మంది సేతువు పక్కలనుండి వెళుతున్నారు. కొందరు కాసేపు నీటిలో ఈదుతూ మరికొంతసేపు సేతువు మీద నడుస్తున్నారు. మరి కొందరు ఆకాశంలో ఎగురుతూ వస్తున్నారు. సేతువు మీద నడుస్తున్నప్పుడు వానరులు చేసే ధ్వనులు సముద్రఘోషను మించిపోయాయి.

వానర రాజు సుగ్రీవుడు వానర సేనలను సముద్రము ఆవలకు దాటించి అక్కడ ఫలములు, పుష్పములు, తేనె, స్వచ్ఛమైన జలము దొరికే చోటునందు విడిదిచేయించాడు. రాముడు సముద్రమును దాటగానే ఆకాశము నుండి మహర్షులు వారి మీద మంత్రజలమును చల్లి ఆశీర్వదించారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఇరువది రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఇరువది మూడవ సర్గ.

లంకా ద్వీపములో అడుగు పెట్టగానే రాముడు లక్ష్మణునితో ఇలా అన్నాడు. "లక్ష్మణా! మన వానర సేనలను వివిధ భాగములుగా, వ్యూహములుగా విభజించి వారిని సమృద్ధిగా ఫలములు, తేనె, జలము దొరుకు స్థలములలో నిలుపు. లక్ష్మణా! మనకు కనపడు శకునములను చూస్తుంటే ఇటు వానరులకు అటు రాక్షసులకు మహాభయంకరమైన ఆపద రాబోతుతున్నదని అనిపిస్తూ ఉంది. భూమి కంపిస్తూ ఉంది. ధూళితో కూడిన గాలి చెలరేగుతూ ఉంది. ఆ గాలి దెబ్బకు పర్వత శిఖరములు కంపిస్తున్నాయి. చెట్లు కూలిపోతున్నాయి. ఆకాశము నుండి ఉల్కాపాతము జరుగుతూ ఉంది. అడవి మృగములు తూర్పుదిక్కుగా చూచి వికృతంగా అరుస్తున్నాయి. చంద్రుడు కాంతి విహీనంగా కనపడుతున్నాడు. సూర్యమండలము చుట్టు ఎర్రని వలయము కనపడుతూ ఉంది, మధ్యలో నల్లని మచ్చ కనపడుతున్నాయి. ఇవన్నీ రాబోవు ప్రళయాన్ని సూచిస్తున్నాయి. ఈ యుద్ధభూమి వానరులు, రాక్షసుల రక్తంతో తడిసిపోయే కాలం సమీపిస్తూ ఉంది. యుద్ధము తప్పదు. లంకను ముట్టడించమని వానర సేనలకు ఆదేశాలు ఇవ్వండి." అని పలికాడు రాముడు. తన ధనుస్సు తీసుకొని లంకా నగరం దిశగా వెళ్లాడు రాముడు. విభీషణుడు, సుగ్రీవుడు వానర సేనలతో రాముని అనుసరించారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఇరువది మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఇరువది నాలుగవ సర్గ.

రాముని వెంట వెడుతున్న వానర సేన పాదఘట్టనలకు భూమి అదురుతూ ఉంది. లంక బయట ఇలా ఉంటే, లంకా నగరంలో కూడా రాక్షస సేనలు యుద్ధానికి సన్నద్ధమవుతున్నాయి. రాక్షస సేనలు చేసే సింహనాదాలు, భేరీమృదంగ ధ్వనులు లంక బయట ఉన్న వానర సేనలకు వినబడుతున్నాయి. వానర సేనలు కూడా వాటికి మించిన ధ్వనులు చేస్తున్నారు. దూరం నుండి లంకా పట్టణమును చూచిన రామునికి సీత గుర్తుకు వచ్చింది.

"ఆహా!నా సీత ఈ లంకా నగరంలోనే కదా బంధింపబడి ఉంది!" అని మనసులో అనుకున్నాడు. పక్కనే ఉన్న లక్ష్మణుని చూచి రాముడు ఇలా అన్నాడు. "లక్ష్మణా! ఆ పర్వతశిఖరము మీద విశ్వకర్మచేత నిర్మింపబడిన ఆ కాంచన లంకను చూచావా! ఆ లంకా నగరము ఆకాశాన్ని తాకుతూ ఉన్నదా అన్నట్టు లేదూ! ఎంతో కాలము కిందట నిర్మింపబడిన ఈ లంకా నగరము ఎత్తైన భవనములతో అత్యంత శోభాయమానముగా ఉంది." అని అన్నాడు.

తరువాత రాముడు వానర సేనలను వ్యూహములుగా విభజించాడు. గరుడ వ్యూహాకారంరలో సేనలను నిలబెట్టాడు. సేనలకు ఈ విధంగా ఆదేశాలు ఇచ్చాడు. "అంగదుడు తన సేనలతో, ఈ గరుడవ్యూహమునకు వక్షస్థల భాగమున నిలువ వలెను. ఋషభుడు తన సేనలతో ఈ గరుడ వ్యూహమునకు కుడి వైపున ఉన్న రెక్క భాగములో నిలువ వలెను. గంధమాధనుడు తనసైన్యములతో గరుడవ్యూహమునకు

ఎడమ వైపున ఉన్న రెక్క భాగములో నిలువవలెను. నేను లక్ష్మణుడు గరుడవ్యూహమునకు శిరస్సుస్థానములో నిలుస్తాము. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి ఈ ముగ్గురూ గరుడవ్యూహమునకు పొట్ట భాగములో నిలుస్తారు. సుగ్రీవుడు తన సేనలతో గరుడ వ్యూహమునకు తోక భాగమును రక్షిస్తూ ఉంటాడు." అని సమస్త వానర సేనను గరుడవ్యూహంగా రచన చేసాడు రాముడు. వానరు లందరూ ఆ గరుడా కారంలో పెద్ద పెద్ద బండరాళ్లు, వృక్షములు ఆయుధములు ధరించి లంక వైపుకు కదిలారు.

అప్పుడు రాముడు సుగ్రీవుని చూచి ఇలా అన్నాడు. "సుగ్రీవా! మనము లంకకు చేరుకున్నాము. గరుడవ్యూహరచన పూర్తి అయింది. ఇంక నీ అధీనములలో ఉన్న శుకుడు అనే రాక్షస దూతను విడిపించు." అని అన్నాడు. రాముని ఆదేశానుసారము సుగ్రీవుడు శుకుడిని విడిపించమని వానరులకు చెప్పాడు. బతుకుజీవుడా అనుకుంటూ శుకుడు రావణుని వద్దకు వెళ్లాడు.

దీనంగా ఉన్న శుకుని చూచి రావణుడు నవ్వుతూ ఇలా అన్నాడు. "ఏంటీ! అలా ఉన్నావు. నీ రెక్కలు విరిగిపోయినట్టున్నాయి. నీవు శత్రువుల చేతికి చిక్కావా!" అని అడిగాడు. అప్పుడు శుకుడు రావణునితో ఇలా అన్నాడు. "రాక్షసేంద్రా! నీకు జయమగుగాక! నేను తమరి ఆజ్ఞానుసారము సుగ్రీవుని వద్దకు పోయి తమరు చెప్పమన్న మాటలు యధాతథంగా సౌమ్యంగా చెప్పాను. నన్ను చూడగానే ఆ వానరులు పైకి ఎగిరి నన్ను పట్టుకున్నారు. నన్ను కొడుతూ, గుద్దుతూ కిందికి తీసుకు పోయారు. నారెక్కలు పీకారు. అమ్మో ఆ వానరులు చాలా కోపం కలవారు. వారితో మాట్లాడటం మనకు శక్యంకాదు. కోపం వస్తే వారు ఏమైనా చేస్తారు.

ప్రస్తుతము రాముడు, సుగ్రీవుడు వానరసేనలతో కలిసి, సముద్రము మీద సేతువును నిర్మించి, సముద్రమును దాటి లంకను చేరుకున్నారు. లంకను ముట్టడించారు. భయంకరమైన వానర సేనలు భూమి కనపడకుండా నిలిచి ఉన్నాయి. రాక్షసులకు, వానరులకు దేవ దానవుల మాదిరి యుద్ధము తప్పేట్టు లేదు. వానరులు లంకా నగర ప్రాకారము దగ్గరకు చేరుకుంటున్నారు.

ఓ రాక్షసేంద్రా! ప్రస్తుతము నీకు మిగిలి ఉన్నవి రెండే మార్గములు. ఒకటి సీతను రామునికి ఇచ్చి సంధిచేసుకోవడము. లేకపోతే రామునితో వానర సేనలతో యుద్ధము చేయడం. మొదటిది లంకను రక్షిస్తుంది. రెండవది, లంకను నాశనం చేస్తుంది. నీకు తోచినది చెయ్యి." అని చెప్పి ఊరుకున్నాడు శుకుడు.

శుకుని మాటలు విన్న రావణుడు కోపంతో మండిపడ్డాడు. శుకునితో ఇలా అన్నాడు. "దేవతలు, దానవులు, గంధర్వులు వచ్చి వేడినను నేను సీతను ఇవ్వను. రామునితో యుద్ధము చేస్తాను. నా శరపరంపరతో రాముని గెలుస్తాను. నా విల్లు నుండి వెలువడ్డ బాణములతో రాముని శరీరం ఎప్పుడు రక్తసిక్తము అవుతుందో కదా! నేను అజేయుడను. వానర సైన్యమును క్షణంలో నిర్మూలిస్తాను. నాకు వాయువు అంత బలము, సముద్రము అంత వేగము ఉన్నాయి. పాపం రాముడు నా గురించి పూర్తిగా తెలియక నాతో యుద్ధానికి వస్తున్నాడు. శలభంలా నా కోపాగ్నికి మాడి పోతాడు. రాముడికి నా వద్ద ఉన్న అస్త్రముల గురించి శస్త్రముల గురించి తెలియదు. అందుకే నాతో యుద్ధానికి వస్తున్నాడు. ఇంతకు ముందు రాముడు ఏ యుద్ధములో పాల్గొనలేదు. నేను ఎన్నోయుద్ధములు చేసి రాటు తేలి ఉన్నాను. రాముడు ఎన్నడూ నాతో యుద్ధము చేయలేదు.

అందుకే నా బాణముల రుచి రామునికి తెలియదు. దేవేంద్రుడు, వరుణుడు, యముడు, కుబేరుడు యుద్ధములో నా ముందు నిలువలేరు. ఇంక ఈ రాముడు ఎంత?" అని గర్వంగా పలికాడు రావణుడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఇరువది నాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ఇరువది ఐదవ సర్గ.

తరువాత రావణుడు ఇద్దరు గూఢచారులను పిలిపించాడు. అందులో ఒకడి పేరు శుకుడు. (కొంత మంది పెద్దల వ్యాఖ్యల ప్రకారము పైన చెప్పబడిన శుకుని వృత్తాంతము ప్రక్షిప్తము అని అభిప్రాయము. కాని పైన చెప్పబడిన శుకుని వృత్తాంతము కధాగమనానికి ఎలాంటి భంగం కలిగించలేదు కాబట్టి దానిని అలాగే ఉంచినా తప్పులేదు.కాకపోతే ఇప్పుడు పంపుతున్న గూఢచారి పేరుకూడా శుకుడు అని ఉండడం గమనార్హం. మీరు రామాయణంలో వచ్చిన పేర్లను గమనించి ఉంటారు. అన్నీ పేర్లు వారి వారి గుణగణాలను ఆకారాలను, తెలిపేవి. ఇక్కడ కూడా శుకుడు లాంటి పేరుగల గూఢచారులు ఇద్దరు ముగ్గురు ఉండి ఉండవచ్చు.)

రావణుడు పిలిపించిన గూఢచారుల పేర్లు శుకుడు, సారణుడు. రావణుడు వారితో ఇలాఅన్నాడు. "రాముడు వానర సైన్యముతో సముద్రము దాటినాడు అని వార్త వచ్చింది. ఇదివరలో ఎవరూ చేయజాలని సేతువును రాముడు నిర్మింపజేసాడు.

రాముడు వానరులతో నూరుయోజనముల దూరము సేతువును నిర్మించాడు అంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. ఇంతకూ వానరుల బలము ఎంత అని మనం ముందు తెలుసుకోవాలి. వారి యుద్ధ వ్యూహములను తెలుసుకోవాలి. కాబట్టి మీరు ఇద్దరూ కోటదాటి వెళ్లండి. వానర రూపములతో వానరసేనలలో కలిసిపోండి. వానర సేన ఎంత ఉంది. వారి నాయకులు ఎవరు. ఎవరి దగ్గర ఎంతెంతమంది వానర సేన ఉంది. సముద్రము మీద సేతువును నిర్మించిన వారు ఎవరు. ఎవరి సాయంతో నిర్మించారు. సుగ్రీవునితో ఉన్న మంత్రులు ఎవరు. ఎంత మంది. వానర సేనలకు ముఖ్య సేనాని ఎవరు? వానర సేనలో ముందు నిలిచి యుద్ధం చేసే వారు ఎవరు. వానర సేన ఉపయోగించే ప్రధాన ఆయుధములు ఏవి? నాకు ఈ సమాచారమును వెంటనే సేకరించి తెలియపరచండి." అని ఆదేశించాడు.

రావణుని ఆదేశము ప్రకారము శుకుడు, సారణుడు వానర రూపములను ధరించి వానర సేనలతో ప్రవేశించారు. వారు వానర సేనలను లెక్కబెట్టడానికి ప్రయత్నం చేసారు కానీ వారి వల్ల కాలేదు. వారు ఎక్కడకు పోయినా వానర సైన్యము కనపడుతున్నారు. కొండలు గుట్టలు,పర్వతములు, అడవులు, చెట్లు ఒకటేమిటి నేల ఈనినట్టు ఎక్కడ చూచినా వానర సైన్యము కనపడుతున్నారు. సముద్రము మాదిరి కనపడుతున్న వానర సేనను చూచి శుకసారణులు ఆశ్చర్యపోయారు. వానరులు వీరిని కనిపెట్టలేకపోయారు.

కానీ రాక్షస మాయలు తెలిసిన విభీషణుడు వానర వేషములలో ఉన్న శుకసారణులను సులభంగా కనిపెట్టాడు, వారిని పట్టుకొని రాముని వద్దకు తీసుకొని వచ్చాడు. "రామా! వీరు ఇద్దరూ

రావణుని గూఢచారులు. రావణుడు పంపగా వచ్చారు. వీరి పేరు శుకుడు, సారణుడు. వీరిని వెంటనే చంపమని ఆజ్ఞాపించు." అని అన్నాడు. అప్పటికే శుకుడు సారణుడు ప్రాణాల మీద ఆశ వదులుకున్నారు. చేతులు జోడించి రామునితో ఇలా అన్నారు. " మేము రావణుని గూఢచారులము. వానర సైన్య రహస్యములను తెలుసుకోడానికి మేము రావణుడు పంపగా ఇక్కడకు వచ్చాము." అని వారి తప్పు ఒప్పుకున్నారు.

వారిని చూచి రాముడు నవ్వాడు. "మీరు వచ్చిన పని పూర్తి అయిందా. వానర సేనలను అంతా చూచారా. నన్ను కూడా చూచారా. ఇంక వెళ్లండి. మీ రాజుకు మా గురించి మా సేన గురించి చెప్పండి. మీరు ఇంకా చూడవలసినది ఏమన్నా ఉంటే చూడండి. మీకు తెలియక పోతే మీ రాజు విభీషణుడు మీకు అన్నీ చూపిస్తాడు. హాయిగా చూడండి. మీ ప్రాణములకు వచ్చిన భయం ఏమీ లేదు. మీరు మాకు దూతలుగా వచ్చారు. దూతలను మేము ఎప్పుడూ చంపము. విభీషణా! మనము మన శత్రువులను చంపాలి కానీ మారువేషములలో వచ్చిన గూఢచారులను చంపకూడదు. వీరు వారి రాజు ఆజ్ఞపాలించారు. ఇందులో వీరితప్పు ఏమీ లేదు కదా! కాబట్టి వీరిద్దరినీ విడిచిపెట్టండి.

ఓ శుకసారణులారా! మీరు ఇద్దరూ లంకకు పోయి మీ రాజు రావణునితో నా మాటలుగా ఇలా చెప్పండి. "ఓ రావణా! మేము నీ మీదికి యుద్ధానికి వచ్చాము. నువ్వు ఏ బలం చూచుకొని నా భార్య సీతను అపహరించావో, ఆ బలాన్ని ఇప్పుడు నా ముందు చూపించు. యుద్ధమునకు రేపు ఉదయము ముహూర్తము నిశ్చయించాము. రేపు ఉదయమునకే మేము నీ లంకా నగరమును ముట్టడించి, నువ్వు చూస్తూ ఉండగానే, నీ సైన్యములను నా బాణములతో చించి చెండాడతాను."

ఇవి నా మాటలుగా రావణునితో చెప్పండి. ఇంక వెళ్లండి.” అన్నాడు రాముడు.

శుక సారణులు విడిచిపెట్టిందే చాలని లంకకు పారిపోయారు. రావణుని ముందు నిలిచి “ఓ రాక్షసేంద్రా! మీరు ఆదేశించినట్టు మేము మారువేషములలో వానరసైన్యములో చేరాము. కాని విభీషణుడు మా మారువేషములను కనిపెట్టి, మమ్ములను చంపబోగా, రాముడు మాకు ప్రాణభిక్ష పెట్టాడు. రాక్షస రాజా! వానర సేన సముద్రము అంత ఉంది. అది అటుండనిమ్ము. రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, విభీషణుడు, ఈ నలుగురూ చాలు మన లంకానగరమును నాశనం చెయ్యడానికి. ఇంక వానర వీరులు కూడా విజృంభిస్తే లంక వల్లకాడు అవుతుంది. రాముడు ఒక్కడే చాలు నిన్ను నీ లంకను మట్టుపెట్టడానికి. సుగ్రీవుని ఆధ్వర్యములో ఉన్న వానర సేనను జయించడం ఎవరి వల్లా కాదు. కాబట్టి మా విన్నపము ఏమిటంటే తమరు వెంటనే సీతను రామునికి ఇచ్చి వేసి, రామునితో సంధి చేసుకోవలెను. లంకను రక్షించవలెను.” అని పలికి ఊరుకున్నారు.

. శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఇరువది ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఇరువది ఆరవ సర్గ.

ఇంత మంది ఇన్ని సార్లు ఇన్ని మాటలు చెప్పినా రావణుడు తన మూర్ఖపు పట్టుదల విడువ లేదు.

"ఎవరు ఎన్ని చెప్పినా నేను వినను. దేవ, దానవ, గంధర్వ,యక్షులు ఒక్కుమ్మడిగా నా మీదికి వచ్చినా, నేను సీతను విడువను. మీరు ఇద్దరూ వానరుల చేతిలో దెబ్బలు తిని బాగా భయపడినట్టున్నారు. అందుకే భయంతో ఇలా మాట్లాడుతున్నారు. నాకు ఎవరిని చూచినా భయం లేదు. నన్ను ఎవరూ ఓడించలేరు. ఇంతకూ రాముని సైన్యము పరిమాణము ఎంత? వారు ఎక్కడ ఉన్నారు. నాకు చూపించండి." అని అన్నాడు రావణుడు.

శుకుడు, సారణుడు రావణుని ఒక ఎత్తైన ప్రాసాదము మీదికి తీసుకొని వెళ్లారు. అక్కడ ముగ్గురు నిలబడ్డారు. అక్కడి నుండి వానర సైన్యము సుస్పష్టంగా కనపడుతూ ఉంది. వానర సేన భూమి అంతా కప్పినట్టు ఉంది. అసలు భూమి కనిపించడం లేదు. పూర్తిగా వానరులతో నిండిపోయినట్టు ఉంది. రావణునికి వానర సేన మరొక సముద్రం లాగా కనిపిస్తూ ఉంది.

రావణుడు సారణుని చూచి ఇలా అన్నాడు. " ఆ కనిపిస్తున్న వానర సేనలో ముఖ్యమైన వారు ఎవరు? బలవంతులు, శూరులు, పరాక్రమ వంతులు ఎవరు? ముందు నిలిచి యుద్ధము చేసే వాళ్లు ఎవరు? సుగ్రీవుడు ఎవరి మాట వింటాడు? సేనానాయకులుఎవరు? వీళ్లు సాధారణ వానరులా! వీరి ప్రభావము ఎంత? ఈ విషయాలన్నీ నాకు వివరంగా చెప్పు." అని అడిగాడు రావణుడు.

సారణుడు ఇలా చెప్పసాగాడు. "రాక్షస రాజా! అటు చూడండి. లక్ష మంది వానర నాయకులు చుట్టు ఉండగా లంక వంక చూస్తూ పెద్ద పెద్దగా అరుస్తున్నాడో, వాడి పేరునీలుడు. వానర సేనానాయకుడు.

అతడే సుగ్రీవుని ముందు నిలబడి మాట్లాడుతున్నాడు. అదుగో అక్కడ ఒక వానరుడు చేతులు పైకెత్తి లంక వంక చూస్తూ మాటి మాటి కీ తోకను విదిలిస్తూ కోపంతో మాట్లాడుతున్నాడో వాడి పేరు అంగదుడు. వాలి కుమారుడు. కిష్కింధకు యువరాజు. రాముడి కోసరం ఏమి చెయ్యడానికైనా సిద్ధంగా ఉన్నాడు. సీతాన్వేషణ కొరకు దక్షిణదిక్కుగా పంపబడిన వానరసమూహమునకు నాయకుడు ఈ అంగదుడు. అంగదునివెనక నిలబడి ఉన్న వాడు నలుడు. అతని ఆధ్వర్యములో అపారమైన సైన్యమునిలిచి ఉంది. నూరుయోజనముల దూరము గల సముద్రమునకు సేతువు ఇతని ఆధ్వర్యములోనే నిర్మింపబడింది. ఈ నలుడు చందన వనములో ఉంటాడు. ఇతని కింద వెయ్యికోట్ల ఎనిమిది లక్షల వానములు ఉన్నాయి. వారంతా భయంకరమైన వానరములు. ఈ సేనలతో లంకను నాశనం చెయ్యడానికి నలుడు అభిలషిస్తున్నాడు.

వెండి మాదిరి తెల్లని శరీరంతో మెరిసిపోతున్నవాడు, మహాపరాక్రమ వంతుడు శ్వేతుడు అనే వానరుడు సుగ్రీవునితో మాట్లాడి మరలా వెళుతున్నాడు. గోమతీ నదీ ప్రాంతంలో రమ్య అనే పర్వతము ఉంది. ఆ ప్రాంతములో ఉండే వానరములకు అధిపతి కుముదుడు. అతడు లక్షలకొలదీ వానరములకు నాయకుడు. తానొక్కడే తన సేనలతో లంకను ముట్టడిద్దామని ఉత్సాహపడుతున్నాడు. ఓ రాక్షస రాజా! ఎరుపు తెలుపు కల శరీర ఛాయతో, ముఖమంతా జూలుతో, సింహము వలె కనపడుతున్న వాడు రంభుడు. అతడు లక్ష వానరములతో వింధ్యపర్వతము, కృష్ణగిరి, సహ్యాద్రి, సుదర్శనము మొదలగు పర్వతముల మీద నివసిస్తూ ఉంటాడు. వీరు భయంకరమైన వానరులు.

ఆ పక్కన ఉన్న వాడు శరభుడు. వీడికి ఎవరన్నా లెక్కలేదు. చివరకు మృత్యువుకుకూడా భయపడడు. ఇతడు సాల్వేయ పర్వతము మీద నివసిస్తూ ఉంటాడు. ఇతని కింద విహారులు అనే పేరు గల లక్ష వానరములు ఉన్నాయి. వీరు చాలా బలవంతులు. పారి యాత్ర అనే పర్వతము మీద నివసించే వానరుడు పనసుడు యాభైలక్షల మంది వానరములకు ఇతడు నాయకుడు. ఆ యాభైలక్షల మందిని ఇతడు వివిధ యూధములుగా విభజించి వాటికి ప్రత్యేకంగా సేనానాయకులను నియమించాడు. వారందరూ ఈ పనసుని ఆజ్ఞలను జవదాటరు.

ఆ సముద్రము పక్కన రెండవ సముద్రము మాదిరి కదులుతున్న సేనలకు నాయకుడు వినతుడు. ఇతడు వేణీ నదీ తీరంనుండి వచ్చాడు.(వేణీ అంటే క్రిష్ణవేణి అనగా క్రిష్ణానది అని పండితుల అభిప్రాయము) ఇతడు అరువది లక్షల మంది వానరులకు నాయకుడు. తరువాత క్రధనుడు అనే వానర నాయకుడు తన సైన్యమును వివిధ వ్యూహములుగా విభజించాడు. వారందరూ యుద్ధోన్మాదంతో ఊగి పోతున్నారు. గవయుడు అనే వానరుడు బలగర్వితుడు. ఇతని కింద డెబ్బది లక్షల వానరములు ఉన్నాయి. వీరంతా తమ తమ సైనిక సమూహములతో నీ మీద యుద్ధానికి ఉవ్విళ్లూరుతున్నారు." అని పలికాడు సారణుడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఇరువది ఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ఇరువది ఏడవ సర్గ.

సారణుడు వానర యూథముల గురించి ఇంకా చెప్పసాగాడు. "ఓ రాక్షస రాజా! రాముని కొరకు తమ ప్రాణములను కూడా లెక్కచేయకుండా యుద్ధము చేయడం కోసం ఉరకలు వేస్తున్న వానర నాయకుల గురించి ఇంకా చెబుతాను విను. నున్నటి తోకతో, ఒళ్లంతా ఎర్రటి,పచ్చటి,తెల్లటి రోమములు విస్తారముగా కలిగిన ఆ వానర నాయకుని పేరు హరి. అతని వెంట వందల కోట్ల వానరులు ఉన్నారు. వారందరూ సుగ్రీవుని నాయకత్వంలో రాక్షసులతో యుద్ధానికి కాలుదువ్వుతున్నారు.

అదుగో అటు చూడు. నల్లని మేఘముల వలె కనపడుచున్నది భల్లూకసేన. సముద్రము నల్లగా ఉంటే ఈ భల్లూక సేనకూడా నల్లగా మరొక సముద్రంలా ఉంది. వీరందరూ పర్వత ప్రాంతముల నుండీ, సమతల భూముల నుండి, మరి కొందరు నదీతీరముల నుండీన వచ్చారు. వీరంతా చాలా భయంకరంగా యుద్ధం చేయడంలో నిపుణులు. ఈ భల్లూకములకు నాయకుడు ధూమ్రుడు. ఈతడు నర్మదా నదీ తీరంలో ఉన్న ఋక్షవంతము అనే పర్వతము మీద ఉంటాడు. ఆ పక్కనే ఉన్న వాడు ధూమ్రుని తమ్ముడు. ఇద్దరూ ఒకే రూపంలో ఉన్నారు కదూ. ఇతడు అన్నకంటే పరాక్రమ వంతుడు. ఇతని వెంట కూడా ఎన్నో భల్లూక సేనలు ఉన్నాయి. భల్లూకములలోకి అంతటికీ వృద్ధుడు జాంబవంతుడు. ఇతని వెంట అపారమైన భల్లూకసేన ఉంది. జాంబవంతునికి పరాక్రమము దానికి తగ్గ వినయము రెండూ ఉన్నాయి. ఈ జాంబవంతుడే దేవాసుర యుద్ధములో దేవేంద్రుని పక్షమున అసురులతో పోరాడి, దేవేంద్రుని వలన వరములను పొందాడు. జాంబవంతుని సేనలో ఉన్న భల్లూకములు పెద్ద

పెద్ద పర్వతముల మీద ఉండి, బండరాళ్లను కింద ఉన్న శత్రువుల మీదికి విసిరి చంపడంలో ఆరితేరినవారు. వీరికి చావంటే భయం లేదు.

వానర సేనలో మరొక ముఖ్యుడు దంభుడు అనే వానరసేనా నాయకుడు. దేవేంద్రుడు కూడా అప్పుడప్పుడు ఇతని సాయం తీసుకుంటూ ఉంటాడు. ఇతడు వానరులకు సర్వసేనాని. అందరి కన్నా ఎత్తుగా ఉన్న ఆ వానరనాయకుని చూడండి. అతని పేరు. సంనాదుడు. అతడు వానరుల కందరికీ పితామహుడి లాంటి వాడు. అతడు ఒక గంధర్వ కన్యకు అగ్నిదేవుని వలన పుట్టినవాడు. అగ్నివలె తేజోవంతుడు. ఇతడు యుద్ధములో దేవేంద్రునితో కూడా యుద్ధం చేసాడు.

మరొక వాన సేనాని పేరు క్రథనుడు. ఇతడు కైలాస పర్వతము మీది నుండి వచ్చాడు. కైలాస పర్వతము అతని స్థావరము. ఇతనికి వెయ్యికోట్ల వానరసైన్యము ఉంది. అతడు ఒక్కడు చాలు లంకా నగరమును నాశనం చెయ్యడానికి. పూర్వము వానరములకు ఏనుగులకు వైరం ఉండేదట. ఈ వానర నాయకుడు గంగా నదీ ప్రాంతములోఉన్న ఉశీరబీజ పర్వతము, మంధర పర్వతము యొక్క గుహలలో నివసిస్తూ ఏనుగులను భయపెట్టేవాడట. దొరికిన ఏనుగును దొరికినట్టు చంపే వాడట. వాడు కూడా తన వేయి లక్షల వానరములతో ఈ యుద్ధములో పాల్గొనడానికి వచ్చాడు. ఏనుగులను చంపేవాడికి మన రాక్షసులు ఒక లెక్కా! ఇంతకూ ఇతని పేరు చెప్పలేదు కదూ! ఇతని పేరు ప్రమాథి. అదుగో అక్కడ మేఘము మాదిరి ఎగురుతున్నాడు. జాగ్రత్తగా చూడండి. అతని చుట్టు ఉన్నదే అతని సైన్యము.

రాక్షసరాజా! మరొక జాతి వానరములు కనపడుతున్నాయి

చూడండి. నల్లని ముఖములతో భయంకరంగా ఉన్నాయి. వాటి పేరు గోలాంగూలులు. వాటికి నాయకుడు గవాక్షుడు. అతని సేన వంద లక్షలు ఉంటుంది. లంకను ఎప్పుడెప్పుడు నంచుకు తిందామా అని గర్జిస్తున్నారు ఆ వానరులు.

ఓ రాక్షసేంద్రా! వానర నాయకులలో ముఖ్యుడు కేసరి. మీరు ఎవడి తోకకు నిప్పంటిస్తే, అతడు మన లంకనే తగలబెట్టాడే ఆ ఘనుడు, హనుమంతుని తండ్రి ఈ కేసరి. ఇతడు మేరుపర్వతము మీద నివసిస్తూ ఉంటాడు. మేరు పర్వతము ప్రాంతములో ఉన్న అరవైవేల బంగారు పర్వతములలో ఆఖరి పర్వతము మీద కొన్ని వానరములు నివసిస్తూ ఉంటాయి. ఆ వానరములు నల్లగానూ తెల్లగానూ,ఎర్రటి ముఖములతో, పెద్ద ఆకారాలతో ఉంటాయి. వీరు అత్యంత వేగంగా పరుగెత్తగలరు. వీళ్లకు తమ గోళ్లు, కోరలే ఆయుధములు. వీరు పెద్ద పులుల మాదిరి భయంకరులు.

మరొక వానర నాయకుని పేరు శతబలి. ఇతడు సూర్యదేవుని ఉపాసకుడు. ఇతని వెంట కూడా అపారమైన వానర సేన ఉంది. రాముని కొరకు తన ప్రాణములను కూడా లెక్కచెయ్యని వీరుడు శతబలి. వీరు కాక, గజుడు, గవయుడు, నలుడు, నీలుడు, ఒక్కొక్కరు కోట్లకొలది వానరులతో వచ్చి ఉన్నారు. ఇంకా వింధ్యపర్వత ప్రాంతములనుండి లెక్కకు మిక్కిలి వానరములు వచ్చి ఉన్నవి. వీరిని లెక్కించడం మాకు శక్యం కాలేదు. వీరిలో ఎవరూ సామాన్యులుకారు. అందరూ మహాపరాక్రమవంతులు. వీరిని గెలవడం అంత సులభం కాదు." అని చెప్పి ఊరుకున్నాడు సారణుడు.

తరువాత శుకుడు తన అభిప్రాయము కూడా చెప్ప నారంభించాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ఇరువది ఏడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధ కాండము
ఇరువది రెండవ సర్గ.

సారణుడు చెప్పడం పూర్తిచేసిన తరువాత శుకుడు తాను తెలుసుకున్న విషయాలు చెప్పనారంభించాడు. "ఓ రాక్షసరాజా! సారణుడు చెప్పినది అక్షర సత్యము ఈ వానరులు మహాబలవంతులు. ఎవరిచేతా జయింప శక్యము కాని వారు. మన మాదిరే కామరూపులు. వారి ఇష్టం వచ్చిన రూపం ధరించగలరు. ఇందులో దేవతలకు, గంధర్వులకు పుట్టిన వానరులు ఎంతోమంది ఉన్నారు. వారందరూ సుగ్రీవునితో పాటు కిష్కింధలో నివసిస్తూ ఉంటారు. అందులో అచ్చము దేవతల వలె పోలికలు ఉన్న వానరులు ఇద్దరు ఉన్నారు. వారి పేర్లు మైందుడు, ద్వివిదుడు. వారు ఇద్దరూ అన్నదమ్ములు. యుద్ధములో వారిని ఎదిరించి నిలిచే వారు లేరు. బ్రహ్మదేవుని కృపచేత వారు అమృతము తాగారు. అందుకే అజేయులు అయ్యారు.

ఓ లంకేశ్వరా! ఇదివరకు లంకకు వచ్చి సీతను చూచి లంకా దహనము చేసిన వాడు మరలా వచ్చాడు. వాడి పేరు హనుమంతుడు. కేసరి పుత్రుడు. వాయుదేవునికి ఔరస పుత్రుడు. నూరుయోజనముల

దూరము కల సముద్రమును దాటగలిగాడు. అతడు కామ రూపుడు. అత్యంత వేగము కలవాడు. ఈ హనుమంతుడు బాలుని గా ఉన్నప్పుడే ఉదయిస్తున్న సూర్యుని చూచి అది ఫలము అని భ్రమించి దానిని తినుటకు సూర్యమండలము వైపునకు ఎగిరిపోయిన మహాబలవంతుడు. అది చూచి ఇంద్రుడు తన వజ్రాయుధముతో కొట్టగా ఉదయ పర్వతము మీద పడ్డాడు. అప్పుడు అతని గడ్డమునకు చిన్న దెబ్బ తగిలింది. అందుకే అతనికి హనుమంతుడు అనే పేరు సార్ధకమయింది. ఈ విషయములన్నీ నా ఆప్తుల నుండి సేకరించాను. అతని బల పరాక్రమముల గురించి చెప్పనలవి కాదు. ఈ హనుమంతుడు అంటించిన అగ్ని ఇంకా లంకలో మండుతూనే ఉంది. అతనిని మనము అంత తొందరగా ఎలా మరిచి పోగలము?

మహారాజా! హనుమంతుని పక్కన ఉన్న నీలమేఘచ్ఛాయ కలవాడు రాముడు. అతడే అయోధ్యరాకుమారుడు. అతడు యోధులలో అతిరథుడు. ఇక్ష్వాకు వంశపు మహారాజు. అతడు ఎల్లప్పుడూ ధర్మానికి కట్టుబడి ఉంటాడు. అతడికి బ్రహ్మాస్త్రము ప్రయోగము తెలుసు. రాముడు తన బాణములతో ఆకాశమును, భూమిని ఏకం చేయగలడు. వాటి రెండింటినీ చీల్చివేయగలడు. ఆ రాముని భార్యనే నీవు జనస్థానము నుండి అపహరించుకొని వచ్చావు. ఎప్పుడెప్పుడు లంకమీద దండెత్తి, నిన్ను సంహరించి, సీతను దక్కించుకుందామా అని ఉరకలు వేస్తున్నాడు.

ఆ రాముడు. ఆ రాముని పక్కనే నిలబడి ఉన్న వాడు లక్ష్మణుడు. అతడు రామునికి తమ్ముడు. మహా పరాక్రమవంతుడు. ఈ లక్ష్మణునికి కోపం ఎక్కువ. కాని బుద్ధిమంతుడు. ఎల్లప్పుడూ జయాభిలాష కలవాడు.

రాముని క్షేమం కోరేవాడు. రాముని కోసరం ప్రాణాలు కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇతడొక్కడే రాక్షసులనందరినీ చంపవలెనని ఎదురు చూస్తున్నాడు.

ఆ రామునికి ఆవల పక్క నిలబడి ఉన్నవాడు తమరి తమ్ముడు విభీషణుడు. అతని చుట్టు వలయంగా నిలబడి ఉన్న నలుగురూ విభీషణుని అనుచరులు అయిన రాక్షసులు. తమరు ఉండగానే, రాముడు తమరి తమ్ముడైన విభీషణుని లంకారాజ్యమునకు పట్టాభిషిక్తుని చేసాడు. వారి దృష్టిలో ఇప్పుడు లంకేశ్వరుడు విభీషణుడే! ఆ విభీషణుడు కూడా లంక మీద యుద్ధానికి కాలుదువ్వుతున్నాడు.

ఇంక ఈ వానర వీరులందరికీ నాయకుడు, కిష్కింధకు రాజు, సుగ్రీవుడు. ఇతడు మహాతేజస్సు కలవాడు. తెలివిగలవాడు. నిరంకుశుడు. అతని మెడలో ఉన్నది దేవతలు వాలికి ఇచ్చిన బంగారు మాల. వాలి మరణించేటప్పుడు ఆ మాలను సుగ్రీవునికి ఇచ్చాడు.

ఓ రాజా! ఇంక వానర వీరుల లెక్కలను చెబుతాను వినండి. వందలక్షలు ఒక కోటి అని అంటారు. అటువంటి కోట్లు లక్ష అయితే శంకువు. అటువంటి శంకువులు వేయి అయితే మహాశంకువు. వెయ్యి మహాశంకువులు ఒక వృందము. అటువంటి వేయి వృందములు ఒక మహావృందము. వెయ్యి మహావృందములు ఒక పద్మము. వెయ్యి మహాపద్మములు ఒక ఖర్వము. వెయ్యి ఖర్వములు మహా ఖర్వము. వెయ్యి మహాఖర్వములు ఒక సముద్రము. వెయ్యి సముద్రములు ఒక ఓఘము. వెయ్యి ఓఘములు ఒక మహౌఘము. ఇదీ పెద్దలుచెప్పిన లెక్క.

ఇప్పుడు వానర సేన ఎంత ఉందంటే వెయ్యి కోట్లు, నూరు శంకువులు, వెయ్యి మహాశంకువులు, నూరు వృందములు, వెయ్యి మహావృందములు, నూరు పద్మములు, వెయ్యి పద్మములు, నూరు ఖర్వములు, నూరు సముద్రములు, ఒకమహౌఘము, కోటి మహౌఘములు సంఖ్యగల వానర సైన్యము నీ మీదికి యుద్ధమునకు వస్తున్నారు. కాబట్టి తమరు మనకు జయము కలిగేట్లు చేయండి." అని వినయంగా చెప్పాడు శుకుడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ఇరువది ఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ఇరువది తొమ్మిదవ సర్గ.

రావణుడు శుకుడు సారణుడుచెప్పిన మాటలను సావధానంగా విన్నాడు. కాని తన ముందు తన శత్రువులను, శత్రుసేనలను పొగడడం సహించలేకపోయాడు. కోపంతో ఉగ్రుడయ్యాడు. వారితో ఇలా అన్నాడు. "మీరు నా కింద బతుకుతున్నారు. నా ముందు నాకు అప్రియమైన మాటలు పలకడానికి మీకు నోరు ఎలా వచ్చింది. రాజు ఎదుట రాజుకు ఇష్టము లేని మాటలను పలకడం యుక్తము కాదు అని తెలియదా! శత్రువులు బలవంతులే అయి ఉండవచ్చు అంతమాత్రాన శత్రువును రాజు ముందు పొగుడుతారా! శత్రువును నా ముందు స్తుతిస్తారా! మీరు రాజనీతి నేర్చుకోలేదా! మీ గురువులు రాజనీతి మీకు నేర్పలేదా! లేదా నేర్చుకొని కూడా మీకు అర్థం కాలేదా! లేదా అజ్ఞానంతో ఇలా మాట్లాడుతున్నారా! మీ లాంటి

మూర్ఖులను నా మంత్రులుగా, గూఢచారులుగా పెట్టుకొని ఇంకా నేను బతికి ఉన్నాను అంటే అది నా అదృష్టము కాని వేరు కాదు.

నా ఎదుట ఇలా శత్రువును పొగిడినందుకు మీకు మరణ దండన విధించబడును అన్న విషయం మీకు తెలియదా! ఒకసారి నా ఆగ్రహానికి గురి అయిన వాళ్లు ఈలోకంలో బతకడం కల్ల అన్న విషయం కూడా తెలియదా! కాని ఒకే ఒక కారణం చేత మీ ఇద్దరినీ క్షమిస్తున్నాను. మీరు ఇంతవరకూ నాకు, లంకకు చేసిన సేవలను గుర్తు పెట్టుకొని మీ ఇద్దరినీ క్షమించి వదిలిపెడుతున్నాను. జీవితంలో మీ ముఖాలు నాకు చూపించకండి. నా దృష్టిలో మీ ఇద్దరూ చచ్చినట్టే. వెళ్లండి." అని పరుషంగా దూషించాడు రావణుడు.

ఆ శుక సారణులు, రావణుని ఆగ్రహానికి గురి అయి కూడా, ప్రాణాలతో బయటపడ్డందుకు సంతోషిస్తూ, రావణునికి జయం పలుకుతూ అక్కడినుండి వెళ్లిపోయారు. రావణుడు పక్కనే ఉన్న మహోదరుని చూచి "సమర్ధులైన గూఢచారులను పిలిపించు" అని ఆజ్ఞాపించాడు. వెంటనే శార్దూలుడు అనే రాక్షసుడి నాయకత్వంలో కొంతమంది గూఢచారులు వచ్చి రావణుని ముందు తలవంచుకొని నిలబడ్డారు.

"రాముడు అనే నరుడు వానర సేనలతో వచ్చి లంకను ముట్టడించి ఉన్నాడు. మీరు గుప్తంగా ఆ వానర సేనలలో ప్రవేశించి రాముని యుద్ధప్రయత్నములు గురించి తెలుసుకోండి. అతనికి ఎవరు దగ్గరవారు, ఎవరి మాట రాముడు వింటాడు, అతని ఆంతరంగికులు ఎవరు అనే విషయాలు ఆరాతీయండి. రాముని దినచర్య నాకు కావాలి. ఎప్పుడు లేస్తాడు, ఎప్పుడు నిద్రిస్తాడు, దినములో ఎప్పుడు ఏ పని చేస్తాడు.

రాముని అలవాట్లు ఏమిటి? ఈ విషయాలన్నీ నాకు కావాలి. మీ లాంటి సమర్థులైన గూఢచారులు సేకరించిన సమాచారము వలననే రాజులు శత్రువులను సులభంగా జయించగలరు. వెళ్లండి. మీకు అప్పగించిన పని జయప్రదంగా పూర్తిచేసుకొని రండి. " అని ఆజ్ఞాపించాడు రావణుడు.

వెంటనే వాళ్లు కార్యరంగంలోకి దూకారు. వానర సేనలో ప్రవేశించారు. నేరుగా రాముడు ఉన్న ప్రదేశానికి వచ్చారు. సువేల పర్వతము మీద ఉన్న రామలక్ష్మణులను పక్కనే ఉన్న విభీషణ సుగ్రీవులను చూచారు. రామ లక్ష్మణులను, వానర సైన్యమును చూడగానే వాళ్లకు ముచ్చెమటలు పట్టాయి. కాళ్లు తడబడ్డాయి. ఆ తడబాటులో వాళ్లు విభీషణుని కంట బడ్డారు. విభీషణుడు ఆ ఇద్దరినీ రాక్షస గూఢచారులుగా గుర్తుపట్టాడు. వాళ్లను పట్టుకొని రాముని వద్దకు తీసుకొని వచ్చాడు.

“వీడి పేరు శార్దూలుడు. గూఢచారులకు అధిపతి. వీడు రాక్షసుడు. మారువేషంలో ఉన్నాడు.” అని చెప్పాడు విభీషణుడు. ఆ మాటలు విన్న వానరులు, వాడి మీద పడి వాడిని చంపడానికి ప్రయత్నిస్తుంటే రాముడు వారిని వారించాడు. వాడితో పాటు వచ్చిన ఇతర రాక్షస గూఢచారులను కూడా విడిపించాడు రాముడు. శార్దూలుడుకూడా బయటపడిందే చాలు అనుకొని తన అనుచరులతోసహా లంకకు పారిపోయాడు. వెంటనే వారు రావణుని వద్దకు పోయి రాముని సైన్యము సువేల పర్వతము దగ్గర ఉంది అని మాత్రము చెప్పారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఇరువది తొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ముప్పదవ సర్గ.

"ఓ రాక్షసేంద్రా! రాముడు తన అపార మైన సేనలతో సువేల పర్వతము మీద ఉన్నాడు." అని శార్దూలుడు రావణునితో చెప్పాడు. ఈ సారి రావణుడు కొంచెం కంగారు పడ్డాడు. కాస్త భయపడ్డాడు. కాని ఆ భయాన్ని బయటకు కనపడనీయలేదు. శార్దూలుడి మొహంలోకి చూచాడు. వాళ్లమొహంలో సంతోషము ఉత్సాహము లేదు. వీళ్లుకూడా వానరుల చేతిలో తన్నులు తిని వచ్చిఉంటారు అని అనుకున్నాడు. అంత భయంలో కూడా రావణునికి నవ్వు వచ్చింది.

"ఏంటీ! మీ మొహాలు వాడిపోయి ఉన్నాయి. చాలా దీనంగా ఉన్నారు. మీరు కూడా శత్రువులకు పట్టుబడ్డారా!" అని నర్మగర్భంగా అడిగాడు. ఆ మాటలకు శార్దూలుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

"ఓ రాక్షస రాజా! మన గూఢచర్యము వానర సేన ముందు ఫలించడం లేదు. వారందరూ రాముని అనుక్షణం అప్రత్తంగా కాపలా కాస్తున్నారు. కనీసము మాకు రామునితో మాట్లాడటం కూడా కుదర లేదు. వానరుల వలయాన్ని ఛేధించుకొని పోవడం ఎవరికీ సాధ్యం కాదు. మేము వానర సైన్యములో ప్రవేశించగానే విభీషణుడు మమ్ములను గుర్తించాడు. వానరులు మా అందరినీ పట్టుకున్నారు. మమ్ములను కాళ్లతోనూ చేతులతోనూ మర్దించారు. మా శరీరాలు రక్తసిక్తం అయ్యాయి. మమ్ములను రాముని ముందు నిలబెట్టారు. మేము రాముని కాళ్ల మీద పడి క్షమించమని వేడుకున్నాము. రాముడు మాకు క్షమాభిక్ష పెట్టాడు. ఆ కారణం చేత మేము బతికి బయటపడ్డాము.

రాముడు లంక ద్వారమును సమీపించాడు. రాముడు తన సేనలను గరుడవ్యూహాకారంలో నిలిపాడు. వానరులు లంకను నలువైపుల నుండీ చుట్టుముడుతున్నారు. రాముడు లంక ప్రాకారమును దాటి లంకలో ప్రవేశించక ముందే ఏదో ఒకటి చేయండి మహారాజా! సీతను రామునికి అప్పగించండి. లేకపోతే యుద్ధము చేయండి." అని చెప్పి ఊరుకున్నాడు శార్దూలుడు.

"సీతను రామునికి అప్పగించే మాట అటుంచు. మీరు వానరసైన్యములోకి ప్రవేశించారు కదా! ఆ సైన్యములో శూరులు ఎవరు! ఎంత మంది ఉన్నారు? ఏ యే వానరుడు ఎలాంటి ప్రతిభ కలిగి ఉన్నాడు? వారు ఎవరి కుమారులు? వారి పూర్వీకులు ఎవరు? ఈ విషయాలన్నీ వివరంగా చెప్పు.శత్రువుల బలాబలాలను పరిశీలించిన తరువాత తగు నిర్ణయం తీసుకుంటాను." అని అన్నాడు రావణుడు.

శార్దూలుడు రావణునితో ఇలా చెప్పసాగాడు. "ఓ రాక్షసేంద్రా! వానర సేనలో జాంబవంతుడు అనే భల్లూకరాజు ప్రసిద్ధుడు. ఆయన గద్గదుని కుమారుడు. తరువాత సుగ్రీవుడు కిష్కింధ దేశాధి పతి. ఆయన ఋక్షరజస్సు కుమారుడు. వీరిని జయించడం చాలా కష్టము. గద్గదుని మరొక కుమారుడు ధూమ్రుడు అనే వాడు ఉన్నాడు. ఇతడు బృహస్పతి కుమారుడు. ఇతనిని కేసరి అని కూడా అంటారు. ఈ కేసరి కుమారుడే హనుమంతుడు. ఈ హనుమంతుడే నూరుయోజనముల సముద్రము దాటి లంకలో ప్రవేశించి, వేలకొలది రాక్షసులను చంపి, లంకను దహించిన వాడు.

తరువాత యమధర్మరాజు కుమారుడు సుషేణుడు, చంద్రుని కుమారుడు దధిముఖుడు కూడా ఉన్నారు. సాక్షాత్తు మృత్యుదేవతలను బ్రహ్మ సృష్టించాడా అన్నట్టు సుముఖుడు, దుర్ముఖుడు, వేగదర్శి వానరసేనలో ఉన్నారు. యుద్ధంలో వారికి ఎదురుపడితే నేరుగా మృత్యు సదనానికి పోవలసిందే! అగ్నిదేవుని కుమారుడు నీలుడు. ఇతను వానర సేనలకు సైన్యాధిపతి. అలాగే వాయుదేవుని కుమారుడు హనుమంతుడు. వాలి గురించి తమకు తెలుసు. వాలి దేవేంద్రుని కుమారుడు. ఆ వాలి కుమారుడు అంగదుడు. మహావీరుడు. బలవంతుడు.

అశ్వినీదేవతల పుత్రులు మైందుడు, ద్వివిదుడు. యముని కుమారులు గజుడు, గవయుడు, గవాక్షుడు, శరభుడు, గంధమాధనుడు. వారి ఆధ్వర్యంలో కోట్లకొలదీ వానరులు. ఇంక రాముడు వారి మధ్యలో ఉన్నాడు. ఆ రాముడు ఎవరో కాదు. జనస్థానంలో ఖర,దూషణులను, త్రిశిరుడిని చంపిన వాడు. వాళ్లనే కాదు విరాధుడినీ, కబంధుడినీ కూడా చంపాడు ఆ రాముడు. రాముని వంటి వీరుడు పరాక్రమవంతుడు ముల్లోకములలో లేడు. జనస్థానములో ఉన్న 14 వేల మంది రాక్షసులను చంపిన రాముని గురించి మేము తమరికి వేరుగా మీకు చెప్పపనిలేదు. ఎవని బాణములకు పొరపాటున దేవేంద్రుడు అడ్డం వస్తే, ఆ దేవేంద్రుడు కూడా భస్మమైపోతాడో, ఆ మహావీరుడు, లక్ష్మణుడు, రాముడి పక్కనే ఉన్నాడు.

వారే కాకుండా సూర్యుని కుమారులైన శ్వేతుడు, జ్యోతిర్ముఖుడు, వరుణుని కుమారుడైన హేమకూటుడు, విశ్వకర్మ కుమారుడు నీలుడు, వసువుల కుమారుడు దుర్ధరుడు కూడా వానర సేనలో ఉన్నారు. వీరందరికీ ప్రధాన సలహాదారుగా తమరి తమ్ముడు విభీషణుడు రాముని

పక్కనే ఉన్నాడు. రాక్షసేంద్రా! సువేల పర్వతము మీద ఉన్న వానర సేన గురించి, వానర నాయకుల గురించి, రామలక్ష్మణుల గురించి మీకు వివరంగా చెప్పాను. తరువాత ఏ నిర్ణయం తీసుకుంటారో తమరి ఇష్టం." అని చెప్పి ఊరుకున్నాడు శార్దూలుడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ముప్పదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ముప్పది ఒకటవ సర్గ.

రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు కోట్లకొలదీ వానరసైన్యములతో వచ్చి లంకను ముట్టడించారు అన్న విషయం గూఢచారుల వలన తెలుసుకున్నాడు రావణుడు. రావణుని మనసులో భయం ప్రవేశించింది. తన ముందు ఉన్నవి రెండే మార్గాలు. ఒకటి సీతను రామునికి అప్పగించడం. అది తనకు ఇష్టం లేదు. రెండవది రామునితో యుద్ధము చేయడం. తన మంత్రులు తనకు ఈ విషమ సమయంలో ఏదైనా సలహా చెప్పకపోతారా అని ఆశపడ్డాడు. వెంటనే మంత్రులను అందరినీ సభకు రావలసినదిగా ఆదేశాలు పంపాడు. రావణుని మంత్రులందరూ సభకు వచ్చారు. రావణుడు వారితో మంత్రాంగము సాగిస్తున్నాడు.

మంత్రులు తమకు తోచిన ఉపాయములను వారు చెప్పారు. అవి ఏవీ రావణునికి రుచించలేదు. సభచాలించి అంత:పురమునకు వెళ్లాడు. రావణునికి ఒక విషయం స్ఫురించింది. సీతను తను

జనస్థానమునుండి అపహరించుకు రావడమే వంచనతో మొదలయింది. ఇప్పుడు కూడా ఆ వంచనాశిల్పాన్ని ప్రయోగిస్తే ఎలా ఉంటుంది అని అనుకున్నాడు. ఇటువంటి మాయలకు పెట్టింది పేరు అయిన విద్యుజ్జిహ్వుని పిలిపించాడు. వానితో ఇలా అన్నాడు. "జనకుని కుమార్తె సీత మన దగ్గర ఉంది. ఆమెను మాయతో భ్రమింపచేయాలి. సీత భర్త రాముడు. రాముని తలను పోలిన తలను, రాముని ధనుర్బాణములను తయారు చేయించి తీరుకొనిరా." అని ఆజ్ఞా పించాడు.

విద్యుజ్జిహ్వుడు రావణుని ఆజ్ఞమేరకు రాముని తలను పోలిన తలను, రాముడు ధరించే ధనుర్బాణములను, తయారు చేసి తీసుకొని వచ్చాడు. ఆ తలను విద్యుజ్జిహ్వుని ద్వారా మోయించుకొని రావణుడు అశోకవనమునకు వచ్చాడు. విద్యుజ్జిహ్వుని దూరంగా నిలబెట్టాడు. రావణుడు సీత వద్దకు వెళ్లాడు. సీత దీనంగా శింశుపా వృక్షము కింద కూర్చుని ఉంది. సీత మనసులో రాముని ధ్యానిస్తూ ఉంది. సీత చుట్టు రాక్షస స్త్రీలు కూర్చుని ఉన్నారు. వారందరూ రావణుని చూచి లేచి నిలబడ్డారు.

రావణుడు సీతను చూచి ఇలా అన్నాడు. "ఓ సీతా! ఇప్పటి దాకా నీవు ఎవరి అండచూచుకొని నన్ను ఎదిరిస్తున్నావో, ఎవరున్నారనే ధైర్యంతో నా పక్కలోకి రావడానికి ఇష్టపడటం లేదో, ఆ రాముడు యుద్ధంలో నా చేతిలో మరణించాడు. నేను చెబితే నువ్వు నమ్మవు కాబట్టి రాముని తలను తీసుకొని వచ్చాను. ఖండింపబడ్డ రాముని శిరస్సు నుండి వెచ్చటి రక్తం ఇంకా కారుతూ ఉంది. ఇంక నైనా నీ మొండి పట్టుదల మానుకో. నాకు భార్యగా ఉండు. సకల సుఖాలు అనుభవించు. రాముడు రణ రంగంలో ఎలా మరణించాడో సావధానంగా విను.

రాముడు సుగ్రీవునితో కలిసి వానర సేనతో సముద్రమువద్దకు వచ్చాడట. రాముడు తన సైన్యముతో సముద్ర తీరంలో నిలిచి ఉన్నాడు. నేను నా గూఢచారులను పంపాను. వారు వానర సేనలతో కలిసిపోయి, వానర సేనలను బాగా పరిశీలించారు. వెంటనే నా సేనాని ప్రహస్తుడు తన సేనలతో రాత్రి పూట వానరులు నిద్రించువేళ హటాత్తుగా దాడి చేసి వానరసేనలను తునుమాడాడు. వానరులందరినీ సమూలంగా చంపివేసాడు. ఆ సమయంలో ప్రహస్తుడు రాముని శిబిరంలోకి ప్రవేశించాడు. తన ఖడ్గంతో నిద్రిస్తున్న రాముని శిరస్సును ఖండించాడు. విభీషణుని బంధించాడు. లక్ష్మణుడు, వానర నాయకులు తలోకదిక్కుగా పారిపోయారు.

మా రాక్షస వీరులు సుగ్రీవుని పట్టుకొని అతని కంఠమును విరిచారు. హనుమంతుని పట్టుకొని పరిమార్చారు. వృద్ధుడైన జాంబవంతుని ఒక్కవేటుతో నరికారు. మైందుడు, ద్వివిదుడు, మొదలగు వానర వీరులు పారిపోతుంటే మా రాక్షస వీరులు వారిని పట్టుకొని నడుములు విరగగొట్టి చంపారు. పనజుడు, దధీముఖుడు,కుముదుడు నా బాణములకు బలి అయ్యారు. అంగదుడు చావుబతుకుల మధ్య ఉన్నాడు. ఇతర వానరులు మా గజబలము చేత మర్దింపబడ్డారు. మరికొందరు వానరులు పారిపోయారు. కొంత మంది సముద్రములో పడిపోయారు. మరి కొందరు చెట్టమీద తలదాచుకున్నారు. కాని మా రాక్షసులు ఆ వానరులను వెతికి వెతికి చంపారు.

మా సేనానాయకుడు రాముని శిరస్సును నాకు కానుకగా పంపాడు. నేను నీకు చూపించడానికి ఆ శిరస్సును తీసుకొని వచ్చాను." అని సీతతో చెప్పి వెంటనే పక్కనే ఉన్న రాక్షసిని చూచి, "నీవు పోయి ఈ

శిరస్సును యుద్ధరంగము నుండి నా వద్దకు తీసుకొని వచ్చిన విద్యుజ్జిహ్వుడు అనే సైనికుడిని తీసుకొనిరా” అని అన్నాడు. రాక్షసి పోయి పక్కనే ఉన్న విద్యుజ్జిహ్వుని తీసుకొని వచ్చింది. విద్యుజ్జిహ్వుడు ఖండింప బడ్డ రాముని తలను, రాముని ధనుర్బాణములను తీసుకొని వచ్చాడు. రావణునికి నమస్కరించి నిలబడ్డాడు.

“విద్యుజ్జిహ్వా! నీవు కదా రాముని తలను యుద్ధరంగము నుండి తీసుకొని వచ్చినది. ఆ తలను సీతకు చూపించు. తన భర్తకు కలిగిన దురవస్థను సీత కళ్లారా చూస్తుంది.” అని అన్నాడు. విద్యుజ్జిహ్వుడు రాముని తలను రాముని ధనుర్బాణములను సీత దగ్గరగా పెట్టాడు. “సీతా! చూడు. నీ భర్త రాముడు ఇంక ఈ భూమి మీద లేడు. నేను నీకు భర్తను, నాధుడను. ఇంకనైనా నువ్వు నన్ను భర్తగా స్వీకరించక తప్పదు.” అని అన్నాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ముప్పది ఒకటవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ముప్పది రెండవ సర్గ.

ప్రశాంతంగా కూర్చుని మనసులో రాముని తలచుకుంటున్న సీతకు ఇదంతా కలగా అనిపించింది. ఎదురుగా పడి ఉన్న రాముని ఖండిత శిరస్సు, ధనుర్బాణములు చూచింది. నాడు హనుమంతుడు వానర సేనానాయకుల గురించి, సుగ్రీవుని గురించి ఏమి చెప్పాడో అవే రావణుడు కూడా చెప్పడం గమనించింది సీత. రాముని శిరస్సు వంక

చూచింది. సంవత్సరాల తరబడి పరిచయం ఉన్న ముఖం రామునిది. ఆ కళ్లు, ముఖము, నుదురు, అవన్నీ చూచి ఆ శిరస్సు రామునిదే అని నిర్ధారించుకుంది సీత. సీతకు దు:ఖము ముంచుకొచ్చింది. తట్టకోలేక పోయింది. వలా వలా ఏడిచింది. ఇన్ని ఆపదలకు కారణమైన తన అత్తగారు కైకను నిందించింది.

"అమ్మా కైకమ్మతల్లీ! నీ కోరిక తీరిందా! రాముని అయోధ్యలో లేకుండా చేద్దామని అనుకున్నావు. తుదకు ఈ లోకంలోనే లేకుండా పోయాడు. నీవు మమ్ములనే కాదు ఇక్ష్వాకు వంశమునే నాశనం చేసావు. నాకు, రామునికి నార చీరలు ఇచ్చి అడవులకు పంపావు. నేను, నా రాముడు, నీకేమి అపకారం చేసాము. నీవు అరణ్యములకు పంపబట్టికదా నాకు రామునికి ఇన్నికష్టాలు వచ్చి పడ్డాయి." అని దీనంగా విలపించింది.

తన పాచిక పారినందుకు రావణుడు లోలోపల సంతోషి స్తున్నాడు, పైకి మాత్రం గంభీరంగా ఉన్నాడు. సీత ఒక్కసారి రాముని శిరస్సు వంక చూచింది. " ఓ రామా! అజేయుడవైన నీవు ఈనాడు ఈ మాదిరి దిక్కులేని చావు చచ్చి నన్నుకూడా జీవచ్ఛవాన్ని చేసావా? వైధవ్యాన్ని నాకు అంటగట్టావా! భార్యలో ఏదైనా దోషం ఉంటే, భర్త భార్యకంటే ముందు మరణిస్తాడు. నాలో ఏదో లోపం ఉండబట్టే నీవు ముందుగా మరణించి నన్ను విధవరాలిగా చేసావు. నన్ను రక్షించడానికి వచ్చి నువ్వు చంపబడ్డావా రామా! ఎంతో మంది జ్యోతిష్కులు నీకు పూర్ణాయుర్దాయము ఉందని చెప్పారు కానీ నీవు అల్పాయుష్కుడవని తెలుసులేకపోయారు గదా! ఆ జ్యోతిష్కులమాటలు అసత్యములు చేసి వెళ్లిపోయావా రామా! కాలాతీతుడ వైన నిన్ను కూడా కాలం కాటేసిందా రామా!

రామా! నీవు ఎంతో పరాక్రమవంతుడివే! నీకు ఎన్నో ఉపాయములు తెలుసు కదా! మరి ఈ మాదిరి శత్రువులచేతికి చిక్కి ఎలా హతమయ్యావు రామా! మహాభయంకరమైన మృత్యుదేవత నిన్ను నా నుండి బలవంతంగా లాగుకొని పోయిందా రామా! ఎదురుగా ఉన్న నన్ను విడిచి పెట్టి భూదేవిని కౌగలించుకొని శాశ్వతంగా నిద్రిస్తున్నావా రామా!

రామా! ఈ ధనుస్సును నీవు ఎల్లప్పుడూ భక్తితో పూజించేవాడివి. అటువంటి ధనుస్సు కూడా నిన్ను రక్షించలేదా రామా!నీవు ఈ పాటికి నీ తండ్రి గారు దశరథుని కలుసుకొని ఉంటావు కదా రామా! ఓ రామా! మన ఇద్దరికీ బాల్యంలో ఉండగానే వివాహం అయింది. ఇంతకాలము ఇద్దరం కలిసిమెలిసి ఉన్నాము. ఈ నాడు నన్ను ఒంటరిగా వదిలివెళ్లి పోయావా రామా! మౌనంగా ఉన్నావు ఎందుకు రామా! మాట్లాడు. నీ సీతకు బదులు చెప్పు. మన వివాహసమయంలో నా చేతిని పట్టుకొని జీవితాంతము నన్ను వదిలిపెట్టనన్నావు. నాతోనే ఉంటానన్నావు. ధర్మాచరణము చేస్తానన్నావు. అవన్నీ మరిచిపోయి ఒంటరిగా వెళ్లి పోయావా! నన్ను కూడా నీతో తీసుకొనివెళ్లు రామా! ఎప్పుడూ మంగళప్రదంగా ఉంటూ సకలాభరణాలతో శోభిల్లే నీ శరీరము ఇప్పుడు యుద్ధభూమిలో మృగములకు ఆహారంగా మారిందా రామా!

రామా! నీవు ఎన్నో యజ్ఞాలు యాగా చేసావు. దాన ధర్మాలు చేసావు. కానీ ఈనాడు నీ శరీరం అంతిమసంస్కారానికి కూషడా నోచుకోలేదు కదా! అనాథ ప్రేతం లాగా మిగిలిపోయింది కదా రామా! మీ తల్లిగారు కౌసల్యనుండి అనుమతి తీసుకొని అయోధ్యనుండి మనము ముగ్గురము అరణ్యములకు వచ్చాము. కాని ఇప్పుడు లక్ష్మణుడు ఒక్కడే

తిరిగి అయోధ్యకు వెళుతున్నాడు. కౌసల్య నీ గురించి అడిగినప్పుడు నిన్ను నీ సైన్యమును శత్రువులు వధించారు అని చెబుతాడు లక్ష్మణుడు. నీవు శత్రువులతో చంపబడ్డట్టు, నేను ఇక్కడ రాక్షసుల మధ్య ఉన్నట్టు తెలిసి కౌసల్య జీవించలేదు. ఓ రామా! నా కోసరము నూరుయోజనముల సముద్రాన్ని దాటిన నీవు, విధివక్రించికేవలము ఆవు గిట్టంత చిన్న కుంటలో పడి మరణించినట్టు మరణించావు కదా! రామా! నా కొరకు నీవు ఇంతదూరము వచ్చి ఇక్కడ అకాల మృత్యువుకు గురైనావు. నేనే నీ పాలిట మృత్యుదేవతనయ్యాను కదా రామా! ఓ రామా! నేను నీ భార్యనై ఉండి కూడా, నీ తోపాటు ఎన్నో పుణ్యకార్యములు చేసి కూడా, ఈనాడు ఇటువంటి దు:ఖములు అనుభవిస్తున్నాను అంటే నేను ఏ నాడో ఘోరమైన పాపాలు చేసి ఉంటాను. ఆ పాపఫలమును అనుభవిస్తున్నాను." అని పరి పరి విధాలా దు:ఖించింది సీత.

తల ఎత్తి రావణుని చూచి "ఓ రావణా! రాముడు లేని సీత లేదు. రాముడు మరణించగానే సీత కూడా మరణించింది. ఈ శరీరం మాత్రం మిగిలి ఉంది. ఈ శరీరాన్ని ఖండించి నన్ను రామునితో కలుపు. ఓ రావణా! నా రాముని శరీరాన్ని కూడా తెప్పించి నా శిరస్సును రాముని శిరస్సుతోనూ, నా శరీరాన్ని రాముని శరీరంతోనూ కలుపు. నేను స్వర్గంలో నారాముని కలుస్తాను." అని ఏడుస్తూ అంది సీత.

ఇదంతా రావణుడు చూస్తున్నాడు. వింటున్నాడు. ఇంతలో ఒక రాక్షస భటుడు రావణుని వద్దకు వచ్చి ఇలా అన్నాడు. "జయము జయము మహారాజా! సర్వసైన్యాధిపతి ప్రహస్తులవారు వచ్చి ఉన్నారు. తమరి దర్శనము కోరుతున్నారు." అని పలికాడు. వెంటనే రావణుడు అక్కడి నుండి వెళ్లిపోయాడు. రాజసభ ఏర్పాటు చేసాడు. ప్రహస్తుని వలన యుద్ధరంగము

విశేషాలు తెలుసుకున్నాడు. ఏ క్షణంలో అయినా యుద్ధ ప్రారంభం కావచ్చు అని తెలుసుకొన్నాడు. సైన్యాధి పతులందరికీ ఈ విధంగా ఆజ్ఞలు ఇచ్చాడు. "సైన్యాలను సిద్ధం చేయండి. యుద్ధభేరీలు మోగించండి. సైన్యములను తరలించండి. యుద్దము ఎక్కడ ఎవరితో అని ఎవ్వరికి చెప్పవద్దు." అని పలికాడు. రావణుని సైన్యాధిపతులు రావణుని ఆజ్ఞలను అమలు పరిచారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ముప్పది రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ముప్పది మూడవ సర్గ.

ఎప్పుడైతే రావణుడు, రావణుని వెంట విద్యుజ్జిహ్వుడు అక్కడి నుండి వెళ్లిపోయారో, వారి మాయచేత కల్పితమైన రాముని ఖండిత శిరస్సు, రాముని ధనుస్సు, బాణములుకూడా మాయం అయ్యాయి. అది చూచిన సీత నిశ్చేష్టురాలయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న సరమ అనే రాక్షస స్త్రీ సీత దగ్గరకు వచ్చింది. రాక్షసులలో కూడా మంచి వాళ్లు ఉన్నట్టు సరమ రాక్షస స్త్రీ అయినా సీత అంటే ఆమెకు ప్రేమ అభిమానము. సీత కు కూడా సరమ అంటే ప్రీతి, నమ్మకము. సరమ సీతను చూచి ఇలా అంది.

"సీతా! ఏడవకు. ఊరుకో. ఈ పరిణామాలు చూచి బాధపడకు. రావణుడు ఇక్కడకు వచ్చినప్పటి నుండి అతడు పలికిన పలుకులు, నువ్వు నీ భర్త గురించి పడ్డ ఆవేదన, నువ్వు రావణునితో పలికిన పలుకులు

అన్నీ నేను ఆ చెట్టు చాటున ఉండి విన్నాను. నాకు రావణుడు అంటే ఏ మాత్రం భయం లేదు. ఏం చేస్తాడు. చంపుతాడు అంతే కదా. నీకోసం నా ప్రాణాలు కూడా ఇస్తాను. నన్ను నమ్ము. సీతా! నువ్వు ఒక్కటి గమనించావో లేదు. రాముడు చనిపోయాడు అని నిన్ను నమ్మించడానికి రాముని శిరస్సు తీసుకొని వచ్చిన రావణుడు, సేవకుడు వచ్చి ప్రహస్తుడు వచ్చాడు అనగానే వెంటనే ఇక్కడి నుండి వెళ్లిపోయాడు. నేను కూడా వారిని రహస్యంగా వెంబడించి అసలు విషయం తెలుసుకున్నాను.

నీ రాముడు మరణించలేదు. నీ రాముని ఎవరూ చంపలేదు. రావణుడు చెప్పినట్టు ఏ వానరుడూ చావలేదు. వారంతా రాముని రక్షణలో సుఖంగా ఉన్నారు. రావణుడు అన్నీ అసత్యాలు చెప్పాడు. నీ దగ్గర తన మాయలు ప్రయోగించాడు. అందుకే వాడు వెళ్లిపోగానే వాడు మాయతో సృష్టించిన రాముని శిరస్సు ధనుర్బాణములు కూడా మాయం అయ్యాయి. కాబట్టి రాముడు క్షేమంగా ఉన్నాడు. నీవు దిగులు చెంద నవసరం లేదు.

పైగా, రాముడు నూరుయోజనముల సముద్రమును అపారమైన వానర సేనతో దాటి లంకను చుట్టుముట్టాడు. అందుకే రావణుడు తొందర తొందరగా ఇక్కడి నుండి వెళ్లిపోయాడు. ఈ విషయం నిర్ధారణ చేసు కోడానికి నేను నగరం బయటకు వెళ్లి వానర సేనా మధ్యలో ఉన్న రామలక్ష్మణులను నా కళ్లారా చూచాను. ఈ విషయం నిర్ధారించు కోడానికి రావణుడు తన గూఢచారులను పంపాడు. వారు వానరసేన లంకను చుట్టుముట్టినది అన్న వార్త తీసుకొని వచ్చారు. ఈ వార్త విన్న రావణుడు వెంటనే ఇక్కడి నుండి వెళ్లిపోయాడు. తన మంత్రులతో సభచేసి వారితో మంత్రాంగము సాగిస్తున్నాడు. ” అని సరమ సీతతో చెబుతూ

ఉండగానే యుద్ధభేరీలు మోగుతున్నాయి. సైనికుల కోలాహలం వినిపించింది.

"సీతా! విన్నావుగా! అదుగో రణభేరి మోగుతూ ఉంది. ఆశ్వికసేన, గజసేన కదన రంగమునకు కదులుతున్న సవ్వడి వినిపిస్తూ ఉంది. సైనికుల హుంకారాలు వినిపిస్తున్నాయి. రావణుడు రాముడి మీదికి యుద్ధానికి వెళుతున్నాడు. రావణుడు పలకినట్టు రాముడు మరణించి, వానరసైన్యము పారిపోతే ఇప్పుడు ఎవరి మీదికి యుద్దానికి వెళుతున్నాడు. కాబట్టి రావణుడు పలికిన పలుకులు అన్నీ అబద్ధము అని తెలుసుకో! నీకు త్వరలో మంచిరోజులు వస్తున్నాయి. నీ రాముడు నిన్ను చేరుకుంటాడు. ఈ రాక్షసులకు పొయ్యేకాలం దాపురించింది. రావణుడు యుద్ధంలో మరణించడం, రాముడు నిన్ను పొందడం తథ్యం. నీ దు:ఖములు అన్నీ తొలగి పోతాయి.. నువ్వు నిశ్చింతగా ఉండు. ప్రత్యక్షదైవమైన ఆ సూర్యునికి నమస్కరించు. నీకు అన్నీ శుభాలు కలుగుతాయి." అని పలికింది సరమ.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ముప్పదిమూడవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ముప్పది నాలుగవ సర్గ.

అమృతముతో సమానమైన సరమ మాటలు విన్న సీత పరమానంద భరితురాలైంది. రాముడు బతికి ఉన్నాడు మరణించలేదు అన్న మాటలు ఆమె కర్ణపేయములుగా వినిపించాయి. సీత సంతోషమును

చూచి సరమ ఇంకా ఇలా అంది. "ఓ సీతా! ఇప్పటికి ఈ విషయాలు మాత్రము సేకరించాను. నేను ఇప్పుడే పోయి మరిన్ని విశేషములను సేకరించి తీసుకొని వస్తాను. నీవు నిశ్చింతగా ఉండు. ఎలాగా అంటే నాకు ఆకాశగమనము తెలుసు. హాయిగా ఆకాశంలో ఎగురుతూ వెళ్లగలను." అంది సరమ.

ఆ మాటలు విన్న సీత సరమతో ఇలా అంది. "సరమా! నీవు అటు ఆకాశములో గానీ, ఇటు పాతాళములో గాని నిర్భయంగా పోగలవని నాకు తెలుసు. రాముడు బతికి ఉన్నాడని చెప్పావు. చాలా సంతోషంగా ఉంది. కానీ ఈ సమయంలో రావణుడు ఏంచేస్తున్నాడు. అతని యుద్ధతంత్రము ఏమిటి? అనే విషయములు తెలుసుకొని వచ్చి నాకుచెప్పగలవా! ఆ రావణుడు తన మాయలతో నన్ను మోహింపజేస్తున్నాడు. దానికి తోడు ఈ రాక్షస స్త్రీలను ప్రేరేపించి నన్ను భయపెడుతున్నాడు. కాబట్టి ఏది నమ్మాలో ఏది నమ్మకూడదో తెలియడం లేదు. అందుకని రావణుని మాయల గురించి, అతడి యుద్ధతంత్రముల గురించి నాకు తెలియజేస్తే నేనునిశ్చింతగా ఉంటాను." అని అడిగింది సీత.

సీత మాటలకు సరమ ఇలా అంది. "ఓ సీతా! ఆ విషయం నాకు నువ్వు చెప్పవలెనా! చిటికలో వెళ్లి రావణుని మంత్రాంగము అంతా తెలుసుకొని వచ్చి నీకు చెపుతాను." అని పలికి సరమ అక్కడి నుండి తొందరగా వెళ్లిపోయింది. రావణుని మందిరమునకు వెళ్లింది. రావణుడు తన మంత్రులతో మాట్లాడే మాటలను రహస్యంగా పొంచి ఉండి విన్నది. వెంటనే అశోకవనమునకు తిరిగి వచ్చింది. తన రాక కోసం ఎదురు చూస్తున్న సీతను చూచి ఇలా అంది.

"సీతా! నీవు చెప్పిన ప్రకారము నేను రావణుని ఆంతరంగిక మందిరమునకు వెళ్లాను. అక్కడ రావణుడు మంత్రులతో చర్చలు జరుపుతున్నాడు. రావణుని తల్లి కైకసి కూడా అక్కడే ఉంది. నిన్ను వెంటనే విడిచిపెట్టమని, రాముని వద్దకు పంపమనీ కైకసి తన కుమారుడు రావణుని బతిమాలుతూ ఉంది. ఆమే కాదు, అవిద్ధుడు అనే వృద్ధుడైన మంత్రి కూడా నిన్ను వెంటనే రాముని వద్దకు పంపమని, యుద్ధము నివారించమనీ రావణునికి నచ్చచెప్పడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

కైకసి, అవిద్ధుడు రావణునితో ఈవిధంగా అంటున్నారు. "జనస్థానములో రాముడు ఒంటరిగా ఎంత మందిని చంపాడో నీకు తెలుసు కదా! అది తెలిసి కూడా ఇప్పుడు రామునితో యుద్ధము చేయడం అవసరమా! వెంటనే సీతను రాముని వద్దకు సగౌరవంగా పంపించు. యుద్ధము నివారించు. అదీకాకుండా నిన్న కాక మొన్న హనుమంతుడు అనే పేరుగల ఒక వానరము, లంకలో సృష్టించిన భీభత్సము అప్పుడే మరిచిపోయావా! ఆ వానరము నూరుయోజనముల సముద్రమును దాటి, లంకకు వచ్చి, సీతను చూచి, లంకను తగలబెట్టి మరీ పోయింది. ఒక్కడే ఇంత చేస్తే, మిగిలిన వానరములు ఎంతటి ప్రళయాన్నిసృష్టిస్తాయో ఆలోచించు." అని పరి పరి విధాలా రావణునికి నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. కానీ రావణుడు సుతరామూ వారి మాటలు వినలేదు. ఎన్ని చెప్పినా రావణునికి నిన్ను విడవడం ఇష్టం లేదు. యుద్ధములో చావడానికైనా ఇష్టపడుతున్నాడు కానీ, నిన్ను విడవడానికి ఇష్టపడటం లేదు ఆ రావణుడు. సీతా! రావణుడికి పొయ్యేకాలం దాపురించే ఎవ్వరు చెప్పినా వినడం లేదు. వాడు రాముడి చేతిలో చావడం తథ్యం. నువ్వు నీ భర్త రామునితో కలిసి అయోధ్యానగర ప్రవేశం చేయడం ఖాయం." అని చెబుతూ ఉండగానే భూమి కంపిస్తున్నట్టు యుద్ధభేరీలు మోగడం, వానర

సేనల సింహగర్జనలు హుంకారాలు వినిపించాయి. అవి విన్న రాక్షసులు రావణుడు చేసిన అపరాధమునకు మనం అంతా నాశనం కాబోతున్నాము అని ఆందోళన చెందుతున్నారు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ముప్పది నాలుగవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ముప్పది ఐదవ సర్గ.

లంకా నగరము బయట వానర సైన్యము యొక్క యుద్ధ సన్నాహాలు, వారి యుద్ధభేరీ శబ్దాలు విన్న రావణుడు తన మంత్రుల వంక చూచాడు. వారిని ఉద్దేశించి ఇలా అన్నాడు. "ఓ మంత్రులారా! రాముడు వానర సేనతో సముద్రమును దాటిన విషయము, లంకను ముట్టడించిన విషయము మీ ద్వారా విన్నాను. ఎంత సేపటికీ రాముని పొగడడం, రామునితో సంధిచేసుకోమని నాకు సలహా ఇవ్వడం, సీతను తీసుకొని పోయి రామునికి అప్పగించమనడం తప్ప మీరు ఏమీ చేయడం లేదు. చేతకాని వారిలా చేతులు ముడుచుకొని కూర్చున్నారు. ఒకరి ముఖాలు ఒకరు చూచుకుంటున్నారు. ఇదంతా నేను చూస్తూనే ఉన్నాను. మీ పౌరుషము, పరాక్రమము ఏమైనాయి. రామునికి, వానర సేనలకు భయపడుతున్నారా!" అని నిష్ఠూరంగా కోపంగా అన్నాడు.

అప్పుడు మాల్యవంతుడు అనే రాక్షస మంత్రి లేచి ఇలా అన్నాడు. "ఓ రాక్షసేంద్రా! నీతి మార్గమును, ధర్మ మార్గమును అనుసరించు రాజు ఎల్లప్పుడూ విజయమును పొందుతాడు. అటువంటి రాజుకు శత్రువులు కూడా భయపడతారు. యుద్ధము వచ్చినపుడు సమయానుకూలంగా ప్రవర్తించాలి. మన బలము ఎదిరి బలమును గుర్తెరిగి యుద్ధము చేయడమో సంధిచేసుకోవడమో చేయడం ఉత్తమం. అటువంటి రాజు ఎల్లప్పుడూ జయమును పొందుతాడు. రాజు యొక్క బలము శత్రువు యొక్క బలము కన్నా తక్కువగా ఉన్నప్పుడు, లేక శత్రు బలంతో సమంగా ఉన్నప్పుడు, జయము సందేహాస్పదము. కావున సంధిచేసుకొనడం ఉత్తమం. రాజు బలము శత్రుబలము కన్నా ఎక్కువగా ఉన్నప్పుడు తప్పకుండా యుద్ధము చేసి శత్రువును జయించవలెను. ఇది రాజధర్మము. యుద్ధనీతి. ప్రస్తుతము ఈ యుద్ధము అనవసరము. రాముని బలము మన బలము కన్నా ఎక్కువగా ఉన్నట్టు కనపడుతూ ఉంది. ఈ సందర్భంలో సంధి చేసుకొనడం ఉత్తమం.

ఇదంతా రాముని భార్య సీత వలన జరిగింది. నీవు ఆ సీతను అపహరించావు. తన భార్యకోసరం రాముడు వానరసేనతో లంక మీదికి దండెత్తివచ్చాడు. నీవు సీతను రాముని వద్దకు సగౌరవంగా పంపితే యుద్ధము నిలిచిపోతుంది. లంక క్షేమంగా ఉంటుంది. ముల్లోక ములలో ఉన్న దేవతలు, దానవులు, గంధర్వులు, ఋషులు అందరూ రామునికే జయము కలగాలని కోరుకుంటున్నారు. నీవు ఒక్కడివి ఒక స్త్రీ కొరకు రామునితో విరోధం సాగించడం అనవసరము. కాబట్టి రామునితో సంధిచేసుకోవడం ఉత్తమం.

ఓ లంకేశ్వరా! బ్రహ్మ దేవతలను, అసురులను సృష్టించాడు. దేవతలు ఎల్లప్పుడూ ధర్మమార్గమునే అనుసరిస్తున్నారు. అసురులు అధర్మమార్గమునే అనుసరిస్తున్నారు. ఆ కారణం చేత దేవతలు అంటే ధర్మ స్వరూపులనీ, అసురులు అధర్మస్వరూపులనీ లోకులు అనుకుంటున్నారు. అధర్మమును ధర్మము ఎప్పుడు అణగదొక్కుతూ ఉంటుందో అప్పుడు కృతయుగము ప్రవర్తిస్తూ ఉంటుంది. ఎప్పుడైతే ధర్మము క్షీణించి, అధర్మము ధర్మమును అణగతొక్కుతుందో అప్పుడు కలియుగము మొదలవుతుంది.

నీవు అధర్మాన్ని ఆశ్రయించావు. ధర్మాన్ని నాశనం చేసావు. అందరి తోనూ శత్రుత్వమును పెంచుకున్నావు. ధర్మం మన శత్రువుల పక్షాన ఉంది. అందుకే వారు మనకన్నా బలవంతులు అయ్యారు. నీవు సీతను అపహరించుకొని వచ్చి అధర్మానికి పాలుపడ్డావు. ధర్మాన్ని కాలదన్నావు. నీ అధర్మమే మనలనందరినీ నాశనం చేస్తూ ఉంది. దేవతలందరూ ధర్మాత్ములయిన శత్రుపక్షము వహించారు. అందుకే శత్రువులు మనకన్నా బలంగా ఉన్నారు.

ఓ లంకేశ్వరా! నీకు భోగములు అనుభవించడంలో ఉన్న ఆసక్తి ధర్మాచరణములో లేదు. అందుకే అగ్నితో సమానులైన మహాఋషులను బాధించావు. వారి ఆగ్రహానికి పాత్రుడవు అయ్యావు. ఋషులు ఎల్లప్పుడూ ధర్మపక్షపాతులు. ధర్మాన్ని కాపాడుతుంటారు. వారి ప్రభావము నీకు బాగా తెలియదు. వారి మనస్సులు తపస్సుచేత పునీతమయినవి. వారు యజ్ఞయాగములు చేస్తూ, వేదములను అధ్యయనము చేస్తూ ఉంటే ఆ వేదమంత్రముల ఘోషలో నీ రాక్షసులు తలొక దిక్కుగా పారిపోతారు. వారు వేల్చే అగ్నిహోత్రముల నుండి వెలువడే

ధూమము నలుదిక్కులా వ్యాపించి రాక్షసుల తేజస్సును హరించి వేస్తుంది. ఆ ఋషులు ప్రతి దినము తమ తమ ప్రాంతాలలో చేసే తీవ్రమైన తపస్సుకు, నీ రాక్షసులు తల్లడిల్లిపోతారు.

ఓ రాక్షసేంద్రా! నీవు దేవతల వలన, దానవుల వలనా, యక్షుల వలనా చావు లేకుండా వరమును పొంది ఉన్నావు. నరులను, వానరులను మరిచావు. ఇప్పుడు ఆ నరులు, వానరులు, భల్లూకములు నీ మీదికి యుద్ధానికి కాలుదువ్వుతున్నాయి. ఎప్పుడెప్పుడు నిన్ను నీ సైన్యాన్ని కబళిద్దామా అని ఉరకలు వేస్తున్నాయి. అదీ కాకుండా లంకలో అనేక దుశ్శకునములు ఉత్పాతాలు కనపడుతున్నాయి. రాక్షస వినాశము కాబోతోంది అని సంకేతాలు ఇస్తున్నాయి. రక్తవర్షము కురుస్తూ ఉంది. అశ్వశాలలో ఉన్న అశ్వములు, గజశాలలో ఉన్న ఏనుగుల కంటి నుండి కన్నీరు పెల్లుబుకుతూ ఉంది. గజాశ్వములు రోదించడం మనకు క్షేమం కాదు. అడవులలో ఉండవలసిన నక్కలు, తోడేళ్లు క్రూరమృగములు నగరంలోకి ప్రవేశిస్తున్నాయి. వికృతాకారులైన స్త్రీలు వికృతంగా నవ్వుతూ స్వప్నములలో సాక్షాత్కరిస్తున్నారు. దేవతలకు అర్పించిన బలులు కుక్కలు తింటున్నాయి. ఇటువంటి దుశ్శకునములు ఎన్నో కనపడుతున్నాయి. మృత్యుదేవత లంకా నగరంలో తాండవం చేస్తూ ఉంది.

ఓ రావణా! రాముడు సామాన్యుడు కాడు. సాక్షాత్తు విష్ణుస్వరూపుడు లేకపోతే నూరుయోజనముల దూరము కల సముద్రము మీద సేతువు కట్టడం ఇతరులకు సాధ్యంకాదు. కాబట్టి రామునితో సంధి చేసుకో. లంకను కాపాడు." అని పలికాడు మాల్యవంతుడు.

రావణుని ముఖం వంక చూచాడు. రామునిలో ఏ మార్పూ లేదు. చేసేది లేక మౌనంగా కూర్చున్నాడు మాల్యవంతుడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము ముప్పది ఐదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ముప్పది ఆరవ సర్గ.

రావణునికి రెండే గుణాలు. అతనికి తెలియదు. ఒకరు చెబితే వినడు. వీళ్లనే మూర్ఖులు అంటారు. ఆ మూర్ఖులలో కెల్లా అగ్రగణ్యుడు రావణుడు. రావణునికి ఎంతో మంది చెప్పారు, తల్లి కైకసి కూడా చెప్పింది. సీతను రామునికి ఇచ్చి యుద్ధము నివారించు అని. కాని వినలేదు. ఇప్పుడు మాల్యవంతుడు చెప్పాడు. రావణుడు వినలేదు. పైగా కోపం వచ్చింది.

(ఇదే లక్షణాలు మీకు దుర్యోధనుడిలో కూడా కనపడతాయి. తన స్వార్ధానికి, మూర్ఖత్వానికి పదకొండు అక్షౌహిణీల సైన్యాన్ని బలి పెట్టాడు. కేవలం పాండవులకు ఇవ్వవలసిన రాజ్యభాగమునకు లోభించి యుద్ధాన్ని ఆహ్వానించాడు. రావణుడు కూడా ఎంతో మంది అందమైన స్త్రీలు ఉన్నా కేవలం సీత కోసం రాముడితో యుద్ధాన్ని ఆహ్వానిస్తున్నాడు.)

మాల్యవంతుడు చెప్పిన మాటలకు రావణుడికి కోపం వచ్చింది. మాల్యవంతునితో ఎంతో కఠినంగా ఇలా అన్నాడు. "మాల్యవంతా! నీ

హితబోధలు నాకు అక్కరలేదు. మీరు శత్రుపక్షము వహించి, నాకు హితబోధ చేస్తే అవి నాచెవికి ఎక్కవు. రాముడు కేవలం మానవుడు. రాజ్యము పోగొట్టుకొని అడవులు పట్టి తిరుగుతున్న అభాగ్యుడు. సైన్యము లేక, ఎవరూ దొరక్క, వానరుల సాయం తీసుకున్నాడు. అటువంటి వాడు నన్ను గెలువగలడా! రామునికి అంత సమర్థత ఉందా! నేను ఎవరు; రాక్షసులకు రాజును. దేవతలను జయించిన వాడను. పరాక్రమ వంతుడను. దిక్పాలకులను నా పాద దాసులుగా చేసుకున్న మేటిని. నన్ను భీరుడుగా, బలహీనుడుగా ఎందుకు అనుకుంటున్నావు.

మాల్యవంతా! నీవూ రాక్షసుడవే. నేను రాక్షసుడనే. ఇరువురమూ ఒకే జాతికి చెందిన వారము. కానీ నీవు మానవుల పక్షము వహించి నన్ను కించపరుస్తున్నావు. ఇది శత్రువుల మీద పక్షపాతమా! లేక నా మీద అసూయనా! లేక మీరు ఏమి అన్నా నేను ఏమీ అనడం లేదనా! నా మంచి తన్నాన్ని నా చేతగానితనంగా అనుకుంటున్నారా! నీవు శాస్త్రములను అధ్యయనము చేసిన వాడవు. రాజుతో ఇలాగేనా మాట్లాడేది. ఇది నీకుగా నువ్వు మాట్లాడుతున్నావా! లేక మన శత్రువులు ఎవరైనా నీ చేత ఇలా పలికిస్తున్నారా! సీతను అంత కష్టపడి జనస్థానము నుండి తీసుకొని వచ్చినది రామునికి భయపడి తిరిగి ఇచ్చివేయడానికా! అలా భయపడితే అసలు సీతను తీసుకొని వచ్చి ఉండేవాడినే కాదు!

మాల్యవంతా! యుద్ధము మొదలైన రోజే వానరులు, రామలక్ష్మణులు, సుగ్రీవుడు, వానర వీరులు నాచేతిలో హతమవుతారు. ఇది సత్యము. నాలో సహజంగా వీరత్వము రోషము పౌరుషము ఎక్కువ. నేను చావనైనా చస్తాను కానీ ఎవరికీ లొంగను. ఎవరితోనూ సంధి చేసుకోను. ఎంతో మంది వానరుల సాయంతో సముద్రము మీద సేతువు

నిర్మించి సముద్రమును దాటినంత మాత్రాను రాముడు దేవుడు అయిపోడు. కాబట్టి రాముడికి నేను భయపడవలసిన అవసరము లేదు. సముద్రమును దాటి లంకకు వచ్చిన రాముడు, వానరులు తిరిగి సముద్రాటి వెళ్లరు. ఇదే నా ప్రతిజ్ఞ. " అని అత్యంత పరుషంగా మాట్లాడిన రావణుని మాటలు విన్న మాల్యవంతుడు మౌనంగా ఉండిపోయాడు. వెంటనే రావణునికి జయము పలికి, ఆశీర్వదించి, తన గృహమునకు వెళ్లిపోయాడు.

ఇది చూచిన మిగిలిన మంత్రులు రావణునికి వ్యతిరేకంగా చెప్పడం ఒంటికి మంచిది కాదని రావణుడు చెప్పినట్టు చేయాలని నిశ్చయించుకున్నారు. రావణుడు వారితో లంకా నగరము రక్షణ గురించి తీసుకోవలసిన చర్యలను విపులంగా చర్చించాడు. లంకా నగరానికి పటిష్టమైన రక్షణ ఏర్పాట్లు చెయ్యమని ఆదేశించాడు. ఒక్కొక్క ద్వారము నకు ఒక్కొక్క సేనాధిపతిని నియమించాడు. తూర్పు ద్వారమునకు ప్రహస్తుని, దక్షిణ ద్వారమునకు మహోదరుని, మహా పార్శ్వుడిని, పడమటి ద్వారమునకు తన కుమారుడు ఇంద్రజిత్తును రక్షకులుగా నియమించాడు. ఉత్తర ద్వారమును శుకుడు,సారణుల సాయంతో తానే రక్షిస్తానని చెప్పాడు. విరూపాక్షుడు అనే సైన్యాధ్యక్షుని తన అపారమైన రాక్షస సేనతో మధ్య భాగంలో నిలిపాడు. ఈ విధంగా లంకా నగర రక్షణము తగిన ఏర్పాట్లు చేసిన రావణుడు, ఆ ఏర్పాట్లతో సంతృప్తి చెంది. తన అంత:పురమునకు వెళ్లిపోయాడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ముప్పది ఆరవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ముప్పది ఏడవ సర్గ.

లంకా నగరంలో రావణుని పరిస్థితి ఇలా ఉంటే, అక్కడ లంకా నగరము వెలుపల మోహరించి ఉన్న వానర సైనికుల మధ్య ఉన్న రాముడు, లక్ష్మణుడు,సుగ్రీవుడు, విభీషణుడు, హనుమంతుడు, అంగదుడు, జాంబవంతుడు, శరభుడు, సుషేణుడు, మైందుడు, ద్వివిదుడు, గజుడు, గవాక్షుడు, కుముదుడు, నలుడు, పనసుడు, ఇంకా తదితరులు కూర్చుని ఆలోచిస్తున్నారు. మనమందరమూ రావణుని చేత పరిపాలింపబడుతున్న లంకా పట్టణమును చేరుకున్నాము. తదుపరి కార్యక్రమమును గురించి ఆలోచించండి అని ఒకరితో ఒకరు అనుకొంటున్నారు.

లంకా పట్టణము గురించి బాగా తెలిసిన విభీషణుడు లేచి ఇలా అన్నాడు. “రామా! నా వెంట నా అనుచరులు నలుగురు రాక్షసులు వచ్చారు. నేను ఆ నలుగురిని లంకకు పంపాను. వారు లంకలో జరుగుతున్న విషయాలను జాగ్రత్తగా పరిశీలించి వచ్చారు. వారు పక్షిరూపములలో రాక్షస సేనలలో ప్రవేశించి వారి ప్రయత్నములు అన్నీ తెలుసుకొని వచ్చారు. రావణుడు చేయుచున్న సైనిక ఏర్పాట్లను గురించి వారు నాకు తెలిపిన విషయాలను నేను మీకు తెలియపరుస్తాను.

లంకకు నాలుగు ప్రధాన ద్వారములు కలవు. తూర్పు ద్వారమునకు ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, మహోదరుడు దక్షిణ ద్వారము వద్ద, ఇంద్రజిత్తు పశ్చిమ ద్వారము వద్ద, తమ తమ సేనలతో మోహరించి నగరమును రక్షిస్తున్నారు. రావణుడు తానే స్వయంగా ఉత్తర ద్వార పరిరక్షణ గావిస్తున్నాడు. విరూపాక్షుడు తన సైన్యములతో

నగర మధ్యమున ఉండి నగర రక్షణ చేస్తున్నాడు. రావణ సైన్యములో పదివేల మంది గజబలము, పదివేల మంది రథములను అధిష్టించిన యోధులు, రెండు వేల మంది అశ్వదళము, కోటికి పైగా సైనికులు ఉన్నారు. వీరందరికీ ఒక్కొక్క వీరునికి పది లక్షల మంది రాక్షసులు పరివారముగా ఉన్నారు. ఇదీ వీరు తెచ్చిన సమాచారము.

రామా! పూర్వము రావణుడు కుబేరుని మీదికి యుద్ధమునకు వెళ్లినపుడు అతనితో పాటు 60 లక్షల మంది రాక్షసులు వెళ్లారు. వారందరూ అధికమైన పరాక్రమవంతులే. రామా! నేను శత్రుబలములను గూర్చి ఎక్కువగా చెబుతున్నందుకు కోపించకు. ఇది కేవలము శత్రుబలముల గురించిన సమాచారము మాత్రమే. నీవు దేవ దానవులను గెలువ సమర్థుడివి. కాబట్టి మనము కూడా వానర సేనను నలుదిక్కులకు నాలుగు వ్యూహములుగా విభజించవలెను. దానికి తగిన వ్యూహములను నిర్ణయించు." అని అన్నాడు విభీషణుడు.

అప్పుడు రాముడు ఇలా అన్నాడు. "సుగ్రీవా! నీలుడు తన వానర సైన్యముతో తూర్పుదిక్కున ఉన్న ద్వారము దగ్గర ప్రహస్తుని ఎదుర్కొంటాడు. అంగదుడు తన సేనలతో దక్షిణ ద్వారమును రక్షిస్తున్న మహాపార్శ్వ మహోదరులను ఎదుర్కొంటాడు. హనుమంతుడు తన సేనలతో పడమటి ద్వారమును రక్షిస్తున్న ఇంద్రజిత్తును ఎదుర్కొంటాడు. ఇంక ఉత్తర ద్వారమును రక్షిస్తున్న రావణుని నేనే స్వయంగా ఎదుర్కొంటాను. నాకు సాయంగా లక్ష్మణుడు ఉంటాడు. మేము ఇద్దరమూ రావణుని ఓడించి ఉత్తర ద్వారము గుండా లంకలో ప్రవేశిస్తాము. సర్వసేనాని సుగ్రీవుడు, భల్లూకములకు నాయకుడు జాంబవంతుడు, విభీషణుడు సైన్యమధ్యలో

ఉండి నలుదిక్కులను రక్షిస్తూ ఉంటారు. వానరులు అందరూ కామ రూపులు. అయినా వారందరూ వానర రూపములలోనే ఉండాలి. ఎవరూ మనుష్యరూపము ధరించకూడదు. అదే మనసైన్యమునకు గుర్తు. నేను, లక్ష్మణుడు, మాత్రము మనుష్యరూపములలో ఉంటాము. విభీషణుడు, అతని అనుచరులు నలుగురు రాక్షసులైనను, వారు కూడా మనుష్యరూపములలో మా వెంట ఉంటారు. వీరు తప్ప మిగిలిన వానరులు అందరూ తమ సహజ వానరూపములలోనే ఉండవలెను. అప్పుడే మన సైన్యమును గుర్తు పట్టడానికి వీలుఅవుతుంది." అని పలికాడు రాముడు.

తరువాత రాముడు లంకలోని సైన్యమును అంతా పైనుంచి విహంగ వీక్షణము చేయవలెనని అనుకున్నాడు. అందుకని సువేల పర్వతము మీదికి ఎక్కాడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ముప్పది ఏడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ముప్పది ఎనిమిదవ సర్గ.

రాముడు లక్ష్మణునితో సహా సువేల పర్వతమును ఎక్కడానికి నిర్ణయించుకొని, సుగ్రీవుడు, విభీషణునితో ఇలా అన్నాడు. "మేము ఇద్దరమూ సువేల పర్వతమును ఎక్కి అక్కడ ఈ రాత్రికి ఉంటాము. తన చావును చేజేతులా కొనితెచ్చుకున్న రావణుని నివాసమైన లంకా నగరమును నేను లక్ష్మణుడు చూడవలెనని కుతూహలపడుతున్నాము,.

రావణుని పేరు వింటేనే నాకు ఒళ్లంతా తాపము కలుగుతూ ఉంది. వాడి ఒక్కడి మూలంగా రాక్షసజాతి యావత్తు నాశనం కాబోతోంది. ఒక్కడు చేసిన పాపమునకు రాక్షస కులము నశించడం తప్పదు." అని అన్నాడు రాముడు.

తరువాత రాముడు లక్ష్మణునితో కూడి సువేల పర్వతమును ఎక్కడం మొదలెట్టాడు. రామలక్ష్మణుల వెంట సుగ్రీవుడు, అతని మంత్రులు, విభీషణుడు కూడా వెళ్లారు. వారి వెంట హనుమంతుడు, అంగదుడు మొదలగు వానర వీరులు కూడా వెళ్లారు. అందరూ సువేల పర్వతమును ఎక్కి అక్కడి నుండి సుందరమైన కాంచన లంకను చూచారు. లంకా నగరము ప్రాకారముల మీద నల్లని శరీర ఛాయగల కొండల వంటి దేహములు గల రాక్షసులు నిలబడి ఉండటం వలన, నల్లటి రాళ్లతో మరొక ప్రాకారము కట్టారా అన్న భ్రమ కలుగుతూ ఉంది. ఆ రాక్షసులను చూచి వానరులు వింత వింత కిచ కిచ ధ్వనులు చేసారు.

అంతలోనే సూర్యాస్తమయము అయింది. రాత్రి వేళ చంద్రుడు వెన్నెల ప్రసరిస్తున్నాడు. రామలక్ష్మణులు, విభీషణుడు, సుగ్రీవుడు ఇతర వానర ప్రముఖులు ఆ రాత్రి సువేల పర్వతము మీద సుఖంగా గడిపారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ముప్పది ఎనిమిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

ముప్పది తొమ్మిదవ సర్గ.

వానర సేనలకు అధిపతులు ఆ రాత్రి సువేల పర్వతము మీద ఉండి, అక్కడి నుండి లంకా నగరాన్ని చూచారు. లంకా నగరంలో ఉన్న ఉద్యానవనములను, ఎత్తైన భవనములను, చూచారు. ఇంద్రుని రాజధాని అయిన అమరావతి వలె ప్రకాశించుచున్న లంకా నగర సౌందర్యమునకు వారంతా ఆశ్చర్యపోయారు. కొంత మంది వానరులకు లంకా నగరంలో ప్రవేశించవలెనని కోరిక కలిగింది. వారు సుగ్రీవుని అనుమతి తీసుకొని లంకా నగరం వైపుకు వెళ్లారు. ఆ వానరులు పెద్ద పెద్దగా అరుస్తూ, ఆ పర్వతము మీద ఉన్న మృగములకు ఏనుగులకు భయం కలిగిస్తూ వెళుతున్నారు. వారి అరుపులకు కేకలకు ఆ పర్వత ప్రాంతము అదిరిపోతూ ఉంది. వారి అరుపులకు క్రూరమృగములు నలుదిక్కులకు పారిపోయాయి.

సువేల పర్వతము పక్కన ఎత్తైన త్రికూట పర్వత శిఖరము ఉంది. దానిని ఎక్కడానికి ఎవరి తరమూ కాదు. ఆ త్రికూట పర్వత శిఖరము మీద లంకా నగరము నిర్మింపబడి ఉంది. ఆ లంకానగరము ఇరవై యోజనముల పొడవు, పది యోజనముల వెడల్పు కలిగి ఉంది. ఆ లంకా నగరం ఎత్తైన గోపురములు, బంగారముతోనూ వెండితోనూ కట్టబడిన ప్రాకారములతోనూ, పెద్ద పెద్ద భవనములతోనూ, ఎత్తైన ప్రాసాదములతోనూ, విమానములతోనూ, శోభిల్లుతూ ఉంది. ఆ లంకా నగరంలో వెయ్యి స్తంభముల మీద నిర్మింపబడిన చైత్య ప్రాసాదము లంకా నగరానికే అలంకారంగా నిలిచి ఉంది. లంకా నగరము అంతా బంగారుకట్టడములతో నిండి ఉండి, కాంచన లంక అనే పేరును సార్థకం చేసుకుంది.

ఆ శోభాయమానమైన లంకను దూరంనుండి చూచారు ఆ వానరులు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ముప్పది తొమ్మిదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

యుద్ధకాండము

నలుబదవ సర్గ.

(ఈ సర్గ వాల్మీకి రామాయణంలోనిది కాదని, తరువాతి కాలంలో ఎవరో ఉత్సాహవంతుడైన కవి కల్పించి చేర్చినది అనీ, ఈ సర్గ ప్రాచ్యపాఠంలో లేదని ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు గారు తమ రామాయణ మహా కావ్యము బాలనందినీ వ్యాఖ్యలో అభిప్రాయ పడ్డారు. కాబట్టి ఈ సర్గను సరదాగా చదువుకోండి. తర్కం కోసరం వెతక్కండి. ఈ నడుమ బద్రీనాద్ అనే సినిమా వచ్చింది. అందులో హీరో బద్రీనాద్‌లో ఎగిరి అమర్‌నాద్‌లో దూకి, అక్కడ కసా కసా మనుషులను నరికి మరలా అమర్‌నాద్ లో ఎగిరి బద్రీనాద్‌లో వచ్చి పడతాడు. ఇదీ అలాంటిదే! సినిమా కథలు, అందులో సంఘటనలు ఎక్కడినుంచో రాలేదు. మన పురాణాల నుంచే వచ్చాయి. పురాణాలు మనం చదవక అదేదో కొత్త సృష్టి అనుకుంటున్నాము.)

రాముడు, సుగ్రీవునితోనూ, వానర సేనాధిపతులతోనూ సువేల పర్వతము మీద ఎక్కాడు. అక్కడి నుండి అన్ని దిక్కుల వంక చూచాడు. విశాలమైన త్రికూట పర్వత శిఖరము మీద నిర్మింపబడిన లంకా నగరాన్ని

చూచాడు. దూరంగా కనిపిస్తున్న లంకా నగరంలో రావణుడు, ఎత్తైన తన మందిరం పైన కూర్చుని ఉండటం రాముడు చూచాడు. రావణుని ఇరు పక్కల సుందరీమణులునిలబడి వింజామరలు వీస్తున్నారు. రావణుని తల మీద విజయ ఛత్రము శోభాయమానంగా ప్రకాశిస్తూ ఉంది. రావణుడు ఎర్రని చందనము పూసుకొని ఉన్నాడు. ఐరావతము పొడిచిన దంతపు పోట్లు రావణుని వక్షస్థలము మీద కనిపిస్తున్నాయి. అటువంటి రావణుని సుగ్రీవుడు చూచాడు.

సుగ్రీవుని కోపం తారస్థాయికి చేరుకుంది. దిగ్గున పైకి లేచాడు. సువేల పర్వతము మీది నుండి రావణుని మందిరము మీదికి దూకాడు. రావణుని ఎదురుగా నిలబడి ఇలా అన్నాడు. "ఓరి రాక్షసాధమా! నేను ముల్లోకములకు ప్రభువైన రాముని మిత్రుడను. ఒక్క మిత్రుడనే కాదు. రాముని దాసుడను. నేను నిన్ను విడువను." అంటూ రావణుని మీదికి దూకాడు. రావణుని కిరీటము లాగి కిందపడేసాడు.

రావణుడు సుగ్రీవుని చూచి ఇలా అన్నాడు. "ఒరేయ్ వానరా! నీవు ఇప్పటిదాకా సుగ్రీవుడవే(మంచి కంఠము కలవాడివే) కాని ఇప్పటి నుండి హీనగ్రీవుడవు(కంఠము లేని వాడివి)." అంటూ రావణుడు సుగ్రీవుడిని పట్టుకొని కిందపడేసాడు. ఇద్దరూ కొట్టుకుంటున్నారు. ఇద్దరి శరీరముల నుండి చెమటలు కారుతున్నాయి. ఇద్దరి దేహముల నుండి రక్తం కారుతూ ఉంది.
(ఇంత జరుగుతున్నా రావణుని దగ్గరకూ అంగరక్షకులు ఎవరూ రాలేదు). సుగ్రీవుడు, రావణుడు ఆ గోపురము మీద ముష్టియుద్ధము చేస్తున్నారు. ఒకరిని ఒకరు కిందపడేసుకుంటున్నారు. మరలా లేస్తున్నారు. ఒకరిని ఒకరు గట్టిగా పట్టుకొని నలిపేసుకుంటున్నారు. పెద్దపులి సింహము మాదిరి

పోరాడుతున్నారు. ఒకరిని ఒకరు పట్టుకోడానికి గుండ్రంగా తిరుగుతున్నారు. మధ్యలో ఉన్న ఆహార పదార్థము కోసరం పోట్లాడే పిల్లులవలె పోట్లాడు కుంటున్నారు. (ఇందాక పెద్దపులి సింహము అన్నారు ఇప్పుడు పిల్లులు అంటున్నాడు. వాల్మీకి ఇలా రాయడు.) రావణుడు సుగ్రీవుడు మల్లయుద్ధము చేస్తున్నారు. చుట్టు తిరుగుతున్నారు. గిరగిరా తిరుగుతున్నారు. వంకర టింకరగా తిరుగుతున్నారు. ఇంతలో రావణుడు తన మాయాజాలాన్ని ప్రయోగించాడు. సుగ్రీవుడు ఈ విషయాన్ని పసికట్టాడు. రావణునికి అందకుండా ఆకాశంలోకి ఎగిరాడు. చేసేది లేక రావణుడు ఆకాశంలోకి చూస్తున్నాడు. సుగ్రీవుడు రావణుని మందిరము పైనుండి ఎగిరి సువేల పర్వత శిఖరము మీద ఉన్న రాముని ముందు దూకాడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము నలుబదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

నలుబది ఒకటవ సర్గ.

రావణునితో బాహాబాహీ యుద్ధము చేసి వచ్చిన సుగ్రీవుని రాముడు కౌగలించుకున్నాడు. “సుగ్రీవా! ఏమిటా సాహసము? నాతో ఒక్కమాట కూడా చెప్పకుండా అలా పోవడమేనా! ఇటువంటి పని చేసి నన్ను లక్ష్మణుని విభీషణుని భయపెట్టావు. నీకు ఏమవుతుందో అని మేమంతా కంగారు పడ్డాము. ఇకమీదట నాకు చెప్పకుండా ఇటువంటి సాహసము చెయ్యకు. నీకు ఏమైనా అయితే నేను లంకను జయించి సీతను పొందినా, నా పక్కన లక్ష్మణుడు, విభీషణుడు ఉన్నా ఏమి

ప్రయోజనము. నీవు తిరిగి వచ్చావు కాబట్టి సరిపోయింది. నీకు ఏదైనా జరగకూడనిది జరిగి ఉంటే నేను ఈ క్షణమే రావణుని, లంకను సర్వనాశనం చేసి ఉండేవాడిని. విభీషణుని లంకకు పట్టాభిషిక్తుని చేసి ఉండేవాడిని. తరువాత భరతునికి అయోధ్యను అప్పగించి, నీ కొరకు నేను నా ప్రాణములు త్యాగము చేసి ఉండేవాడిని. నీ బలపరాక్రమములు నాకు బాగా తెలిసినా నాకు అలా అనిపించింది. అందుకని ఇంక మీదట అటువంటి సాహసములు చెయ్యకు." అనిసున్నితంగా మందలించాడు రాముడు.

సుగ్రీవుడు రాముని చూచి ఇలా అన్నాడు. "రామా! నీ భార్యను ఎత్తుకెళ్లిన ఆ రావణుని చూచిన తరువాత నాకు కోపం ఆవేశం ఆగలేదు. అక్కడికక్కడే వాడిని చంపి సీతను తీసుకొని వద్దామనుకున్నాను. కాని నీకు నియమ భంగం అవుతుందని తిరిగి వచ్చాను." అని అన్నాడు సుగ్రీవుడు.

(ఇక్కడి దాకా ఉన్న శ్లోకములు అన్నీ తరువాత చేర్చబడ్డవి అని పండితుల అభిప్రాయము. ఎందుకంటే ఈ శ్లోకములు వాల్మీకి రామాయణం ప్రాచ్యప్రతిలో లేవు.)

సువేల పర్వతము మీద ఉన్న రాముడు లక్ష్మణుని చూచి ఇలా అన్నాడు. "లక్ష్మణా! మనం లంకా నగరాన్ని చూచాము కదా. ఇంక కిందికి వెళుతాము. లక్ష్మణా! ఇంక మనము యుద్ధమునకు సిద్ధముగా ఉండవలయును. మన వానర సైన్యమును ఫలములు, నీరు సమృద్ధిగా ఉన్న ప్రదేశములో ఉండేట్టు చూడు. లక్ష్మణా! లోక నాశనమును భయాన్ని కలిగించే దుర్నిమిత్తములు కనపడుతున్నాయి. ఈ వానర సైన్యము భల్లూక సైన్యము, రాక్షస సైన్యము అంతా సమూలంగా నశించే సూచనలు

కనపడుతున్నాయి. గాలులు తీవ్రంగా వీస్తున్నాయి. భూమి కంపిస్తూ ఉంది. పర్వతముల మీది నుండి వీచే గాలి తీవ్రంగా ధ్వని చేస్తూ ఉంది. ఆకాశంనుండి రక్త బిందువులు వర్షంలాగా కురుస్తున్నాయి. సూర్య మండలము నుండి ఉల్కాపాతం జరుగుతూ ఉంది. ఆకాశం రక్తవర్ణంలో మెరుస్తూ ఉంది. మృగములు పక్షులు సూర్యుని వంక చూస్తూ వికృతంగా అరుస్తున్నాయి. చల్లని వెన్నెల కురిపించాల్సిన చంద్రుడు రాత్రిళ్ల భయంగొల్పుతున్నాడు. సూర్యుని చుట్టు నల్లని వలయము కనపడుతూ ఉంది. నక్షత్రములు గతులు తప్పుతున్నాయి. ఈ దుశ్శకునములు అన్నీ ప్రళయ కాలాన్ని సూచిస్తున్నాయి. ఈ భూమి అంతా రక్తమయం అయే కాలం సమీపించినట్టుంది. కాని యుద్ధము తప్పదు. ఎలాజరగాలో అలా జరగాలి కదా! వానరసేనలను లంకా నగరాన్ని చుట్టుముట్టమని ఆదేశాలు ఇవ్వు. ఇంక మనము కిందికి దిగుదాము." అని అన్నాడు రాముడు.

తరువాత రాముడు లక్ష్మణుడు, సుగ్రీవునితో సహా సువేల పర్వతమును దిగాడు. సుగ్రీవునితో వానర సైన్యమును సిద్ధముగా ఉండమని ఆదేశించాడు. రాముడు తన ధనుస్సును అందుకున్నాడు. లంకా నగరం వైపు నడిచాడు. రాముని వెంట లక్ష్మణుడు, విభీషణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, జాంబవంతుడు, నలుడు,నీలుడు వెళ్లారు. వారి వెనక అపారమైన వానర సేన భల్లూక సేన నడిచింది. వానరులు భల్లూకములు తమ చేతికి ఏది అందితే అది, పెద్ద బండరాళ్లు, వృక్షములు, కొమ్మలు, పట్టుకొని ఉత్సాహంగా నడుస్తున్నారు. అందరూ లంకా నగరాన్ని సమీపించారు. వానర సేనలు లంకా నగరాన్ని చుట్టుముట్టారు.

రాముడు లక్ష్మణునితో సహా ఉత్తర ద్వారము వద్ద నిలిచి లోపలి వారు బయటకు రాకుండా అడ్డుకుంటున్నాడు. రాముని వెంట లక్షలాది

వానరులు నిలిచి ఉన్నారు.

నీలుడు, మైందుడు, ద్వివిదుడు తమతమ సేనలతో తూర్పు ద్వారమును ముట్టడించారు. అంగదుడు, గవాక్షుడు, గజుడు, గవయుడు దక్షిణ ద్వారము చేరుకున్నారు. హనుమంతుడు తన వానర సేనలతో పడమటి ద్వారము వద్ద నిలిచి ఉన్నాడు. సుగ్రీవుడు తన వానర సేనలతో సేనామధ్యంలో నిలిచి ఉన్నాడు. సుగ్రీవుని వెంట ముప్పది ఆరు కోట్ల సైనికులు నిలిచి ఉన్నారు. లక్ష్మణుడు, విభీషణుడు ఒక్కొక్క ద్వారము వద్ద కోటి మంది సైనికులను నిలిపారు. సుషేణుడు, జాంబవంతుడు తమ తమ సైన్యములతో రామునికి పడమటి దిశగా నిలబడి ఉన్నారు. వానరులు అందరూ ఆ అడవిలో ఉన్న పెద్ద పెద్ద వృక్షములను పెకలించి ఆయుధములు గా ధరించి ఉన్నారు. వారికి సహజంగా చేతి వేళ్లు, గోళ్లు, కోరలు ఆయుధములుగా ఉన్నాయి. ఆ వానరులు ఒక్కొక్కరు, పది ఏనుగులు, నూరు ఏనుగులు, వెయ్యి ఏనుగులు బలము కలవారు. ఆ వానర సైన్యమును చేస్తుంటే మిడతల దండు లంకమీద దాడి చేసిందా అన్నట్టు కనపడుతూ ఉంది.

అప్పటికి కొంత మంది వానరులు లంక చుట్టు చేరారు. కొంతమంది చేరుతున్నారు. ఒక్కొక్క యూధములో కోటి మంది వానరులు, కోటి మంది భల్లూకములు లంకకు అన్ని వైపులా నిలిచి ఉన్నాయి. వారంతా కట్టలు తెంచుకున్న సముద్రంలా లంక మీద విరుచుకుపడుతున్నారు. ఆ వానరులు అరిచే అరుపులకు, చేసే శబ్దాలకు లంకా నగరం అదిరిపోతూ ఉంది.

తరువాత రాముడు వానర మంత్రులను సేనాధి పతులను సమావేశ పరిచాడు. బాగా ఆలోచించాడు. రాజ ధర్మము ప్రకారము యుద్ధమునకు ఉపక్రమించే ముందు రావణుని వద్దకు ఒక రాయబారిని పంపడానికి నిశ్చయించుకున్నాడు. ఎవరిని రాయబారిగా పంపాలా అని విభీషణుని సలహా అడిగాడు. విభీషణుడు అంగదుని పంపమని సలహా ఇచ్చాడు. రాముడు అంగదుని పిలిచి ఇలా అన్నాడు.

“ఓ అంగదా! నీవు లంకా నగరమునకు పోయి, రావణుని సముఖమున నిలిచి ఏ భయమూ లేకుండా నేను చెప్పిన మాటలను యధాతథంగా రావణునితో చెప్పు.

“ఓరావణా! నీవు లంకా నగరానికి రాజువు. కాని మదంతో కళ్లు మూసుకు పోయి ఋషులను, మునులను, దేవతలను, గంధర్వులను, అప్సరసలను, నాగజాతిని, యక్షులను, భూలోకములో ఉన్న క్షత్రియులను నానా బాధలు పెట్టావు. పాపం మూటగట్టుకున్నావు. ఆ పాపఫలమును ఇప్పుడు అనుభవించబోతున్నావు. బ్రహ్మ దేవుడు నీకు ఇచ్చిన వర గర్వంతో విర్రవీగిన నీకు అదే వరము నీ నాశనానికి కారణం అయింది. అకారణంగా నా భార్యను నీవు అపహరించావు. ఆ తప్పుకు నీకు తగిన దండన విధించాల్సి ఉంది. నిన్ను శిక్షించుటకు నేను లంకకు వచ్చి లంకా నగర ద్వారము వద్ద నిలిచి ఉన్నాను. నీవు ఇప్పటిదాకా చంపిన వారు ఏ మార్గంలో వెళ్లారో అదే మార్గంలో వెళ్లడానికి సిద్ధంగా ఉండు. నువ్వు ఏ బలం ఏ శక్తి ఏ పరాక్రమము చూచుకొని నేను ఇంటలేని సమయంలో నా భార్యను అపహరించావో, ఆ బలపరాక్రమములు ఇప్పుడు చూపించు.

నీకు చివరి అవకాశము ఇస్తున్నాను. నీవు నా వద్దకు వచ్చి నా సీతను నాకు అప్పగించి నా శరణు వేడితే నేను నిన్ను క్షమించి వదిలిపెడతాను. లేకపోతే ఈ లోకంలో రాక్షసుడు అనే జాతి లేకుండా నాశనం చేస్తాను. నీ తమ్ముడు విభీషణుడు నా దగ్గరే ఉన్నాడు. నిన్ను చంపి విభీషణుని లంకా రాజ్యమునకు పట్టాభిషిక్తుని చేయుటకు నిశ్చయించుకున్నాను. ఇంక మీదట నీవు లంకా రాజ్యమును పాలించే అర్హతను కోల్పోయావు. ఎందుకంటే నీ మంత్రులు నిన్ను సన్మార్గంలో నడపడం లేదు. నీకు ఆత్మనిగ్రహము, మనోనిగ్రహము లేదు. అటువంటి వాడు రాజుగా ఉండతగడు. నీకు నన్ను శరణుకోరడానికి ఇష్టం లేని పక్షంలో నాతో యుద్ధం చేసి వీరస్వర్గము పొందు. నీవు ముల్లోకములు తిరిగినను నా బాణముల బారి నుండి తప్పించుకోలేవు. నీకు మరణము తథ్యము. కాబట్టి నీవు బతికి ఉండగానే నీ శ్రాద్ధకర్మలు జరిపించుకో. నీవు చచ్చిన తరువాత నీకు అపర కర్మలు జరిపించడానికి ఎవరూ ఉండరు. నీ వారందరినీ ఒక్కసారి తనివిదీరా చూచుకో. చావడానికి సిద్ధంగా ఉండు."

అంగదా ఈ మాటలు నా మాటలుగా రావణునితో చెప్పు." అని అన్నాడు రాముడు.

అంగదుడు రాముడి మాటలను శిరసావహించాడు. వెంటనే ఎగిరి లంకా నగరంలో రాముని సభాభవనమునకు చేరుకున్నాడు. సభాభవనంలోకి ప్రవేశించాడు. ఆ సమయంలో రావణుడు తన మంత్రులతో సేనానాయకులతో సభతీర్చి యుద్ధవిషయములను గురించి చర్చిస్తున్నాడు. అంగదుడు వెళ్లి రావణుని దగ్గరగా నిలబడ్డాడు.

"ఓ రావణా! నేను వాలి పుత్రుడను. నా పేరు అంగదుడు. రాముని దూతగా నీ వద్దకు వచ్చాను. రాముని గురించి నీవు విని ఉంటావు. ఆ రాముని భార్యను నీవు దొంగతనంగా అపహరించి తీసుకొని వచ్చావు. ఆ రాముడు ఇప్పుడు లంకకు వచ్చి లంకా నగర ద్వారము వద్ద నిలిచి ఉన్నాడు. ఆ రాముడు నీతో చెప్పమన్న మాటలను చెబుతున్నాను. సావధానంగా ఆలకించు.

"ఓ రావణా! నీవు లంకానగరం బయటకు వచ్చి నాతో యుద్ధం చేయి. నీ పరాక్రమాన్ని చూపించు. నిన్ను బంధు, మిత్ర, సపరివార సమేతంగా యుద్ధంలో చంపుతాను మూడు లోకాలకు రాక్షస బాధ లేకుండా చేస్తాను. నువ్వు ఇప్పటిదాకా, ఋషులకు, దేవ, దానవ, గంధర్వ, నాగ,యక్షులకు ఎన్నో కష్టములు కలుగచేసావు. ఆ పాపాలకు ఫలితం అనుభవించే కాలం వచ్చింది. నీవు వెంటనే సీతను తీసుకొని వచ్చి నాకు అప్పగించకపోతే, నీకు సర్వనాశనం తప్పదు. నీ రాజ్యము విభీషణునికి ఇవ్వక తప్పదు." అని అంగదుడు రాముని చెప్పిన మాటలను రావణునితో చెప్పాడు.

అంగదుడు చెప్పిన ఒక్కొక్క మాటా రావణుని హృదయంలో బాణాల్లా గుచ్చుకున్నాయి. "ఆ కోతిని పట్టుకోండి చంపండి." అని పెద్దగా అరిచాడు రావణుడు. వెంటనే అక్కడ ఉన్న రాక్షసులు అంగదుని గట్టిగా పట్టుకున్నారు. అంగదుడు వారితో గొడవ పడటం ఇష్టం లేక వారికి లొంగిపోయాడు. రావణుడు అంగదుని చంపమని ఆదేశించాడు. అంగదునికి కోపం వచ్చింది. తనను పట్టుకున్న రాక్షసులను పురుగులను విదిలించినట్టు విదిలించాడు. ఆకాశంలోకి ఎగిరాడు. అంగదుని పట్టుకున్న రాక్షసులు నేలమీద పడ్డారు. తరువాత అంగదుడు రావణుని సభాభవనము

మీద ఉన్న శిఖరము మీదికి ఎక్కాడు. అంగదుని వేగానికి ఆ శిఖరము కూలిపోయింది. అంగదుడు అక్కడినుండి ఆకాశంలోకి ఎగిరాడు. లంకను దాటి రాముని వద్దకు వెళ్లాడు. రాముని ముందు నిలబడ్డాడు.

తన సభాభవన ప్రాసాదము పైన ఉన్న శిఖరము కూలిపోవడం చూచి రావణుడు మనసులో కలత చెందాడు. రావణుని ప్రతి చర్య అంగదుని వల్ల విన్న రాముడు ఇంక యుద్ధము అనివార్యము అనుకున్నాడు. సుగ్రీవుడు లంకా ద్వారములను అన్నింటినీ ముట్టడించమని సుషేణుని ఆదేశించాడు. సుషేణుని ఆజ్ఞప్రకారము, వానరులు లంకకు ఉన్న నాలుగు ద్వారములు బంధించారు. సముద్రములో ఉప్పెనలా కదిలివస్తున్న వానరసేనలను చూచి రాక్షసులు భయంతో వణికిపోయారు. అప్పటి దాకా తమను చూచి భయపడే దేవతలను, గంధర్వులను, యక్షులను చూచారు గానీ, తమమీదికి ఉత్సాహంతో ఉరకలు వేస్తూ వస్తున్న వానరులను చూడ్డం ఇదే వారికి ప్రథమం. ఆ వానరుల గంభీర గర్జనలకు రాక్షసులు హాహాకారాలు చేసారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము నలుబది ఒకటవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

నలుబది రెండవ సర్గ.

లంకా నగర ద్వారములను రక్షిస్తున్న సైనికులు పరుగుపరుగున రావణుని వద్దకు వెళ్లి వానర సేనలు లంకను ముట్టడించినవని తెలియజేసారు. వెంటనే రావణుడు నగర రక్షణకు తగిన ఏర్పాట్లు చేసాడు. ప్రాకారము మీదికి ఎక్కి వానరసైన్యమును చూచాడు. లంకా నగరమును చుట్టుముట్టిన వానర సేనలను చూచాడు రావణుడు. ఈ వానర సైన్యమును ఎలా జయించడమా అని ఆలోచనలో పడ్డాడు రావణుడు. అంతలోనే ధైర్యము తెచ్చుకున్నాడు. సకల ఆయుధములతో సుశిక్షుతులైన రాక్షసుల ముందర కేవలము రాళ్లు, కొమ్మలతో యుద్ధము చేసే వానరులు నిలబడలేరు అని ధీమాతో ఉన్నాడు రావణుడు.

వానర సైన్యమునకు సూచనలు ఇస్తున్న రాముని చూచాడు రావణుడు. రాముడు కూడా రాక్షస సైన్యములతో రక్షింపబడుతున్న లంకను తేరిపార చూచాడు. లంకను చూడగానే అందులో ఉన్న సీత గుర్తుకు వచ్చింది రామునికి. నా కొరకు కదా సీత కటిక నేల మీద నిద్రిస్తూ రాక్షసుల చెరలో ఉన్నది అని దు:ఖపడసాగాడు రాముడు. అంతలోనే తేరుకున్నాడు రాముడు. కర్తవ్యమును స్మరించుకున్నాడు. వానరులకు యుద్ధము గురించి సూచనలు అందజేస్తున్నాడు.

రాముని అనుజ్ఞ కాగానే వానరులందరూ దిక్కులు పిక్కటిల్లేటట్టు సింహనాదము చేసారు. లంకానగరమును నేలమట్టం చేస్తాము అని రంకెలు వేయసాగారు. వానరులందరూ చేతికి అందిన పెద్ద పెద్ద వృక్షములు, బండలు, శిఖరములు పెకలించి ఆయుధములుగా

చేత ధరించి ఉన్నారు. వానరు లందరూ లంక వైపు దూసుకుపోతున్నారు. ప్రాకారములను, నగర ముఖద్వారములను చేతులతోనూ వృక్షములతోనూ బండరాళ్లతోనూ పగలగొడుతున్నారు. ప్రాకారము చుట్టు ఉన్న కందకము లను చెట్లతోనూ బండలతోనూ మట్టితోనూ పూడ్చారు. వానరులు అందరూ లంకా నగరంలోకి చొచ్చుకుపోసాగారు. లంకలోని బంగారు ముఖ ద్వారములను పగులగొడుతున్నారు. ప్రాసాదములను, వాటి మీద ఉన్న శిఖరములను, గోపురములను నేలమట్టం చేస్తున్నారు. ఆ వానరులు ఎగురుతూ దుముకుతూ అరుస్తూ నగరములోకి ప్రవేశిస్తున్నారు.

వానర వీరులలో వీరబాహుడు, సుబాహుడు, నలుడు, పనసుడు అనే నలుగురు సైన్యాధిపతులు లంకా నగర ప్రాకారమును ఆక్రమించారు. కుముదుడు అనే సేనానాయకుడు తన సైన్యముతో లంకా నగరమునకు ఆగ్నేయభాగమున ఉన్న ప్రాకారమును ఆక్రమించాడు. కుముదునికి సాయంగా ప్రసభుడు, పనసుడు తమ తమ సేనలతో నిలబడ్డారు. మహావీరుడైన శతబలి ఇరువది కోట్ల వానరులతో దక్షిణ ద్వారమును, నైరుతి దిక్కున ఉన్న ప్రాకారమును అడ్డుకున్నాడు. తార తండ్రి సుషేణుడు నైరుతి ద్వారమును కోటి కోట్ల వానరములతో ఆక్రమించాడు. రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు ఉత్తర ద్వారమును ఆక్రమించారు. మహాపరాక్రమ శాలి అయిన ధూమ్రుడు రామునికి సాయంగా రాముని పక్కనే కోటి భల్లూక సేనతో నిలిచి ఉన్నాడు. గదాధారి అయిన విభీషణుడు కూడా రామునికి అండగా ఉత్తర ద్వారము వద్ద నిలబడి ఉన్నాడు. వానర శ్రేష్టులైన గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు నలువైపులా తిరుగుతూ సేనలను పర్యవేక్షిస్తున్నారు.

వానర సైన్యము లంకను నలువైపుల నుండి ముట్టడించడం చూచి రావణుడు కోపంతో ఊగి పోయాడు. తనసేనలకు వానరులను అడ్డుకొమ్మని ఆదేశాలు ఇచ్చాడు. రావణుని ఆదేశములను విన్న రాక్షసులు భయంకరంగా అరుస్తున్నారు. కేకలు వేసారు. రణభేరులను దిక్కులు మార్మోగేట్టు మోగించారు. వేల కొలది శంఖములను ఒక్కసారి పూరించారు. రాక్షస సేనలు వానరులతో యుద్ధమునకు బయలుదేరాయి. లంకా నగరము బయట వానర సేనలు లంకా నగరము లోపల రాక్షస సేనలు చేస్తున్న సింహనాదములతో మలయ పర్వతము మార్మోగిపోయింది. భేరీనినాదాలు, శంఖధ్వనులు, గజసేనలఘీంకారాలు, అశ్వముల సకిలింపులు, రధచక్రములు చేయు ధ్వనులు పదాతి దళములు అరిచే అరుపులతో లంకానగరము హోరెత్తిపోయింది.

వానర రాక్షస యుద్ధము దేవాసుర యుద్ధమును తలపిస్తూ ఉంది. రాక్షసులు వానరులను గొడ్డళ్లతోనూ. కత్తులతోనూ శూలముల తోనూ, గదలతోనూ శక్తిఆయుధముల తోనూ కొడుతున్నారు. దానికి ప్రతిగా వానరులు రాక్షసుల మీద పెద్ద పెద్ద బండ రాళ్లవర్షము కురిపిస్తున్నారు. ఒక్కొక్కక వానరుడు పర్వతశిఖరములను పెద్ద పెద్ద వృక్షములను పెళ్లగించి తెచ్చి రాక్షసుల మీద పడవేస్తున్నారు. ప్రాకారము మీద నిలబడ్డ రాక్షస వీరులు రావణునికి జయజయధ్వానాలు పలుకుతూ వానరులను చించి చెండాడుతున్నారు. దానికి కోపించిన వానరులు ప్రాకారముల మీదికి ఎగిరి అక్కడ నిలబడి ఉన్న రాక్షసులను తమ వాడి గోళ్లతో చీలుస్తున్నారు. ఆ విధంగా జరుగుతున్న యుద్ధములో రాక్షసుల, వానరుల రక్తముతో తడిసి నేల అంతా బురద బురద అయింది.

శ్రీమద్రామాయణము యుద్ధకాండము నలుబది రెండవ సర్గ
సంపూర్ణము ఓం తత్సత్. ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

నలుబది మూడవ సర్గ.

ఆ ప్రకారంగా వానరులకు రాక్షసులకు ఘోరంగా యుద్ధం జరుగుతూ ఉంది. రాక్షస సేనలో ఉన్న రాక్షసులకు గుర్రములు, ఏనుగులు, రథములు, కవచములు ఉన్నాయి. కాని వానరములకు ఇవేమీ లేవు. వారికి సహజమైన గోళ్లు కోరలు ఉన్నాయి. తరువాత పెద్ద పెద్ద బండరాళ్లు, వృక్షములు, వారి ఆయుధములు. వానరులు రాక్షసులు ముఖాముఖి పోరాడుతున్నారు.ఒకరితో ఒకరు ద్వంద్వయుద్ధము చేస్తున్నారు.

అంగదునితో అంధకాసురుడు అనే వాడు ద్వంద్వయుద్ధము చేస్తున్నాడు. సంపాతి అనే వానరుడు ప్రజంఘుడు అనే రాక్షసుడితోయుద్ధం చేస్తున్నాడు. హనుమంతుడు జంబుమాలితో యుద్ధం చేస్తున్నాడు. విభీషణుడు శత్రుఘ్నుడు అనే రాక్షస వీరునితో యుద్ధము చేస్తున్నాడు. గజుడు అనే వానర వీరుడు తపసుడు అనే రాక్షస వీరునితో యుద్ధం చేస్తున్నాడు. నీలుడు అనే వానర వీరుడు నికుంభుడు అనే రాక్షస వీరునితో యుద్ధం చేస్తున్నాడు. సుగ్రీవునితో ప్రఘసుడు, లక్ష్మణునితో విరూపాక్షుడు అనే రాక్షసుడు యుద్ధం చేస్తున్నాడు. అగ్నికేతువు, రశ్మికేతువు, మిత్రఘ్నుడు, యజ్ఞకోపుడు అనే రాక్షసులు ఒక్కుమ్మడిగా రామునితో యుద్ధానికి తలపడ్డారు. మైందుడు అనే వానర శ్రేష్టునితో వజ్రముష్టి అనే రాక్షసుడు, ద్వివిదుడు అనే వానరునితో అశనిప్రభుడు అనే రాక్షసుడు యుద్ధం చేస్తున్నారు. ప్రతపనుడు అనే రాక్షస వీరుడు నలునితో యుద్ధం చేస్తున్నాడు. సుషేణుడు అనే వానర వీరుడు విద్యున్మాలితో యుద్ధం చేస్తున్నాడు.

వీరు కాకుండా మిగిలిన వానరులు కూడా ఒక్కొక్క రాక్షసునితో ద్వంద్వయుద్ధము చేస్తున్నారు. రాక్షసులు వానరుల మధ్య ఆ విధంగా యుద్ధం జరుగుతూ ఉంది. రాక్షసులు, వానరుల శరీరముల నుండి కారుతున్న రక్తము ఏరుటై ప్రవహిస్తుంటే, ఆ రక్తప్రవాహంలో రాక్షసుల, వానరుల శరీరాలు కొట్టుకుపోతున్నాయి.

ఇంద్రజిత్తు తన గదతీసుకొని అంగదుని కొట్టాడు. అంగదుడు ఆ వేటును తప్పుకొని, ఇంద్రజిత్తు రథమును విరిచాడు. రథమునకు కట్టిన గుర్రములను, రథసారథికి చంపాడు. జంబుమాలి తన రథము మీద నిలబడి యుద్ధము చేస్తున్నాడు. జంబుమాలి శక్తి అనే ఆయుధముతో హనుమంతుని వక్షస్థము పగిలేటట్టు కొట్టాడు. వెంటనే హనుమంతుడు ఒక్క ఎగురు ఎగిరి జంబుమాలి రథము మీద ఎక్కి, రథసారథిని చంపాడు. రథాన్ని విరిచాడు. తన అరిచేత్తో జంబుమాలిని ఒక్క చరుపు చరిచాడు. ఆ దెబ్బకు జంబుమాలి రక్తం కక్కుకొని చచ్చాడు.

రాక్షసవీరుడైన ప్రతపనుడు పెద్దగా గర్జిస్తూ నలుని మీదికి పరుగెత్తాడు. అప్పుడు నలుడు ప్రతపనుడి కళ్లు పొడిచాడు. ప్రఘసుడుఅనే రాక్షసవీరుడు వాడి అయిన బాణములతో సుగ్రీవుని శరీరం అంతా కొట్టాడు. సుగ్రీవుడు ఒక వృక్షమును పెకల్చి ఆ రాక్షసుడు మీదికి విసిరాడు. ఆ వృక్షము కిందపడి ప్రఘసుడు మరణించాడు. లక్ష్మణుడు ఒకేఒక్క బాణంతో విరూపాక్షుడు అనే రాక్షసుని యమపురికి పంపాడు. తమ తమ బాణ పరంపరలతో అగ్నికేతువు, రశ్మికేతువు, మిత్రఘ్నుడు, యజ్ఞకోపుడు అనే రాక్షసులు రాముడిని కొట్టారు. దానికి బదులుగా రాముడు ఆ నలుగురురాక్షసుల శిరస్సులను నాలుగు శరాఘాతములతో ఛేదించాడు.

మైందుడు అనే వానరుడు తన పిడికిలితో వజ్రముష్టి అనే రాక్షసుడు కూలదోసాడు. నికుంభుడు అనే రాక్షసుడు నీలుడు అనే వానర వీరుడిని తన బాణములతో కొట్టాడు. అంతే కాకుండా నీలుడి మీద నూరు బాణములను ప్రయోగించి అట్టహాసంగా అరిచాడు. నీలుడు నికుంభుని రథమును విరిచి, ఆ రథచక్రముతోనే నికుంభుని, అతని రథసారథిని చంపాడు. ద్వివిదుడు అనే వానర ప్రముఖుడు ఒక పెద్ద పర్వత శిఖరముతో అశనిప్రభుడు అనే రాక్షసుని కొట్టాడు. అప్పుడు ఆ రాక్షసుడు తన బాణములతో ద్వివిదుని కొట్టాడు. ద్వివిదుడు ఒక పెద్ద వృక్షమును పెకలించి ఆ వృక్షముతో ద్వివిదుని రథమును విరిచి, రథసారథిని, రథమునకు కట్టిన గుర్రములను చంపాడు. తరువాత అదే వృక్షముతో అశనిప్రభుణ్ణి కూడాచంపాడు.

విద్యున్మాలి అనే రాక్షస వీరుడు తన రథము మీది నుండి సుషేణుడి మీద బాణవర్షము కురిపించాడు. సుషేణుడు ఒక పెద్ద పర్వత శిఖరము తీసుకొని దానితో విద్యున్మాలి రథమును విరిచాడు. అప్పుడు విద్యున్మాలి రథమునుండి కిందికి దూకి, గదాయుధము తీసుకున్నాడు. సుషేణుడు ఒక పెద్ద బండరాయిని తీసుకొని విద్యున్మాలి మీదికి వెళ్లాడు. విద్యున్మాలి తన గదతో సుషేణుడి గుండెల మీద కొట్టాడు. సుషేణుడు ఆ గదాఘాతమును లక్ష్యపెట్టక, తన చేతిలోని బండరాయితో విద్యున్మాలి గుండెల మీద మోదాడు. ఆ బండరాయి మీద పడగానే విద్యున్మాలి కింద పడ్డాడు. ఆ రాతి కిందపడి నలిగిపోయి మరణించాడు.

ఆ ప్రకారంగా వానరులు, రాక్షసులు దేవ దానవుల మాదిరి యుద్ధం చేసుకుంటున్నారు. రణరంగం అంతా వానరులు, రాక్షసుల మృత

దేహాలతో నిండి పోయింది. ఆ రణరంగంలో చచ్చి పడిన మృతదేహము లను తినడానికి నక్కలు, తోడేళ్లు గుంపుగుంపులుగా వస్తున్నాయి. ఇంతలో సూర్యాస్తమయము అయింది.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము నలుబది మూడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

నలుబది నాలుగవ సర్గ.

ఆ ప్రకారంగా వానరులకు రాక్షసులకు ఘోరంగా యుద్ధం జరుగుతున్న సమయంలో సూర్యుడు అస్తమించాడు. సాధారణంగా మానవులు రాత్రిళ్లు యుద్ధం చేయరు. కానీ, వానరులు రాక్షసులు రాత్రియుద్ధానికి సంసిద్ధం అయ్యారు. రాత్రి సమయంలో గాఢంగా చీకటి అలుముకుంది. ఆ చీకట్లో ఎవరెవరో కనిపించడం లేదు. అందుకని రాక్షసులు ఎదుటి వాడు వానరుడని " నువ్వు వానరుడవు చావు" అంటూ చంపుతున్నారు. అలాగే వానరులు కూడా "నువ్వు రాక్షసుడవు చావు" అంటూ చంపుతున్నారు. కాని ,చీకట్లో ఎవరెవరో గుర్తు తెలియక, రాక్షసులు రాక్షసులను, వానరులు వానరులను, వారిని వారే చంపుకుంటున్నారు అన్న సంగతి వారికి తెలియదు. ఎంత సేపటికీ చంపు, కొట్టు, పారిపోకు, నిలువు అంటూ అరుపులు కేకలు వినబడుతున్నాయి.

రాక్షసులు నల్లగా ఉండి చీకట్లో కలిసిపోతున్నారు. వారు ధరించిన బంగారు కవచములు మాత్రం తళా తళా మెరుస్తున్నాయి.

కవచాలు అటు ఇటు తిరుగుతున్నాయా అన్నట్టు ఉంది ఆ యుద్ధభూమిలో. ఇంతలో కొంతమంది రాక్షసులు వానరులపై బడి వారిని చంపి తినసాగారు. ఇది చూచిన వానరులు రాక్షసులపైబడి వారిని చీలుస్తున్నారు, వారు ఎక్కిన గుర్రములను ఏనుగులను చంపుతున్నారు. ఆ దెబ్బకు రాక్షస సైన్యము కకావికలైంది. ఏనుగులను హయములను వానరులు తమ గోళ్లతో చీలుస్తూ, పళ్లతో కొరుకుతుంటే అవి కుయ్యోమని అరుస్తూ ఇష్టం వచ్చినట్టు పరుగెడుతున్నాయి. రాముడు లక్ష్మణుడు తమ బాణములతో రాక్షసులను విచక్షణా రహితంగా చంపుతున్నారు. అటు రాక్షసులు, ఇటు వానరులు యుద్ధములో మరణించగా వారి శరీరముల నుండి కారిన రక్తము వరదగా ప్రవహిస్తూ ఉంది. ఎవరికి వారు తాము గెలిచామని భేరీలు, మృదంగములు, పణవములు వాయిస్తున్నారు. శంఖములు ఊదుతున్నారు. ఆ రాత్రి అంతా వానరులు రాక్షసులు ఒకరిని ఒకరు, తమలో తాము, తమవారిని తామే చంపుకుంటున్నారు.

అంతటి చీకట్లో కూడా కొంత మంది రాక్షసులు తమ బాణములను రాముని మీద ప్రయోగించారు. రాముడు కోపించి వాడి అయిన ఆరు బాణములతో ఆ రాక్షసులను కొట్టాడు. యజ్ఞశత్రువు, మహాపార్శ్వుడు, మహోదరుడు, వజ్రదంష్ట్రుడు, శుకుడు, సారణులు అనే ఆ రాక్షసులు రాముని బాణముల దెబ్బలు తిని బతకాలని ఆశతో యుద్ధరంగము నుండి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు. రాముడు అంతటితో ఊరుకోకుండా అగ్నిజ్వాలల వంటి తన బాణములతో రాక్షససేనలను సర్వనాశనం చేసాడు. రాముడికి ఎదురుగా వచ్చిన ఏ రాక్షసుడూ ప్రాణాలతో బయటపడలేదు. ఆ చీకట్లో రామ బాణములు ఎగురుతూ వచ్చి రాక్షసులను చంపుతుంటే, కాళరాత్రిలో మిణుగురు పురుగులు ఎగురుతున్నట్టు ఉంది.

మహా పరాక్రమ వంతుడైన రావణ కుమారుడు ఇంద్రజిత్తును అంగదుడు ఎదిరించాడు. అంగదుడు ఇంద్రజిత్తు ఎక్కిన రథమును విరుగగొట్టాడు, రథ సారథిని, అశ్వములను చంపాడు. చేసేది లేక ఇంద్రజిత్తు తనమాయచే అంతర్ధానముచెంది యుద్ధభూమి నుండి పారిపోయాడు. ఇంద్రజిత్తును చిత్తు చేసిన అంగదుని రామలక్ష్మణులు, విభీషణుడు ప్రశంసించారు. ఇంద్రజిత్తు లాంటి వాడిని ఓడించిన అంగదుని వానరవీరులందరూ పొగిడారు.

ఒక వానరుని చేతిలో ఓడిపోయిన ఇంద్రజిత్తు కోపంతో ఊగిపోయాడు. అతడు మాయా యుద్ధం చేయడం మొదలెట్టాడు. ఎవరికీ కనపడకుండూ వానరుల మీద బాణ వర్షము కురిపిస్తున్నాడు. ఘోరమైన విషసర్పములు ఆవాహనము చేయబడిన ఇంద్రజిత్తు బాణములు వానరులను, రామలక్ష్మణులను బాధించాయి. వారి చర్మాన్ని చీల్చాయి. ఇంద్రజిత్తు ఎవరికీ కనపడకపోవడం వల్ల అతని మీద బాణములు వదలడం వీలు కావడం లేదు. ఈ లోపల ఇంద్రజిత్తు తన సర్పశరములతో రామలక్ష్మణులను బంధించాడు. రామలక్ష్మణులను ఎదురుగా నిలబడి యుద్ధం చేసే శక్తి లేక, ఇంద్రజిత్తు, మాయా యుద్ధంలో రామలక్ష్మణులను తన సర్పశరములతో బంధించాడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము నలుబది నాలుగవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

నలుబది ఐదవ సర్గ.

తనతో యుద్ధమే చేసి పారిపోయిన ఇంద్రజిత్తును జాడ తెలుసుకొని రమ్మని పదిమంది వానరులను పంపాడు రాముడు. రాముని ఆజ్ఞ మేరకు సుషేణుని కుమారులు ఇద్దరు, నీలుడు, అంగదుడు, శరభుడు, ద్వివిదుడు, హనుమంతుడు, సానుప్రస్థుడు, ఋషభుడు, ఋషభస్కంధుడు ఇంద్రజిత్తును వెదుకడానికి వెళ్లారు. వారు పెద్ద పెద్ద వృక్షములను ఆయుధములుగా ధరించి నలుదిక్కులు వెదుకుతూ ఆకాశంలోకి ప్రవేశించారు. కాని వారికి ఇంద్రజిత్తు కనపడలేదు. కాని ఇంద్రజిత్తు ప్రయోగించిన నారాచబాణములు ఆ వానరులను గాయపరచసాగాయి. అసలే చీకటి. అందులో ఇంద్రజిత్తు మాయావి. మాయా యుద్ధము చేస్తున్నాడు.

తరువాత ఇంద్రజిత్తు ఈ వానరులను వదిలి తన బాణములను రాముని మీద లక్ష్మణుని మీద ప్రయోగించాడు. రామలక్ష్మణుల శరీరములలో గుచ్చుకొనేటట్టు సర్పరూపబాణములు ప్రయోగించాడు ఇంద్రజిత్తు. రామలక్ష్మణుల శరీరాలు ఇంద్రజిత్తు కొట్టిన బాణములతో నిండిపోయాయి. ఇంద్రజిత్తు రామలక్ష్మణులతో వారికి కనపడకుండా ఇలా అన్నాడు. “ఓ నరులారా! నేను మాయాయుద్ధము చేస్తుంటే సాక్షాత్తు దేవేంద్రుడు కూడా తట్టుకోలేడు. ఇంక మానవులు మీరెంత? మీరు నా ముందు నిలువలేరు. ఇప్పుడే మీ ఇద్దరినీ నా బాణములతో కొట్టి యమపురికి పంపుతాను.” అని పలికిన ఇంద్రజిత్తు వాడి అయిన బాణములతో రామలక్ష్మణులతో మర్మస్థానములలో కొట్టాడు. రామ లక్ష్మణులను శరబంధనము చేసాడు ఇంద్రజిత్తు. తరువాత సింహనాదము చేసాడు.

రామలక్ష్మణుల దేహములు ఇంద్రజిత్తు ప్రయోగించిన సర్ప బాణములతో కప్పబడి పోయింది. రామలక్ష్మణులు నేల మీదికి ఒరిగిపోయారు. రామలక్ష్మణుల శరీరంలో బాణములు గుచ్చుకోని ప్రదేశము అంగుళము మాత్రము కూడా లేదు. ఇంద్రజిత్తు రామలక్ష్మణుల శరీరాలు తూట్లుపడేటట్టు కొట్టాడు. రామలక్ష్మణుల శరీరములలో నుండి రక్తము ధారగా ప్రవహిస్తూ ఉంది. రాముడు కింద పడి పోయిన తరువాత కూడా ఇంద్రజిత్తు రాముని నారాచములు, అర్ధనారాచములు, భల్లములు, అంజలికములు, వత్సదంతములు, సింహదంష్ట్రములు, క్షురములు అనే బాణములతో కొట్టాడు. ఆ బాణముల దెబ్బలకు రాముడు కిందపడపడగానే రాముని చేతిలోని విల్లు కూడా ఎగిరి అల్లంతదూరంలో పడింది. రాముడు వీరశయనము అలంకరించాడు.

రాముడు పడిపోవడం చూచి లక్ష్మణుడు దు:ఖించాడు. రామలక్ష్మణులకు పట్టిన దుస్థితి చూచి వానర సేనానాయకులు శోకించ సాగారు. అందరూ పెద్దగా ఏడుస్తున్నారు. హనుమంతుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు మొదలగు వానరవీరులు రామలక్ష్మణుల చుట్టు నిలబడి శోకిస్తున్నారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము నలుబది ఐదవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

యుద్ధకాండము

నలుబది ఆరవ సర్గ.

ఒళ్లంతా బాణము దెబ్బలతో పడి ఉన్న రామలక్ష్మణులను చూచిన వానరులకు ఏమి చెయ్యాలో తోచడం లేదు. రామలక్ష్మణులను పడగొట్టి ఇంద్రజిత్తు వెళ్లిపోయిన తరువాత సుగ్రీవుడు, విభీషణుడు అక్కడకు వచ్చారు. వారు రామలక్ష్మణులను చూచి దు:ఖించారు. నీలుడు, ద్వివిదుడు, మైందుడు, సుషేణుడు, కుముదుడు, అంగదుడు, హనుమంతుడు రామలక్ష్మణుల పక్కనే నిలబడి ఉన్నారు. వారి దు:ఖానికి అంతులేదు. రామలక్ష్మణులకు ఊపిరి తీసుకోడం కూడా కష్టంగా ఉంది. శరీరం అంతా బాణములు తగలడం వల్ల వారు అటు ఇటు కదలలేకపోతున్నారు. విభీషణునికి కూడా ఏమి చెయ్యాలో తోచడం లేదు.

విభీషణుడు కూడా రాక్షసుడే కాబట్టి ఇంద్రజిత్తు మాయలన్నీ విభీషణునికి తెలుసు. అదే మాయను ప్రయోగించి ఇంద్రజిత్తు కోసం వెదికాడు. ఇంద్రజిత్తు రామలక్ష్మణులను పడగొట్టి నందుకు మహదా నందంగా ఉన్నాడు. రాక్షసులందరితో ఇలా అంటున్నాడు. "ఓ రాక్షస వీరులారా! నేను రామలక్ష్మణులను వీరశయనం పొందేట్టు చేసాను. ఖరదూషణులను సంహరించిన రాముడు నా చేత చంపబడ్డాడు. దేవతలుకానీ, అసురులుకానీ, ఋషులు కానీ రామలక్ష్మణులను నా శరబంధము నుండి విడిపించలేరు. ఈ రామలక్ష్మణుల వలననే నా తండ్రి రావణుడు నిద్రాహారాలు మాని వీరి గురించి ఆలోచిస్తున్నాడు. ఆ రామలక్ష్మణులను నేను చంపి నా తండ్రిని బాధావిముక్తుడిని చేసాను. ఇంక ఈ రామలక్ష్మణుల పరాక్రములు, వానరవీరుల పరాక్రములు వృథా అయ్యాయి." అని గట్టిగా పలికాడు.

తరువాత ఇంద్రజిత్తు మరలా మాయాయుద్ధము చేయ నారంభించాడు. వానర సేనానాయకులను తన వాడిఅయిన బాణములతో కొట్టాడు. బాణాలు ఎటునుండి వస్తున్నాయో తెలియని వానర వీరులు కంగారు పడుతున్నారు. బాణాల దెబ్బలకు బలి అవుతున్నారు. ఇంద్రజిత్తు నీలుడిని తొమ్మిది బాణములతోనూ, మైందుడిని, ద్వివిదుడిని, ఒక్కొక్కరిని మూడు బాణములతోనూ కొట్టాడు. జాంబవంతుడి వక్షస్థలాన్ని ఒకే ఒక బాణంతో చీల్చాడు. హనుమంతుని వక్షస్థలమును పదిబాణములతో కొట్టాడు. గవాక్షుడిని, శరభుడిని రెండేసి బాణములతో కొట్టాడు. అంత క్రితం తనను ఓడించిన అంగదుని మీద విరివిగా బాణాలు ప్రయోగించాడు ఇంద్రజిత్తు. ఆ ప్రకారంగా వానరవీరులను తన వాడిఅయిన బాణములతో గాయపరిచి సంహనాదము చేసాడు ఇంద్రజిత్తు. వానరుల దుస్థితి చూచి ఇంద్రజిత్తు వికటాట్టహాసం చేసాడు.

"ఓ రాక్షసులారా!చూడండి. రాముడు లక్ష్మణులను నా శరబంధంలో బంధించాను. చూడండి ఎలా స్పృహలేకుండా పడి ఉన్నారో!"అని పెద్దగా అరిచాడు. శరబంధంలో పడి ఉన్న రామలక్ష్మణులను చూచి రాక్షసులు సంతోషించారు వారు కూడా సింహనాదములుచేసారు. రాముడిని ఇంద్రజిత్తు చంపాడు అని తెలుసుకొని అందరూ ఇంద్రజిత్తును ప్రశంసించారు. ఇంద్రజిత్తు రామలక్ష్మణుల వంక చూచాడు. రామలక్ష్మణులు ఊపిరి తీసుకోడం లేదు. వారిద్దరూ మరణించారు అని నిర్ధారణ చేసుకున్నాడు ఇంద్రజిత్తు. విజయ దుందుభులు మోగించుకుంటూ, జయజయధ్వానాలు చేసుకుంటూ లంకానగరంలోకి ప్రవేశించాడు ఇంద్రజిత్తు.

చలనం లేకుండా పడి ఉన్న రామలక్ష్మణులను చూచిన సుగ్రీవునికి ఒళ్లంతా భయం ఆవహించింది. కళ్లనిండా నీళ్లు కమ్మాయి. దీనంగా రాముని వంక చూస్తున్నాడు. అటువంటి స్థితిలో ఉన్న సుగ్రీవుని చూచి విభీషణుడు ఇలా అన్నాడు.

"అదేమిటి సుగ్రీవా! ఈ మాత్రం దానికే భయపడితే ఎలా. యుద్ధం అంటే ఇలాగే ఉంటుంది. జయాపజయాలు దైవాధీనాలు కదా! మనం అదృష్టవంతులము అయితే రామలక్ష్మణులకు స్పృహ వస్తుంది. రాముడు సత్యవంతుడు. ధర్మాత్ముడు. అటువంటి రామునికి మృత్యు భయము లేదు. ధైర్యంగా ఉండు." అని తన చేత్తో సుగ్రీవుని కన్నీళ్లు తుడిచాడు విభీషణుడు.

"సుగ్రీవా! ఇది దు:ఖించుటకు సమయము కాదు. దు:ఖము అన్ని కార్యములను నాశనం చేస్తుంది. కాబట్టి దు:ఖాన్ని వదిలిపెట్టు. చేయవలసిన పనులను ఎలాచెయ్యాలో ఆలోచించు. సైన్యములకు తగిన ఆదేశాలు ఇవ్వు. సైన్యములో విశ్వాసాన్ని ఉత్సాహాన్ని రేకెత్తించు. రామలక్ష్మణులకు స్పృహ వచ్చేంత వరకూ వారిని మనము రక్షించాలి. తరువాత రామలక్ష్మణులు మనలను రక్షిస్తారు. అటుచూడు. రాముని ముఖంలో కాంతి ఇంకా అలాగే ఉంది. రాముడికి తప్పకుండా స్పృహ వస్తుంది. మరణము సంభవించిన వారి ముఖంలో ఇటువంటి కాంతి ఉండదు. కాబట్టి రాముడు మరణించలేదు. కాబట్టి ముందు నీవు పోయి రాముడు మరణించలేదు అని చెప్పి సేనలలో విశ్వాసాన్ని ఉత్సాహాన్ని కలిగించు." అని అన్నాడు.

సుగ్రీవుడు విభీషణుడు చెప్పిన మాదిరి "రాముడు మరణించలేదు, బతికే ఉన్నాడు" అని ప్రచారం చేసి, సైనికులలో నూతన ఉత్సాహాన్ని నింపడానికి ప్రయత్నించాడు.

అక్కడ లంకానగరంలో ఇంద్రజిత్తు జయజయధ్వానాలతో తన తండ్రి రావణుని వద్దకు వెళ్లాడు. రాముడు ఇంద్రజిత్తు చేతిలో మరణించాడు అన్న వార్త విన్న రావణుడు మహదానందభరితుడయ్యాడు. ఇంతలో ఇంద్రజిత్తు తండ్రి వద్దకు పోయి నమస్కరించి "తండ్రీ! నేను రామ లక్ష్మణులను చంపాను" అని చెప్పాడు. రావణుడు సింహాసనము నుండి ఒక్క ఉదుటున పైకి లేచి కిందికి దిగివచ్చి ఇంద్రజిత్తును గాఢంగా కౌగలించుకున్నాడు. అతని శిరస్సును మూర్కొని "కుమారా! నిజమా! రామలక్ష్మణులు మరణించారా! ఎంతటి శుభవార్త చెప్పావు. ఇంతకూ రామలక్ష్మణులను ఎలా చంపావు?" అని అడిగాడు రావణుడు. ఇంద్రజిత్తు తాను రాముని లక్ష్మణులను వాడి అయిన బాణములతో శరీరం అంతా తూట్లుపడేట్టు ఎలా కొట్టిందీ, ఎలా శరబంధనం చేసిందీ వివరంగా చెప్పాడు. ఇంద్రజిత్తు మాటలు విన్న రావణుడు ఎంతో సంతోషించాడు. ఇంద్రజిత్తును మనసారా అభినందించాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము నలుబది ఐదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
నలుబది ఆరవ సర్గ.

వానర వీరులు అందరూ రాముని చుట్టు చేరి రామునికి రక్షణ వలయంగా నిలబడ్డారు. వానర సేనలకు అధిపతులైన హనుమంతుడు, అంగదుడు, నీలుడు, సుషేణుడు, కుముదుడు, నలుడు, గజుడు, గవాక్షుడు, పనసుడు, సానుప్రస్థుడు, జాంబవంతుడు, ఋషభుడు, సుందుడు, రంభుడు, శతబలి, పృథుడు మొదలగు సైన్యాధిపతులు తమ తమ వానర, భల్లూ సేనలను యుద్ధానికి సన్నద్ధం చేసారు. ఏ మాత్రం కదలిక కలిగినా అప్రమత్తంగా ఉన్నారు.

అక్కడ లంకలో రావణుడు విజయోత్సాహంతో వచ్చిన ఇంద్రజిత్తును అభినందించి పంపివేసాడు. తరువాత అశోక వనములో సీతకు కాపలా కాస్తున్న రాక్షస స్త్రీలను పిలిపించాడు. త్రిజట ఆధ్వర్యంలో రాక్షస స్త్రీలు రావణుని వద్దకు వచ్చారు. రావణుడు మహా సంతోషంగా ఉన్నాడు. రాక్షస స్త్రీలతో ఇలా అన్నాడు. "జాగ్రత్తగా వినండి. రాముడు, నా కుమారుడు ఇంద్రజిత్తు చేతిలో చంపబడ్డాడు. ఈ విషయం సీతకు తెలియజేయండి. సీతను మీరందరూ పుష్పక విమానము ఎక్కించి, రాముని వద్దకు తీసుకొని వెళ్లండి. ఆకాశం నుండి రాముని శవాన్ని ఆమెకు చూపించండి. రాముని శవంతో పాటు లక్ష్మణుని శవం కూడా సీతకు చూపించండి. ఇంత కాలమూ ఎవరు వచ్చి తనను రక్షిస్తారు అని సీత అనుకుంటూ ఉందో, ఆ రాముడు, ఆ లక్ష్మణుడు యుద్ధములో చంపబడ్డారు అని తెలియజెయ్యండి. ఇంక సీతకు నేను తప్ప నాధుడు లేడు. అందుకని సీతను బాగా అలంకరించి నా వద్దకు తీసుకొని రండి. రాముడు చని పోయిన తరువాత సీత తనంతట తానే నా వద్దకు వస్తుందని నాకు

నమ్మకం ఉంది. చనిపోయిన రామలక్ష్మణులను చూచిన సీతకు నేను తప్ప వేరే గత్యంతరము లేదు కాబట్టి నన్ను చేరడం నిజం."అని అన్నాడు రావణుడు. రావణుని మాటలు శ్రద్ధగా విన్న ఆ రాక్షస స్త్రీలు అలాగే చేస్తాము అని చెప్పి బయటకు వచ్చారు.

రావణుని ఆదేశము మేరకు సీతను పుష్పక విమానములో ఎక్కించుకొని, రాముడు పడి ఉన్న చోటికి తీసుకొని వెళ్లారు. అప్పటికే రావణుడు "రాముని ఇంద్రజిత్తు యుద్ధంలో చంపాడు" అన్న రాముని మరణ వార్తను లంకా నగరం అంతా తెలిసేటట్టు ఘోషణ చేయించాడు. ఊరంతా పతాకములతో అలంకరింప చేసాడు. యుద్ధం ముగిసి పోయిందని రాక్షసులు ఉత్సవాలు జరుపుకుంటున్నారు.

ఇదంతా చూస్తూ సీత పుష్పక విమానములో రాముడు పడి ఉన్న ప్రదేశమునకు వెళ్లింది. యుద్ధభూమిలో చచ్చి పడి ఉన్న వానర వీరులను చూచింది. యుద్ధ రంగములో కేరింతలు కొట్టుకుంటూ ఉత్సవాలు జరుపుకుంటున్న రాక్షసులను, విషాదవదనములతో ఉన్న వానరులను చూచింది. శరీరం అంతా బాణములతో కొట్టబడి నేల మీద పడి ఉన్న రాముని చూచింది సీత.

రామునికి స్పృహ లేదు. నిర్జీవంగా పడి ఉన్నాడు. లక్ష్మణుడు కూడా పక్కనే పడి ఉన్నాడు. వారి ధనుస్సులు దూరంగా పడి ఉన్నాయి. వారి శరీరాలు శరతల్పము మీద ఉన్నాయి.

శరతల్పము మీద పడి ఉన్న రామలక్ష్మణులను చూచి సీత ఘోరున విలపించింది. ఆమె శోకమునకు అంతులేకుండా పోయింది. రామలక్ష్మణులు మరణించినారు అని తెలుసుకున్న సీత శోకసముద్రంలో మునిగిపోయింది. ఏడుస్తూనే త్రిజటతో ఇలా అంది.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము నలుబది ఏడవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

నలుబది ఎనిమిదవ సర్గ.

రాముడు, లక్ష్మణుడు అచేతనంగా పడి ఉండడం చూచిన సీత వారు మృతి చెందారని భ్రమించింది. దీనంగా ఏడ్చింది. "అయ్యో భగవంతుడా! నా చిన్నతనంలో నా జాతకము చూచిన జ్యోతిష్కులు నాకు పుత్ర సంతానము కలుగుననియూ, నాకు వైధవ్యములేదనియూ చెప్పి ఉన్నారు కదా! మరలా ఇదేమి ఘోరము. నా రాముడు నన్ను విడిచి వెళ్లిపోయాడు. ఆ పండితులు జ్యోతిష్యులు చెప్పిన మాటలు అన్నీ అసత్యములు అయినట్టే కదా! అదే జ్యోతిష్కులు నేను గొప్ప గొప్ప యజ్ఞములు యాగములు చేసిన మహారాజు కు భార్యను అవుతాను అని చెప్పారు. కాని నా రాముడు అకాల మరణం చెందడంతో అవన్నీ అబద్ధాలు అయినట్టే కదా!

వీరుల భార్యలందరిలోనూ నేను అత్యంత గౌరవానికి పాత్రురాలను అగుదును అని పండితులు చెప్పారు కదా. మరి ఆ మాటలన్నీ

వమ్ముఅయ్యాయా! వారు అసత్యం చెప్పారా! నేను నమస్కరించిన పండితులు దైవజ్ఞులు అందరూ అఖండ సౌభాగ్యవతి అని నన్ను దీవించారు కదా! మరి ఆ దీవనలన్నీ వృథా అయినట్టేనా! రాముని మరణంతో నా సౌభాగ్యము మంటగలిసినట్టేనా! నా పాదములలో పద్మములు ఉన్నాయనీ, నన్ను వివాహమాడిన వారు చక్రవర్తి అవుతారనీ సాముద్రిక వేత్తలు చెప్పారు కదా! మరి ఆ శుభలక్షణములు అన్నీ నా నుండి మాయం అయి పోయాయా! లోకములో వైధవ్యమును పొంద దగిన స్త్రీలకు ఉండవలసిన లక్షణములు ఏ ఒక్కటి కూడా నాలో మచ్చుకైనా కనిపించవు కదా! మరి నాకు ఈ అకాల వైధవ్యము ఎందుకు ప్రాప్తించినది! మరి నా శరీరములో అఖండ సౌభాగ్యవతికి ఉండవలసిన సాముద్రిక లక్షణములు అన్ని ఎక్కడ ఉండవలసినవి అక్కడ ఉన్నాయి కదా! మరి అవి అన్నీ వృథా అయిపోయినట్టేనా! నా కేశములు, నా శరీర భాగములు, నా నేత్రములు, చేతులు, కాళ్లు, మడిమలు, అన్నీ శుభలక్షణములతో కూడి ఉన్నవి కదా! మరి ఆ శుభలక్షణములు అన్నీ ఎక్కడకు పోయాయి. నాకు ఈ వైధవ్యము ఎందుకు వచ్చింది. నేను నా భర్తతో కలిసి చక్రవర్తి పీఠమును అలంకరిస్తాను అని జ్యోతిష్కులు చెప్పారు కదా! మరి వారి మాటలన్నీ వమ్మయిపోయాయా!

నా కొరకు జనస్థానము నుండి వెదుకుతూ వచ్చి, సముద్రమును దాటిన రాముడు, సాగరమును దాటి ఆవు పాదమంత గుంటలో పడ్డట్టు ఈ దుష్టుడి చేతిలో మరణించాడు కదా! రామలక్ష్మణుల వద్ద వారుణాస్త్రము, ఆగ్నేయాస్త్రము, ఇంద్ర అస్త్రము, వాయవ్యాస్త్రము, బ్రహ్మశిరోనామకాస్త్రము ఇంకా ఎన్నో దివ్యాస్త్రములు ఉన్నాయి కదా. మరి ఆ అస్త్రములు అన్నీ ఏమయిపోయాయి. అవునులే కనపడ్డ వారి మీద

అస్త్రములు ప్రయోగించవచ్చు కానీ, కనపడకుండా యుద్ధము చేసే మాయావుల మీద ఏ అస్త్రములు ప్రయోగించిన ఏమి ప్రయోజనము. యుద్ధములో రాముని ఎదుట నిలిచిన శత్రువు ప్రాణాలతో తిరిగి వెళ్లడు కానీ ఈ మాయావి రాముని కంటపడకుండా రాముని చంపాడు. రామలక్ష్మణులు అకాల మరణం చెందడం దైవఘటన కాక మరేమున్నది.

రాముని మరణ వార్త విని కౌసల్య ఎంతగా శోకిస్తుందో కదా! అరణ్యవాసము పూర్తి చేసుకొని అయోధ్యకు రామలక్ష్మణులు ఎప్పుడు తిరిగి వస్తారో అని ఎదురుచూస్తున్న కౌసల్యకు రామలక్ష్మణుల మరణ వార్త అశనిపాతంగా పరిణమిస్తుంది. ఆమెను ఎవరు ఓదారుస్తారు!" అని పరి పరి విధములుగా శోకిస్తున్న సీతను చూచి త్రిజట ఇలా అంది.

"ఎందుకమ్మా ఏడుస్తావు. నీ భర్త రాముడు చనిపోలేదు. బతికే ఉన్నాడు. ఒకసారి అటు చూడు. వానర నాయకులు అందరూ రామ లక్ష్మణుల దేహములను జాగ్రత్తగా రక్షిస్తున్నారు. వారి ముఖములలో దైన్యము శోకము కనపడుట లేదు. వారు అంతా రాముడు ఎప్పుడు స్పృహలోకి వస్తాడా అని ఎదురు చూస్తున్నారు. కాబట్టి నీ భర్త మరణించలేదు. నా మాటనమ్ము. నీవు అఖండ సౌభాగ్యవతివి అని నాకు నమ్మకం ఉంది. నా నోట అబద్ధము రాదు. నీ పాతివ్రత్యమే నిన్ను రక్షిస్తుంటుంది. నీ పాతివ్రత్యమే నన్ను నీ పట్ల ఆకర్షితురాలిగా చేసింది. అందుకే నీకు శుభం కలగాలని కోరుకుంటున్నాను. ఇంద్రాదులు వచ్చినా రామలక్ష్మణులను జయించలేరు. ఇది నిక్కువము. మరొక్కసారి రామలక్ష్మణుల ముఖములు చూడు. వారి ముఖములలో సహజమైన కాంతీ తేజస్సు తగ్గలేదు. రామలక్ష్మణులు కేవలం స్పృహ తప్పారే కానీ మరణించలేదు. ఈ మూర్ఖరాక్షసులకు స్పృహ తప్పడానికీ, మరణించడానికీ తేడా తెలియదు. మరణించిన వారి

ముఖములు వికృతంగా మారుతాయి. కానీ రామలక్ష్మణుల ముఖములు కాంతితో ప్రకాశిస్తున్నాయి. ముఖములు అలా ప్రకాశిస్తున్న వారు మరణించి నట్టు కాదు. కాబట్టి రామలక్ష్మణులు జీవించి ఉన్నారు. నీ శోకమును వదిలిపెట్టు. రామలక్ష్మణులు జీవించాలనీ ఆ దైవమును ప్రార్థించు." అని పలికింది త్రిజట.

త్రిజట మాటలు విన్న సీత ఆమెకు రెండు చేతులు జోడించి నమస్కరించింది. "త్రిజటా! నీ మాటలు యదార్థములు కావాలి." అని మనసులో అనుకొంది సీత. వెంటనే త్రిజట పుష్పకవిమానమును వెనక్కు తిప్పి లంకకు పోనిచ్చింది. అశోక వనములో సీత, త్రిజట పుష్పకమును దిగారు. తరువాత పుష్పకము రావణుని నివాసమునకు వెళ్లిపోయింది. తిరిగి శింశుపావృక్షము కింద కూర్చున్న సీత రామలక్ష్మణులు సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని దైవమును ప్రార్థిస్తూ దీనంగా కూర్చుంది.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము నలభైఎనిమిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
నలభైతొమ్మిదవ సర్గ.

రాముడు లక్ష్మణుని శరీరముల చుట్టు చేరిన వానర వీరులు దీనంగా చూస్తున్నారు. వారికి ఏం చెయ్యడానికీ తోచడం లేదు. ఆ శరబంధనం ఎలా వీడుతుందో తెలియడంలేదు. లక్షణుని కన్నా రామునికి

మానసిక స్థైర్యము ఎక్కువ. అందువలన రాముడు తొందరలోనే స్పృహలోకి వచ్చాడు. రక్తసిక్తమైనశరీరంతో నేలమీద పడి ఉన్న లక్ష్మణుని చూచాడు రాముడు. రాముడికి దు:ఖము ముంచుకొచ్చింది. లక్ష్మణునిచూచి భోరున విలపించాడు.

“నా లక్ష్మణుడు లేని నాకు ఈ జీవితము, నా సీత ఎందుకు వృధా. భూలోకములో పట్టుబట్టి వెతికితే సీతలాంటి భార్య కనపడవచ్చేమో కానీ లక్ష్మణుడి వంటి తమ్ముడు దొరకడం చాలా కష్టం. ఏ కారణం చేతనైనా లక్ష్మణుడు మరణిస్తే, ఈ వానరుల అందరి ముందరా నేను కూడా ప్రాణత్యాగం చేసుకుంటాను. నన్ను నమ్మి లక్ష్మణుని తల్లి సుమిత్ర లక్ష్మణుని నా వెంట పంపింది. ఇప్పుడు నేను ఒంటరిగా అయోధ్యకు వెళితే, సుమిత్ర నన్ను నిందిస్తుంది. ఆ నింద నేను భరించలేను. హాయిగా అయోధ్యలో ఉండక నా వెంట వచ్చి ఈ శరశయ్యమీద పడుకొని ఉన్నాడు. శర బంధనంలో బంధింపబడ్డాడు లక్ష్మణుడు. ఎంత దురదృష్టము.

ఓ లక్ష్మణా! నేను సీత గురించి శోకించినప్పుడు నువ్వు నన్ను ఓదార్చి నాకు ధైర్యము చెప్పేవాడివి ఇప్పుడు నీకోసం నేను ఏడుస్తున్నాను. లేచి నన్ను ఓదార్చు! ఈ రోజు యుద్ధములో నీవు ఎంతో మంది రాక్షసులను చంపావు. కానీ ఆ ఇంద్రజిత్తు చేతిలో మరణించావు. లక్ష్మణా! నీ ముఖంలో కళతగ్గలేదు. సంధ్యాసమయంలో సూర్యుడిలా ప్రకాశిస్తున్నావు. నీవు చావలేదు. నీ కళ్లలో కాంతి ఇంకా మెరుస్తూ ఉంది. నీవే కనుక యమపురికి వెళ్లవలసి వస్తే నేను కూడా నీ వెంట వస్తాను కానీ నిన్ను ఒంటరిగా వెళ్లనివ్వను. ఎందుకంటే నేను ఒంటరిగా అడవులకు వెళు తున్నాను అని నీవు నా వెంట వచ్చావుకదా! అందుకే నేను కూడా నీ వెంట వస్తాను.

లక్ష్మణా! నీ దురవస్థకు నేను కారణము. నా వలన నీకు ఇన్ని కష్టాలు వచ్చాయి. అందరికీ దూరంగా నా వెంట అడవులలో తిరుగుతున్నావు. తుదకు ప్రాణాల మీదికి తెచ్చుకున్నావు. కాని నీకు నా మీద కించిత్ కూడా కోపం రాలేదు. నాతో ఒక్క చెడ్డ మాటకూడా మాట్లాడలేదు. లక్ష్మణా! నీ పరాక్రమము నాకు తెలియనిదా! నీవు కార్తవీర్యార్జునుని కంటే పరాక్రమవంతుడవు. కానీ కాలం కలిసిరాక ఇంద్రజిత్తుచేతిలో ఓడిపోయావు. లక్ష్మణా! అయోధ్యలో పట్టుపరుపుల మీద పరుండవలసిన వాడివి ఇక్కడ ఈ శరతల్పము మీద పడుకున్నావా! ఇంద్రునే జయించగలవాడివి ఇంద్రజిత్తుచేతిలో ఓడిపోయావా!

ఓ సుగ్రీవా! నన్ను లక్ష్మణుని వదిలి వెళ్లిపొండి. రావణుడు మిమ్ములను ఏమీ చేయడు. రావణుని కోపం నా మీదనే కదా. మీరందరూ సముద్రము దాటి కిష్కింధకు వెళ్లిపొండి. నా కోసరము మీ ప్రాణాలు ఎందుకు బలిపెడతారు. ఇప్పటిదాకా మీరు నాకు చేసిన సాయమునకు కృతజ్ఞుడను. నువ్వు జాంబవంతుడు, అంగదుడు, మైందుడు, ద్వివిదుడు, కేసరి,సంపాతి, గవయుడు, గవాక్షుడు, శరభుడు, గజుడు, నా కోసరము రాక్షసులతో ఘోర యుద్ధము చేసారు. నా కొరకు మీ ప్రాణాలను సైతం లెక్కచెయ్యకుండా రాక్షసులతో యుద్ధం చేసారు. కాని మనము దైవ నిర్ణయమును అతిక్రమించలేము కదా! సుగ్రీవా! ఒక స్నేహితుడుగా నీవు నాకు చేయగలిగినది అంతా చేసావు. ఓ వానర ప్రముఖులారా! మీరందరూ నా కోసరం ఎంతో చేసారు. మీ అందరికీ కృతజ్ఞుడిని. నేను మీకు అనుమతి ఇస్తున్నాను. మీ మీ ప్రదేశములకు తిరిగి పొండు. ఇదే నా విన్నపము" అని కళ్ల వెంట నీరు కారుతుండగా రాముడు అందరికీ వీడ్కోలు పలికాడు.

రాముడి మాటలు విన్న ఏ వానరుడూ కన్నీరు పెట్టకుండా ఉండలేకపోయాడు. ఇంతలో విభీషణుడు చేతిలో గద ధరించి సైన్యములకు ధైర్యం చెబుతూ రాముడు ఉన్న చోటికి వచ్చాడు. రావణుడు, అతని తమ్ముడు విబీషణుడు ఒకే పోలికతో ఉండటం వలన, విభీషణుని అంతా రావణుడు అనుకొన్నారు. వారిలో భయం ప్రవేశించింది. ఇంద్రజిత్తు రామలక్ష్మణులను చంపాడు. రావణుడు మనలను చంపడానికి వచ్చాడు అని అరుస్తూ వానరులు తలొకదిక్కుగా పారిపోయారు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము నలుబది తొమ్మిదవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
ఏబదవ సర్గ.

అది చూచిన సుగ్రీవుడు ఇలా అన్నాడు. “ఇదేమిటి. ఈ వానరులకు పిచ్చి పట్టిందా. లేక రావణుని భయం పట్టుకుందా. ” అని అన్నాడు. దానికి అంగదుడు ఇలా అన్నాడు. మనకు నాయకులైన దశరథ కుమారులు రామలక్ష్మణులు శరతల్పగతులై ఉన్నారని తమరికి తెలియదా! మరి వానరులు భయపడరా!’ అని అన్నాడు.

“ఆ విషయం అందరికీ తెలుసు కదా! వానరుల భయమునకు ఏదో వేరు కారణము ఉండి ఉంటుంది. అధిక బలవంతులైన వానరులు ఇలా పారిపోతున్నారంటే వారి భయానికి తగిన కారణం ఉండి ఉండాలి.

లేకపోతే ఈ వానరులు సిగ్గు లేకుండా భయంతో పారిపోతున్నారు. ఒకరిని ఒకరు తోసుకుంటూ పరుగెడుతున్నారు. ఎవరైనా కిందపడి పోతే వారిని తొక్కుకుంటూ వారి మీదినుండి పరుగెడుతున్నారు. ముందు వారిలో భయాన్ని పోగొట్టాలి." అని అన్నాడు.

ఇంతలో చేతిలో గద ధరించిన విభీషణుడు అక్కడికి వచ్చాడు. జయజయధ్వానాలు పలుకుతూ రాముడికి అభివాదము చేసాడు. సుగ్రీవునికి అప్పటికి అర్థం అయింది వానరుల భయకారణము. అపర రావణుని మాదిరి గదతో నడిచి వస్తున్న విభీషణుని చూచి అతడే రావణుడు అనుకొని వానరులు పారిపోతున్నారు అని తెలుసుకున్నాడు సుగ్రీవుడు. పక్కనే ఉన్న జాంబవంతుని చూచి ఇలా అన్నాడు. "జాంబవంతా! విభీషణుని చూచిన వానరులు అతడే రావణుడు అని కానీ, ఇంద్రజిత్తు అని కానీ అనుకొని పారిపోతున్నారు. మీరు వెళ్లి వారికి ధైర్యము చెప్పండి. వచ్చినవాడు విభీషణుడు అనీ, రావణుడు కానీ, ఇంద్రజిత్తు కానీ కాదు అని వారికి తెలియజెప్పండి." అని అన్నాడు.

సుగ్రీవుని ఆదేశము ప్రకారము జాంబవంతుడు వానరులకు ధైర్యముచెప్పడానికి వెళ్లాడు. వానరుల మధ్యకు వెళ్లి వారికి ధైర్యవచనాలు పలికాడు. అందరిలోకీ పెద్ద వాడైన జాంబవంతుని మాటలు విన్న వానరులు, నిజం తెలుసుకొని అందరూ వెనకకువచ్చారు.

విభీషణుడు రాముని, లక్ష్మణుని ఆ స్థితిలో చూచి చాలా బాధపడ్డాడు. తను కూడా వారి బాధలో పాలుపంచుకున్నాడు. విభీషణుడు సుగ్రీవునితో ఇలా అన్నాడు. "ఇంద్రజిత్తు రాక్షసుడు. మాయావి.

మాయాయుద్ధంలో ఆరితేరినవాడు. కుటిలయుద్ధంలో మేటి. రామలక్ష్మణులకు నేరుగా యుద్ధం చేయడం తెలుసు కానీ మాయాయుద్ధం తెలియదు. అందుకని ఇంద్రజిత్తు వీరిని జయించగలిగాడు. ఇంద్రజిత్తు వీరి శరీరం అంతా తూట్లుపడేట్టు కొట్టాడు. రామలక్ష్మణుల శరీరం అంతా రక్తసిక్తమయింది. అవసాన దశలో ఉన్నారు. నా అన్న నా శత్రువు అయిన రావణుడు గెలిచాడు. వాడి కోరిక తీరింది. సీత వాడి వశం అయింది." అని భోరున విలపించాడు విభీషణుడు.

సుగ్రీవుడు విభీషణుని చూచి ఇలా అన్నాడు. "విభీషణా! రామలక్ష్మణులు మరణించలేదు. కేవలము స్పృహ తప్పిఉన్నారు. వీరికి స్పృహ వచ్చిన తరువాత వీరు ఇద్దరూ రావణుని చంపగలరు. నిన్ను లంకాధీశునిగా అభిషేకించగలరు. ఊరట చెందుము." అని అన్నాడు. సుగ్రీవుడు తన పక్కనే ఉన్న తన మామగారు సుషేణుని చూచి ఇలా అన్నాడు. "ఈ పరిస్థితిలో రామలక్ష్మణులు ఇక్కడ ఉండటం మంచిది కాదు. నీవు వీరిని తీసుకొని కిష్కింధకు వెళ్లు. నేను నా సేనలతో ఇక్కడే ఉండి రావణుని బంధు పుత్ర మిత్ర సమేతంగా సంహరిస్తాను. సీతను తీసుకొని వస్తాను."అని అన్నాడు.

అప్పుడు సుషేణుడు ఇలా అన్నాడు. "సుగ్రీవా! నాకు మాయా యుద్ధము కొత్త కాదు. దేవాసుర యుద్ధము గురించి నాకు బాగా తెలుసు ఆ రోజుల్లో దానవులు బాణప్రయోగంలో ప్రవీణులు. దేవతలు కేవలం అస్త్రములు మాత్రము వాడేవారు. దానవులు తమ మాయాశక్తితో మాయం అయిపోయి, దేవతల మీద బాణవర్షము కురిపించి వారిని ఓడించారు. అసురుల దెబ్బకు దేవతలకు బాగా దెబ్బలు తగిలి స్పృహ తప్పారు. కొంత మంది చనిపోయారు. అప్పుడు బృహస్పతి తనమంత్రశక్తిచేత, తనకు

తెలిసిన ఓషధుల చేత చికిత్స చేసి వారిని బతికించాడు. ఆ ఔషధముల గురించి సంపాతికి పనసునికి బాగా తెలుసు. వారికి సంజీవకరణి, దేవతలు ఉపయోగించిన విశల్యకరణి అనే దివ్య ఔషధముల గురించి బాగా తెలుసు. వారిని పంపి ఆ ఓషధులు తెప్పించు. అలాగే దేవ దానవులు మథించిన క్షీరసముద్రములో చంద్రము, ద్రోణము అనే పర్వతములు ఉన్నాయి ఆ పర్వతములను దేవతలు క్షీరసముద్రములో ఉంచారు. వాయుపుత్రుడైన హనుమంతుని అక్కడకు పంపు. ఆయనకు కూడా ఈ ఓషధుల గురించి బాగా తెలుసు." అని అన్నాడు సుషేణుడు.

ఇంతలో తీవ్రంగా గాలి వీచింది. మేఘములు దట్టంగా అలముకున్నాయి. కొన్ని కొన్ని మహావృక్షములు కూకటి వేళ్లతోసహా పెకలింపబడి సముద్రములో పడిపోతున్నాయి. సముద్రములో ఉన్న జంతువులు సర్పములు అల్లకల్లోలం అయ్యాయి. దీని కంతటికీ కారణము గరుడుని రాక. అతని రెక్కల వేగము వలన అంతటి ఝంఝూమారుతము వీచింది. ఆకాశంలో ఎగురుతూ వస్తున్న గరుడుడు వానరులకు కనపడ్డాడు. ఇంద్రజిత్తు రాముని మీద లక్ష్మణుని మీద నాగసర్పములు ఆవాహన చేసిన బాణములను ప్రయోగించాడు. ఆ సర్పబంధనంలో చిక్కుకున్న రామలక్ష్మణులు వాటి ప్రభావం వలన మృతప్రాయులయ్యారు. ఆ సంగతి వానరులకు తెలియదు. గరుడుని రాక చూచి రామలక్ష్మణులను బంధించిన సర్పములు భయపడిపోయాయి. వెంటనే ఆ సర్పములు అన్నీ చెల్లాచెదరయ్యాయి. తలా ఒక దిక్కుకుపారిపోయాయి. రాముని లక్ష్మణుని పట్టి ఉంచిన నాగ బంధములు విడిపోయాయి. రామలక్ష్మణులకు శరబంధమునుండి విముక్తి కలిగింది.

గరుడుడు కిందికి దిగి రామ లక్ష్మణుల వద్దకు వచ్చాడు. రామ లక్ష్మణుల శరీరములను తన చేతితో నిమిరాడు. వారి ముఖములను ప్రేమతో నిమిరాడు. గరుడుని స్పర్శతో రామలక్ష్మణుల శరీరము మీద సర్పముల వంటి బాణములతో కలిగిన గాయములు అన్నీ మాయం అయ్యాయి. వారి శరీరం అంతకు ముందు కంటే కాంతి వంతంగా మెరిసిపోతూ ఉంది. రామ లక్ష్మణులకు పూర్వపు తేజస్సు పరాక్రమము, వీర్యము బలము ఉత్సాహము మొదలైన గుణములు అన్నీ మరలా సంక్రమించాయి. గరుడుడు రామ లక్ష్మణులను లేవదీసి కౌగలించు కున్నాడు. గరుడుని చూచి రాముడు ఇలా అన్నాడు.

"నీ ప్రసాదం చేత మేము ఇంద్రజిత్తు వలన కలిగిన ఆపద నుండి బయటపడగలిగాము. మా పూర్వపు బలపరాక్రమములు మాకు వచ్చాయి. నిన్ను చూస్తుంటే నా తండ్రి దశరథుడు, పితామహుడు అజమహారాజును చూచినట్టు ఉంది. ఇంతకూనీవు ఎవరు? ఎక్కడి నుండి వచ్చావు?" అని అడిగాడు రాముడు.

అప్పుడు గరుడుడు రాముని చూచి ఇలా అన్నాడు. "రామా! నేను నీకు మిత్రుడను. నా పేరు గరుడుడు. మీకు సాయం చేద్దామని వచ్చాను. రావణుని కుమారుడైన ఇంద్రజిత్తు తన మాయతో మీ ఇద్దరినీ శరబంధం చేసాడు. ఈ శరబంధం నుండి విడిపించుకోవడం దేవతలకు కానీ, అసురులకు, గంధర్వులకు కానీ సాధ్యం కాదు. నీ మీద ఇంద్రజిత్తు ప్రయోగించినవి మామూలు బాణములు కావు. అవి కద్రువ కుమారులు అయిన నాగములు. అవి భయంకర విషసర్పాలు. ఇంద్రజిత్తు మాయా ప్రభావంతో ఆ విషసర్పములు బాణముల రూపంలో నిన్ను చుట్టుముట్టాయి. మీ ఇద్దరికీ స్పృహపోయేట్టు చేసాయి. అంతే కానీ మీ ప్రాణాలకు ఏమీ

ప్రమాదం లేదు. మీ ఇద్దరూ అజేయులు. మీ ఇద్దరూ ఈ ప్రకారము సర్పములతో ఆవహింపబడిన శరతల్పగతులైనారని తెలిసి వెంటనే వచ్చాను. నన్ను చూచి నా గర్భశత్రువులైన ఆ సర్పాలు పారిపోయాయి. మీకు స్పృహవచ్చింది. చాలా సంతోషము. ఇంక మీదట మీరు ఈ రాక్షస మాయలను తెలుసుకొని ప్రవర్తించండి.

కుటిల యుద్ధము, కపట యుద్ధము చేయడం రాక్షసుల స్వభావము. మీకు ఆ కుటిలత్వము కపటము తెలియవు. మీరు పరాక్రమాన్ని బలాన్ని నమ్ముకున్నారు. అదే మీకు బలము. రాక్షసులు ఎల్లప్పుడూ కుటిల స్వభావులు. ఇంద్రజిత్తు చేసిన యుద్ధమే దానికి తార్కాణము. యుద్ధము సమానమైన బలముకలవారి మధ్యజరగాలి అది యుద్ధధర్మము. కాని వారు మీకు తెలియని మాయాయుద్ధం చేసారు. కాబట్టి మీరు ఎప్పుడూ రాక్షసులను నమ్మకండి. ఇదే నా హితవు. ఇంక నాకు వెళ్లడానికి అనుజ్ఞ ఇవ్వండి. మన ఇద్దరికీ ఎలా స్నేహం ఏర్పడింది అని ఇప్పుడు మీరు నన్ను అడగ వద్దు. రామరావణ యుద్ధము ముగిసిన పిమ్మట ఆవిషయం మీకు తెలియగలదు. " అని రామునితో అన్నాడు గరుడుడు.

“నేను భవిష్యత్తును చెప్పుచున్నాను. నీవు ఈ యుద్ధములో లంకలో ఉన్న స్త్రీలు, బాలురు, వృద్ధులుతప్ప మిగిలిన రాక్షసులు అందరినీ సంహరించి, సీతను పొందగలవు.” అని పలికాడు గరుడుడు. తరువాత రాముని అనుజ్ఞ పొంది, రామునికి ప్రదక్షిణము చేసి నమస్కరించి, ఆకాశంలోకి ఎగిరిపోయాడు గరుడుడు.

రాముడు, లక్ష్మణుడు తమ పూర్వ ఆకారములతో తమ ముందు నిలిచేటప్పటికి వానరనాయకుల ఆనందానికి అవధులు లేవు. అందరూ జయజయధ్వానాలుచేసారు. భేరీలు మ్రోగించారు. మృదంగములు వాయించారు. శంఖములు పూరించారు. తోకలు ఊపుతూ సింహ నాదాలు చేసారు. ఆనందంతో గంతులు వేసారు. రెట్టించిన ఉత్సాహంతో చేతికి దొరికిన వృక్షములను పెకలించి వాటిని ఆయుధములుగా ధరించి యుద్ధానికి సిద్ధం అయ్యారు ఆ వానరులు. రాక్షసుల గుండెల్లో భయం పుట్టేటట్టు అరుస్తూ అందరూ లంకానగర ద్వారముల వైపు పరుగెత్తారు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము యాభయ్యవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము

యాభైఒకటవ సర్గ.

వానరులు చేసే సింహనాదాలు, విజయ దుందుభుల మోతలు రాక్షసుల చెవిని బడ్డాయి. రావణుడి చెవులకు కూడా సోకాయి. వెంటనే రావణుడు మంత్రులను పిలిపించాడు.అత్యవసర సమావేశము నిర్వహించాడు. “విన్నారుగా ఆ వానరుల జయజయధ్వానాలు. వారికేదో గొప్ప సంతోషము కలిగే సంఘటన జరిగినట్టు ఉంది. సందేహము లేదు. ఆ వానరుల కేకలకు సముద్రము కూడా దద్దరిల్లుతూ ఉంది. మన ఇంద్రజిత్తు రామలక్ష్మణులను సర్పబాణములతో శరబంధనము చేసినాడు కదా! దీనవదనములతో శోకించక ఈ వానరులు చేసే

జయజయధ్వానాలు నాలో ఎన్నో అనుమానాలు రేకెత్తిస్తున్నాయి."అని పలికిన రావణుడు పక్కనే నిలబడి ఉన్న రాక్షస వీరులను చూచి ఇలా అన్నాడు.

"రామలక్ష్మణుల మృతికి శోకించవలసిన సమయములో వానరులు ఈ ప్రకారంగా సంతోషంగా కేరింతలు కొట్టడానికి గల కారణం తెలుసుకొని రండు." అని ఆదేశించాడు. వెంటనే ఆ రాక్షస వీరులు లంకా నగర ప్రాకారముల మీదికి ఎక్కారు. వానర సైన్యమును జాగ్రత్తగా పరిశీలించారు. శరబంధనంతో నిర్జీవులుగా ఉండవలసిన రాముడు లక్ష్మణుడు సలక్షణంగా ఉండటం చూచారు. రామలక్ష్మణులు ద్విగుణీకృత ఉత్సాహంతో ప్రకాశిస్తున్నారు. రాక్షసుల గుండెల్లో గుబులు రేగింది. వారందరూ ప్రాకారములు దిగి వడి వడిగా రావణుని వద్దకు వెళ్లారు. దిగాలు పడిన మొహాలతో రావణుని ముందు నిలబడ్డారు. తాము చూచింది చూచినట్టు రావణునికి విన్నవించుకున్నారు.

"రాక్షసేంద్రా! జయము జయము. ఇంద్రజిత్తులవారి చేతిలో సర్పబాణబంధీకృతులై మరణించిన రామలక్ష్మణులు తమ బంధనాలు వీడి పునర్జీవితులై ఉదయభానుడి వలె ప్రకాశిస్తున్నారు. కట్లు తెంచుకున్న ఏనుగుల వలె ఉత్సాహంగా ఉన్నారు. ఆ మాటలు విన్న రావణుడికి కోపము భయము ఒకేసారి ముంచుకొచ్చాయి. రావణుడు వివర్ణవదనుడయ్యాడు.

"ఏమిటీ! ఇది నిజమా! యుద్ధములో ఇంద్రజిత్తు రామ లక్ష్మణులను ఓడించాడు కదా! తన సర్పబాణములతో బంధించాడు కదా! వారు మృతప్రాయులయ్యారని నాకు చెప్పాడు కదా! మరలా ఇదేమి?

అస్త్రబంధములో చిక్కుకున్న రామలక్ష్మణులు బంధవిముక్తులు కావడాన్ని బట్టి చూస్తే మన రాక్షస బలగముల బలపరాక్రమములు సందేహాస్పద ములుగా ఉన్నాయి. మేము పూర్వము చేసిన యుద్ధములలో ఏ అస్త్రశస్త్రములు మాకు విజయాన్ని సంపాదించి పెట్టాయో అవే అస్త్ర శస్త్రములు ఇప్పుడు రామలక్ష్మణుల ముందు వ్యర్థమైపోయాయి. " అని పలికి ధూమ్రాక్షుడు అనే రాక్షసవీరుని పిలిచాడు.

"ధూమ్రాక్షా! నీవు నీ సైన్యముతో యుద్ధరంగమునకు వెళ్లు. రాముడిని లక్ష్మణుని వానర సేనలనుసర్వనాశనం చెయ్యి." అని ఆదేశించాడు. వెంటనే ధూమ్రాక్షుడు రాక్షస సైన్యాధ్యక్షుడిని చూచి "నేను రామలక్ష్మణుల మీదికి యుద్ధానికి వెళ్లాలి. సేనలను సిద్ధం చేయండి" అని అన్నాడు. సైన్యాధ్యక్షుడు ధూమ్రాక్షుడికి సేనలను సమకూర్చాడు. తన అపార సేనావాహినితో వానరుల మీదికి యుద్ధానికి బయలుదేరాడు ధూమ్రాక్షుడు. నల్లని మేఘాల వలె ఉన్న రాక్షస వీరులు, పెద్దగా గర్జిస్తూ, శూలములు, ముద్గరములు, గదలు, పట్టిసములు, ఇనుప ఆయుధములు, పరిఘలు, బల్లెములు, గొడ్డళ్లు తీసుకొని ధూమ్రాక్షుని వెంటయుద్ధానికి బయలు దేరారు. మరి కొందరు రాక్షస వీరులు గాడిదలు లాగుతున్న రథముల మీద యుద్ధానికి బయలుదేరారు. మరికొందరు రాక్షస వీరులు వాయు వేగముతో పరుగెత్తే గుర్రముల మీద, ఏనుగుల మీద బయలుదేరారు. ధూమ్రాక్షుడు కూడా గాడిదలు కట్టిన రథము మీద బయలుదేరాడు. వారందరూ పశ్చిమ ద్వారము వద్దకు చేరుకున్నారు.

అక్కడ హనుమంతుడు వానరసేనలతో మోహరించి ఉన్నాడు. గాడిదలుకట్టిన రథము మీద వెళుతున్న ధూమ్రాక్షునికి అనేక

అపశకునములు గోచరించాయి. ఒక భయంకరమైన గ్రద్ద ధూమ్రాక్షుని రథమునకు కట్టిన ధ్వజము మీద వాలింది. తలలేని మొండెము ఒకటి ధూమ్రాక్షుని రథము ముందు పడింది. వాయువు ప్రతికూల దిశలో వీచింది. ఈ దుశ్శకునములు చూచి ధూమ్రాక్షుని మనసు కలతచెందింది. అయినా ధైర్యంతో ముందుకు సాగాడు. వానర సేనను అంతా ఒక్కసారి పరిశీలించి చూచాడు.

శ్రీమద్రామాయణము
యుద్ధకాండము యాభైఒకటవ సర్గ సంపూర్ణము
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

యుద్ధకాండము
యాభైరెండవ సర్గ.

ధూమ్రాక్షుడు యుద్ధానికి రావడం చూచి వానరులు సంతోషించారు. మరొక రాక్షసుడు బలి కాబోతున్నాడు అని ఆనంద పడ్డారు. వానరులు రాక్షసులు తలపడ్డారు. వానరులు పెద్ద పెద్ద బండరాళ్లను, మహావృక్షములను ఆయుధములుగా ధరించి యుద్ధం చేస్తుంటే, రాక్షసులు పట్టిసములు, శూలములు, ముద్గరలు ధరించారు. ఇరుపక్షముల వారు సమానంగా చస్తున్నారు. కాకపోతే రాక్షసుల చేతిలో బాణాలున్నాయి. వానరుల చేతిలో వృక్షములు బండరాళ్లు ఉన్నాయి. రాక్షసులు తమ వద్ద ఉన్న బల్లెములు, పట్టిసములు, బల్లెములతో వానరులను చీలుస్తున్నారు. కాని వానరులు ఏ మాత్రం భయపడక ముందుకు చొచ్చుకువస్తున్నారు. వానరులు విసిరే బండరాళ్లకింద వృక్షముల కింద పడి ఎంతోమంది రాక్షసులు మరణిస్తున్నారు. వానరులు రాక్షసులను తమ పేర్లు చెప్పి మరీ

చంపుతున్నారు రాక్షసులను. బండరాళ్ల కింద, వృక్షముల కింద పడ్డ రాక్షసులు రక్తం కక్కుకొని చస్తున్నారు. వేలకొలది రాక్షసులు మహా వృక్షముల కిందపడి నుగ్గు నుగ్గు అవుతున్నారు. రాక్షసులే కాదు, వానరులు విసిరిన బండరాళ్ల వృక్షముల కిందపడి హయములు, ఏనుగులు కూడా ఛిన్నాభిన్నం అవుతున్నాయి. వాటి మీద ఎక్కిన రాక్షస వీరులు కూడా వాటి కాళ్ల కింపడి నుగ్గు నుగ్గు అవుతున్నారు. ఆ ప్రదేశముఅంతా ఏనుగులు, గుర్రములు, రాక్షసులు, వానరుల మృతకళేబరములతో నిండి పోయింది.

వానరులు రాక్షసుల మీదికి ఎగిరి తమ వాడి అయిన గోళ్లతో వారిని రక్కి, చీలుస్తున్నారు. దానికి కోపించిన రాక్షసులు వానరులను తమ అరిచేతులతో కొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ రాక్షసులు తమను కొట్టకముందే వానరులు మహావేగంతో ఆ రాక్షసులను పిడికిళ్లతో పొడుస్తూ, పాదముల కింద పడేసి తొక్కుతూ, దంతములతో చీలుస్తున్నారు. వానరుల ధాటికి తట్టుకోలేక రాక్షస సైన్యము పారిపోతూ ఉంది.

ఇది చూచాడు ధూమ్రాక్షుడు. కోపోద్రేకంతో వానరులను ఊచకోత కోస్తున్నాడు. వానరులు ధూమ్రాక్షుడి దెబ్బకు తట్టకోలేక గుట్టలుగా పడి మరణిస్తున్నారు. రాక్షసులు కొట్టిన దెబ్బలకు వానరుల శరీరాలు రక్తసిక్తం అయ్యాయి. రాక్షసులు తాము ధరించిన త్రిశూలములతో చీలుస్తుంటే వానరుల శరీరంలోని పేగులు బయటకు వస్తున్నాయి. వానరులు రాక్షసుల మధ్య ఘోరంగా యుద్ధం జరుగుతూ ఉంది. యుద్ధంలో ముందు నిలబడ్డ ధూమ్రాక్షుడు నవ్వుతూ తన ధనుస్సు ఎక్కుబెట్టి వానరుల మీద బాణప్రయోగం చేస్తున్నాడు. ధూమ్రాక్షుని పరాక్రమానికి తట్టుకోలేక వానరులు పారిపోసాగారు.

ఇదంతా చూచిన హనుమంతుడు కోపోద్రేకంతో ఒక పెద్ద బండరాయిని తీసుకొని ధూమ్రాక్షుని వంకకు దూకాడు. ఆ రాయిని ధూమ్రాక్షుని రథంమీద బలంగా విసిరాడు. తన మీదికి వస్తున్న పెద్ద బండరాయిని చూచిన ధూమ్రాక్షుడు తన గద తీసుకొని రథము నుండి కిందికి దూకాడు. నేల మీద నిలబడ్డాడు. రథము మీద పడ్డ బండరాయి, ధూమ్రాక్షుని రథమును తుత్తునియలు చేసింది. తరువాత హనుమంతుడు చేతికందిన బండరాళ్లను, చెట్లను రాక్షసుల మీదికి విసురుతూ వారిని చంపుతున్నాడు. ఆ రాళ్ల దెబ్బకు రాక్షసుల తలలు బద్దలవుతున్నాయి. వృక్షముల కిందపడి రాక్షసులు మరణిస్తున్నారు. అది చూచి రాక్షస సైన్యము పారిపోతూఉంది.

హనుమంతుడు ఒక పెద్ద బండ రాయి తీసుకొని ధూమ్రాక్షుని వంకకు పరుగెత్తాడు. ధూమ్రాక్షుడు కూడా తన గద ఎత్తి పెద్దగా గర్జిస్తూ హనుమంతుని వంకకు పరుగెత్తాడు. ముళ్లతో నిండిన తన గదను ధూమ్రాక్షుడు హనుమంతుని పైకి విసిరాడు. ఆ దెబ్బను తప్పించుకొన్న హనుమంతుడు తాను తెచ్చిన బండశిలతో ధూమ్రాక్షుని తలపై మోదాడు. ఆ దెబ్బకు తట్టుకోలేక ధూమ్రాక్షుడు నేల మీద వెల్లకిలా పడ్డాడు. రక్తం కక్కుకొని మరణించాడు. ధూమ్రాక్షుని మరణం చూచిన రాక్షస సేనలు లంక వైపుకు పారిపోయారు. వారిని వానరులు తరిమి తరిమి కొట్టి చంపారు. ఆ ప్రకారంగా హనుమంతుని చేతిలో ధూమ్రాక్షుడు దారుణంగా మరణించాడు.

శ్రీమద్రామాయణము

యుద్ధకాండము ఏబది రెండవ సర్గ సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్